


visit us @ http://epaper.suryaa.com

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

సోమవారం | 6 జనవరి 2025 | విజయవాడ

సంపుటి 18 | సంచిక 76

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...



APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - హేమంత ఋతువు, పుష్యమి మాసం శుద్ధ సప్తమి రా.7.03 వరకు, ఉత్తరాభాద్ర రా.8.25, వర్జ్యం ఉ.6.44 నుంచి 8.15 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు దుర్ముహూర్తం మ.12.24 నుంచి 1.12 వరకు తిరిగి సా.2.46 నుంచి 3.34 వరకు

# ఢిల్లీలో అభివృద్ధి నిల్

● ఆప్ పాలన అంతా అస్త వ్యస్తం ● దేశ రాజధానిని తిరిగి పట్టాలెక్కించాల్సిన తరుణం ● ఆప్ సర్కార్ పై ప్రధాని నరేంద్ర మోడీ విమర్శలు ● నమో భారత్ కారిడార్ ప్రారంభించిన ప్రధాని ● తొలిసారి భూగర్భంలో నమో భారత్ రైళ్లు పరుగులు

ఆమ్‌ఆద్మీ ప్రభుత్వంతో దిల్లీ ప్రజలు విసిగిపోయారని ప్రధాని నరేంద్ర మో డీ విమర్శించారు. ప్రస్తుతం వారు దేశ రాజధానిని అభివృద్ధి బాటలో నడిపే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. గత పదేళ్ల ఆప్ ప్రభుత్వ పాలనలో దిల్లీ అభివృద్ధి పట్టాలు తప్పిందని మండిపడ్డారు. కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రజావ్యతిరేక పార్టీ అని దుయ్యబట్టారు. ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధాని నగరంగా దిల్లీని అభివృద్ధి చేయడం భాజపాకు మాత్రమే సాధ్యమని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు.
దేశరాజధానిలో భాజపా త్వరలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు.



6 లో

## హిందూ ధర్మాన్ని హననం చేసే

# సినిమాలను బహిష్కరించాలి

● హైందవ శంఖారావంలో సినీ గేయరచయిత అనంత శ్రీరామ్ పిలుపు ● విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం సభ ● కేసరపల్లి హైందవ శంఖరావం సభకు తరలివచ్చిన హిందువులు ● దేవాదాయశాఖను రద్దుచేయాలి: కమలానంద భారతీ స్వామిజీ డిమాండ్ ● ఆస్తులు, ఆచారాలు నాశనం చేస్తున్నారంటూ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి ఆగ్రహం



7 లో



# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్..

● నలుగురు మావోయిస్టులు హతం ● మావోయిస్టుల కాల్పుల్లో డీఆర్‌జీ కానిస్టేబుల్ చనిపోయారు ● ఘటనా స్థలంలో ఏకే 47తోపాటు సెల్ఫ్ లోడింగ్ రైఫిళ్లు స్వాధీనం ● ఆ ప్రాంతంలో ఇంకా గాలింపు కొనసాగుతుంది

వివరాలు-6లో

# సంక్రాంతి రద్దీ..

## మరో 52 అదనపు రైళ్లను ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే

సంక్రాంతి రద్దీ సందర్భంగా మరో 52 అదనపు రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. నగరంలోని సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి రైల్వేస్టేషన్ల నుంచి కాకినాడ, నర్సాపూర్, తిరుపతి, శ్రీకాకుళం ప్రాంతాలకు ఈ రైళ్లు నడపనున్నట్లు తెలిపింది.

6 లో



సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## దేశ రాజకీయాల్లో తగ్గిన

# తెలుగు ప్రాభవం




3 లో

● దేశ రాజకీయాల్లో చక్రం తప్పిన పీవీ, ఎన్టీఆర్, వెంకయ్య నాయుడు, జైపాల్ రెడ్డి ● రాజీవ్ గాంధీ వేసిన బాటను చంద్రబాబు, వైఎస్ కొనసాగించారు ● విదేశాలకు వెళ్లిన తెలుగు వారంతా ఒక్కటి కావడం అభినందనీయం ● తెలుగు సినీ రంగం అంతర్జాతీయ స్థాయిలో ప్రభావితం చేయడం గ్రేట్ ● తెలంగాణ రైసింగ్ 2050 నినాదంతో ముందుకు : సీఎం రేవంత్ రెడ్డి

## కుప్పం వంద శాతం సోలార్,

# ప్రకృతి వ్యవసాయం!



కుప్పం నియోజకవర్గాన్ని చంద్రబాబు దేశంలోనే ఓ ప్రత్యేక నియోజకవర్గంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కుప్పం ప్రజలకు అందుబాటులో ఉన్న వనరులతో వారి ఆర్థిక స్థితిగతుల్ని మార్చడానికి ఆయన చేసిన ప్రయత్నాలు ఫలితాలను ఇచ్చాయి. ఇప్పుడు కుప్పం ప్రజలు ఆర్థికంగా బలవంతులు. కుప్పం నియోజకవర్గాన్ని కూడా దేశంలోనే ప్రత్యేకంగా నిలబెట్టాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా రెండు అంశాలపై ప్రత్యేకంగా కసరత్తు చేస్తున్నారు.

వివరాలు-2లో

## ఉత్తరాంధ్రకు వైసీపీ


# ఐదేళ్లలో ఏం చేసింది?



2 లో

● విశాఖ స్టీల్ ప్లాంట్‌పై తప్పుడు ప్రచారాలు మానుకోవాలి ● ఉత్తరాంధ్రకు ఐటీ కంపెనీలు తీసుకువస్తాం ● గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు ● దేశంలో ఏ రాష్ట్రంలో ఇంత పెన్షన్ ఇవ్వడం లేదు ● మంత్రులందరం కలిసికట్టుగా పనిచేస్తున్నాం ● వైసీపీ హయాంలో సీఎం సతీమణి కోసం క్యాంప్ ఆఫీసు చాలా వింతగా ఉంది ● వైసీపీ కుంభకోణాలపై త్వరలోనే యాక్షన్! ● ప్రజలందరూ కలిసి ప్రధాని రోడ్ షో, బహిరంగ సభను విజయవంతం చేయాలి ● విశాఖలో విలేకరుల సమావేశంలో మంత్రి నారా లోకేష్

## అంతా ఇంతే!




'రైతులు'డిమాండ్‌లు తీర్చాలని 'నమో' జపం చేయాలంటారా!

## అన్ని వర్గాల సంక్షేమం,

# అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



3 లో

● వరంగల్ జిల్లా విశ్వనాథపురంలో రూ.8.40 కోట్లతో నిర్మించే మూడు 33/11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి ● ఇందిరమ్మ ఆత్మ భరోసా క్రింద త్వరలో భూమిలేని వ్యవసాయ కుటుంబాలు, కూలీలకు ప్రతి సంవత్సరం రూ. 12 వేలు ● రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం కృత నిశ్చయంతో ముందుకెళుతున్నదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.


## బీసీలు తొడగొట్టి నిలబడాలి

# కాలర్ ఎగరేసి గెలవాలి

● రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్ సీట్లలో బీసీలు పోటీ చేయాలి ● అగ్ర కులాల అభ్యర్థులను చిత్తు చిత్తుగా ఓడించాలి ● బీసీల ఓట్లు లేకుండా కనీసం వార్డ్ మెంబర్‌గా గెలుస్తారా? ● ఓట్లు మన దగ్గర ఉంటే సీట్లు అగ్రకులాలవా? ● బీసీలను ఓడగొట్టేందుకు అగ్రకులాల వాళ్ళు డ్రామాలు చేస్తారు ● బీసీల మధ్య కొట్లాట పెట్టి అగ్రకులాల వాళ్ళు లబ్ధి పొందుతున్నారు ● తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి మారిపోయింది : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ● పంచాయతీ ఎన్నికల్లో బీసీ జెండా ఎగరాలి : బిసి ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ టి చిరంజీవులు ● బీసీల రాజ్యాధికారం కోసం ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం : బత్తుల సిద్దేశ్వర్ పటేల్



7 లో



# కుప్పం వంద శాతం సోలార్, ప్రకృతి వ్యవసాయం !

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: కుప్పం నియోజకవర్గాన్ని చంద్రబాబు దేశంలోనే ఓ ప్రత్యేక నియోజకవర్గంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కుప్పం ప్రజలకు అందుబాటులో ఉన్న వనరులతో వారి ఆర్థిక స్థితిగతుల్ని మార్చడానికి ఆయన చేసిన ప్రయత్నాలు ఫలితాలను ఇచ్చాయి. ఇప్పుడు కుప్పం ప్రజలు ఆర్థికంగా బలవంతులు. కుప్పం నియోజకవర్గాన్ని కూడా దేశంలోనే ప్రత్యేకంగా నిలబెట్టాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా రెండు అంశాలపై ప్రత్యేకంగా కసరత్తు చేస్తున్నారు. ఒకటి వంద శాతం ప్రకృతి వ్యవసాయం, రెండువంద శాతం సోలార్ పవర్ నియోజకవర్గం.
సోలార్ పవర్ ప్రతి ఇంటిపై ఉండేలా చూసేందుకు చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. వంద శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. కొన్ని ఇళ్లకు అమర్చారు. వారికి కలుగుతున్న ప్రయోజనాలను పరిశీలిస్తున్నారు. సంతృప్తికరంగా ఉంటేమొత్తం విస్తరించనున్నారు. వచ్చే ఐదేళ్లలో మొత్తం కుప్పం నియోజకవర్గం పవర్.. సోలారు ఆధారంగా ఉండేలా చేయనున్నారు. అప్పుడు అందరికీ విద్యుత్ బిల్లుల ఖర్చు ఉండదు. అంతే కాదు మిగులు విద్యుత్ గ్రిడ్ కు అనుసంధానిస్తే ఎంతో కొంత ఆదాయం వచ్చే అవకాశం ఉంది.అలాగే కుప్పం నియోజకవర్గానికి వ్యవసాయ పరంగా ఎంతో పేరు ఉంది. ఇప్పుడు ప్రపంచం అంతా ఆర్గానిక్ వైపు మారుతోంది. ఈ క్రమంలో కుప్పంలోని రైతులు అందర్నీ ఆర్గానిక్ వైపు మళ్లించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం దిశగా వారిని ప్రోత్సహిస్తున్నారు. అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే ప్రకృతి వ్యవసాయం రాత్రికి రాత్రి అయ్యేది కాదు కాబట్టి పదేళ్లు టార్గెట్ పెట్టుకున్నారు. పదేళ్లలో కుప్పం మొత్తం ప్రకృతి వ్యవసాయం చేసే నియోజకవర్గంగా మార్చాలని నిర్ణయించుకున్నారు.

# ఉత్తరాంధ్రకు వైసీపీ ఐదేళ్లలో ఏం చేసింది?

- విశాఖ స్టీల్ ప్లాంట్ పై తప్పుడు ప్రచారాలు మానుకోవాలి
- ఉత్తరాంధ్రకు ఐటీ కంపెనీలు తీసుకువస్తాం
- గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు
- దేశంలో ఏ రాష్ట్రంలో ఇంత పెన్షన్ ఇవ్వడం లేదు
- మంత్రులందరం కలిసికట్టుగా పనిచేస్తున్నాం
- వైసీపీ హయాంలో సీఎం సతీమణి కోసం క్యాంప్ ఆఫీసు చాలా వింతగా ఉంది
- వైసీపీ కుంభకోణాలపై త్వరలోనే యాక్షన్!
- ప్రజలందరూ కలిసి ప్రధాని రోడ్ షో, బహిరంగ సభను విజయవంతం చేయాలి
- విశాఖలో విలేకరుల సమావేశంలో మంత్రి నారా లోకేష్



విశాఖపట్నం: ఉత్తరాంధ్ర కోసం ఐదేళ్లలో వైసీపీ చేసిందేమీ లేదని, కనీసం రైల్వే జోన్ కు భూమి కూడా ఇవ్వలేదని, ఒక్క ఐటీ కంపెనీ తీసుకురాలేదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో విశాఖ కలెక్టరేట్ లో సమీక్ష అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఈ రోజు ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేసుకున్నాం. 8వ తేదీన ప్రధానమంత్రి గారు ఆంధ్ర రాష్ట్రానికి వస్తున్నారు. అందులో భాగంగా సుమారు కిలోమీటర్ వరకు రోడ్ షో ఉంటుంది. దీనితర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి గారు శంకుస్థాపన చేస్తారు. 2014 నుంచి ఎన్డీయే ప్రభుత్వ నినాదం ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని-అభివృద్ధి వికేంద్రీకరణ. ఇందులో భాగంగా దాదాపు ఐదు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్ కు శంకుస్థాపన చేస్తున్నాం. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ.. దాదాపు రూ.70వేల కోట్ల పెట్టుబడితో ఉత్తరాంధ్రలో ప్లాంట్ రాబోతోంది. నెల్లూరుకు వచ్చేసరికి చెన్నై-విశాఖ ఇండస్ట్రియలన్ కారిడార్ లో క్రిస్ సిటీ కృష్ణపట్నంలో కేంద్ర ప్రభుత్వం నోడ్ శాంక్షన్ చేసింది. నిధులు కూడా కేటాయించారు. ఆ నోడ్ వల్ల పెట్టుబడులు, లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయి. ఈ నోడ్ కు కూడా శంకుస్థాపన చేస్తారు. పలు జాతీయ రహదారులను నిర్మించడం జరుగుతుంది. సుమారు రూ.5వేల కోట్లు ఖర్చుపెట్టి కొత్త ప్రాజెక్టులు చేపట్టనున్నాం. ఇప్పటికే పూర్తన ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. రైల్వే జోన్ అందరి కల. జోనల్ హెడ్ క్వార్టర్ విశాఖలో ఉండాలని ఉత్తరాంధ్ర ప్రజలు కోరుకుంటున్నారు. గత ప్రభుత్వం కనీసం భూమి కూడా కేటాయించలేదు. దీనివల్ల ఆలస్యమైంది. భూమి మన ప్రభుత్వం కేటాయించింది. హెడ్ క్వార్టర్ ఏర్పాటుచేసేందుకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఇవేకాకుండా పలు రైల్వేకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు కూడా ప్రధానమంత్రిగారు శంకుస్థాపన చేయనున్నారు.

**పధాని రోడ్ షో ను డబుల్ సక్సెస్ చేయాలి**

అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి కోసం ఎన్డీయే ప్రభుత్వం కృషిచేస్తోంది. బహిరంగ సభను ప్రజలందరూ విజయవంతం చేయాలని కోరుతున్నాం. చిలకలూరిపేటలో గతంలో బహిరంగ సభ ఏర్పాటుచేశాం. అది బంపర్ సక్సెస్ అయింది. విజయవాడలో రోడ్ షో చేశారు. అది కూడా సక్సెస్ అయింది. ఇది కూడా డబుల్ సక్సెస్ చేయాలనే తపనతో పనిచేస్తున్నాం. ప్రజలు కూడా స్వచ్ఛందంగా తరలివచ్చి ప్రధాని అండగా నిలబడాలి. గత బడ్జెట్ లో కూడా ఏపీకి ప్రత్యేక కేటాయింపులు చేశారు. దారితప్పిన రాష్ట్రాన్ని సరైన దారిలో పెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఇప్పటికే చాలా అప్పులపాలయ్యాం. వడ్డీ కట్టేందుకే అవస్థలు పడుతున్నాం. కేంద్ర సహకారం చాలా అవసరం. పోలవరానికి రూ.2వేలకోట్ల నిధులు ఇచ్చారు. నిర్వాసితులకు దాదాపు రూ.900 కోట్లు విడుదల చేశారు. ప్రస్తుత పెట్టుబడుల ద్వారా దాదాపు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ కు ఆర్థిక ఇబ్బందులు ఉన్నమాట వాస్తవం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు. తప్పుడు ప్రచారాలు మానుకోవాలి. వైసీపీ ఫేక్ పార్టీ. ఉత్తరాంధ్రకు వైసీపీ ఐదేళ్లలో ఏం చేసింది? కనీసం రైల్వే జోన్ కు భూమి కూడా ఇవ్వలేదు. ఒక్క ఐటీ కంపెనీ తీసుకురాలేదు. ఉన్న కంపెనీలు వెళ్లిపోయాయి. టీసీఎస్ మేం తీసుకువచ్చాం. రుషికొండ తప్ప వైసీపీ హయాంలో ఉత్తరాంధ్రకు చేసిందేమీ లేదు. మేం డేటాసెంటర్ తీసుకువస్తే మహారాష్ట్రకు తరిమేశారు. లులూ తరిమేశారు. హెచ్ఎస్ బీసీ మూతపడింది. కియా పరిశ్రమను చంద్రబాబు గారు తీసుకువస్తే.. ఆత్మలతో మాట్లాడే జగన్ రెడ్డి.. వైఎస్ తీసుకువచ్చారని దుష్ప్రచారం చేశారు. టీసీఎస్ విషయంలో కూడా ఇంతే. హుద్ హుద్, తిత్లీ తుఫాను, విజయవాడ వరదల సమయంలో సాయం ప్రకటించిన జగన్ రెడ్డి.. ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేశారో చెప్పాలి. రాష్ట్ర సమగ్రాభివృద్ధి మా నినాదం. విశాఖను ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దుతాం.

**దేశంలో ఏ రాష్ట్రంలో ఇంత పెన్షన్ ఇవ్వడం లేదు :**

సీపీఎస్ రద్దు, సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తామన్న జగన్ రెడ్డి ఎందుకు చేయలేదు? వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచేందుకు ఐదేళ్ల సమయం తీసుకున్నారు. మేం అధికారంలోకి వచ్చిన మొదటి వంద రోజుల్లో వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచాం. దేశంలో ఏ రాష్ట్రంలో ఇంత పెన్షన్ ఇవ్వడం లేదు. అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించాం. దీపం పథకం అమలు చేస్తున్నాం. తల్లికి వందనం డేట్స్ ఇచ్చాం, రైతులకు ఇవ్వాల్సింది కూడా తేదీలు ప్రకటించాం. మత్స్యకారులకు ఇస్తున్నాం. మత్స్యకారులకు ఎందుకు బకాయిలు పెట్టారు, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఎందుకు పెట్టారు? స్కూల్ కిట్ కు వెయ్యి కోట్లు బకాయిలు పెట్టారు. అవన్నీ మేం చెల్లిస్తున్నాం. ఎన్టీఆర్ వైద్యసేవకు రూ.1800 కోట్లు బకాయిలు పెడితే మేం చెల్లిస్తున్నాం. మేం పారిపోవడం లేదు. ప్రతి నెల రూ.4వేల కోట్ల డెఫిసిట్ తో బడ్జెట్ నడుస్తోంది. జీతాలు ఇవ్వడానికి ప్రభుత్వం ఇబ్బందులు పడుతోంది. కేంద్రం సహకారంతో నెట్టుకుని వస్తున్నాం. టైం పడుతుంది. వైసీపీ విధ్వంసం వల్లే ఇదంతా. పారిశ్రామిక వేత్తలను వైసీపీ ఇబ్బందులు పెట్టడంతో వారు పెట్టుబడులు పెట్టేందుకు భయపడుతున్నారు.

**ఉత్తరాంధ్రకు ఐటీ కంపెనీలు తీసుకువస్తాం**

మిలీనియం టవర్ లో టీసీఎస్ వస్తుంది. ట్రాన్సిట్ బిల్డింగ్ గా వినియోగిస్తారు. టీసీఎస్ సెంటర్ నిర్మాణం కోసం రెండు, మూడేళ్ల సమయం పడుతుంది. అప్పటివరకు ట్రాన్సిట్ గా తీసుకుని ఫేజ్-1లో రెండు వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తారు. వారికి భూములు కూడా చూపించడం జరుగుతుంది. ఐటీ కంపెనీలకు పెద్ద సెంటర్ కూడా నిర్మిస్తాం. పెద్దఎత్తున ఉత్తరాంధ్రకు ఐటీ కంపెనీలు తీసుకువస్తాం.



**గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు**

గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. అరకు కాఫీని రూ.300 కోట్ల నుంచి రూ.3వేల కోట్ల బ్రాండ్ కు తీసుకువెళ్తాం. గంజాయి నియంత్రణకు ప్రత్యేకంగా ఈగల్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటుచేశాం. అదనంగా నిధులు కూడా కేటాయిస్తున్నాం. ప్లాంటేషన్ ను కట్టడి చేస్తాం. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో డ్రగ్స్ వద్దు బ్రో నినాదంతో ముందుకు వెళ్తున్నాం.

**మంత్రులందరం కలిసికట్టుగా పనిచేస్తున్నాం**

బీసీల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం కృషిచేస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎస్, డీజీపీ, టీటీడీ ఈవో బీసీ సామాజికవర్గాలకు అవకాశం కల్పించాం. మంత్రులందరం కలిసికట్టుగా పనిచేస్తున్నాం. లోపాలు ఏవైనా ఉంటే ఓపెన్ గా మాట్లాడుకుంటున్నాం. వైసీపీది దుష్ప్రచారం మాత్రమే. మేం పరదాలు కట్టుకుని తిరగడం లేదు. జగన్ సెక్యూరిటీతో పోల్చుకుంటే చంద్రబాబు గారిది 30శాతమే.

**చాలా వింతగా సీఎం సతీమణి కోసం క్యాంప్ ఆఫీసు**

రుషికొండను ఏం చేయాలో మాకే అర్థం కావడం లేదు. రూ.700 కోట్లు దుర్వినియోగం చేశారు. పాత బిల్డింగ్ మరో రూ.300 కోట్లు. మొత్తం వెయ్యి కోట్లు వృథా అయ్యాయి. వైసీపీ హయాంలో సీఎం సతీమణి కోసం క్యాంప్ ఆఫీసు చాలా వింతగా ఉంది. ముఖ్యమంత్రి సతీమణి కోసం క్యాంప్ ఆఫీసు ఎప్పుడూ వినలేదు. దేశంలో కూడా ఎక్కడా లేదు. సజ్జల రామకృష్ణారెడ్డి అటవీ భూముల ఆక్రమణ, మద్యం అంశంపై విచారణ జరుగుతోంది. వైసీపీ హయాంలో అన్ని కుంభకోణాలపైనా విచారణ జరుగుతోంది. త్వరలో యాక్షన్ ఉంటుందని నేను భావిస్తున్నా. వాలంటీర్ల కోసం జీవోను జగన్ రెడ్డి ఎందుకు రెన్యువల్ చేయలేదు?

**ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వానిది**

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.5వేల కోట్లు అవసరం. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటుంది. గత వైసీపీ ప్రభుత్వం చేతగానితనం వల్ల 5 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి దూరమయ్యారు. జూనియర్ కాలేజీలను పట్టించుకోలేదు. సాంఘిక సంక్షేమ హాస్టల్స్ ను పట్టించుకోలేదు. మేం దృష్టిపెట్టాం.



# లోకేష్‌కి ఉప ముఖ్యమంత్రి పదవి?

## అనగాని సత్య ప్రసాద్ కు ఉద్వాసనా...శాఖ మార్పా?!



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : త్వరలో జరగనున్న మంత్రి వర్గ వునర్వ్యవస్థీకరణలో సత్యప్రసాద్ శాఖ మారుతుందా? లేక పూర్తిగా ఉద్వాసన జరుగుతుందా అనే చర్చ రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది.తొలి సారి మంత్ర వర్గంలో చోటు దక్కించుకున్న ఆయనకు అసలు, ఆ శాఖ ఇవ్వటను పెద్ద సంచలనంగా మారింది. విచిత్రం ఏమిటి అంటే ఆంధ్రప్రదేశ్ ఆరు నెలలు కూడా దాటక ముందే ఏకంగా మంత్రులపై భుత్వం పైపెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు రాపటం కలకలం రేవుతోంది. అయితే ఇప్పుడు ఆంధ్ర ప్రదేశ్ మంత్రి వర్గంలో ఈ వ్యవహారం అంతా నివురు గప్పిన నిప్పులాగా ఉంది అనే ప్రచారం కూడా సాగుకొంది. అడ్డగోలు పనులు చేసే కొంత మంది మంత్రులు. ఎమ్మెల్యేలు కూడా ఎవరి స్థాయిలో వాళ్ళు దోచుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు అనే చర్చ పార్టీ నాయకుల్లోనే సాగుతోంది. మార్చిలో జరగనున్న వునర్వ్యవస్థీకరణలో ఇప్పుడు ఉన్న ఐటీ శాఖను కూడా ఉంచి లోకేష్ కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చే అవకాశాలు ఉన్నట్టు వినికిడి. రెవిన్యూ శాఖలో చోటు చేసుకుంటన్నన పరిణామాలు ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా జరుగుతున్నాయా అని కొంత మంది నేతలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

రబీ సీజన్ కి అవసరానికి మించి

# ఎరువుల కేటాయింపు

## సహకరించిన కేంద్ర ప్రభుత్వం
## కృతజ్ఞతలు తెలిపిన వ్యవసాయ శాఖ మంత్రి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రానికి రబీ సీజన్ పంట కాలానికి అవసరమైన మేరకు అన్ని రకాల ఎరువులను లక్ష్యానికి మించి కేంద్ర ప్రభుత్వం కేటాయించినందుకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు . ఈ కేటాయింపుల్లో సహకరించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరావు రామ్మోహన్ నాయుడుకి కృతజ్ఞతలు, తెలిపారు. వ్యవసాయ శాఖ సంచాలకులు డిల్లీరావుకు ఈ కేటాయింపులపై తగిన సూచనలు ఇచ్చినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తెలిపారు. రైతులకు యూరియా ఎరువును సకాలములో అందించటానికి పంపిణీ ఏర్పాట్లు చేయవలసినదిగా కోరారు .పారులు ఎక్కువ ధరలకు అమ్మటం కానీ ,నల్ల బజారుకు తరలించడం వంటి వాటిని నిరోధించాలని ఆయన కోరారు.

# నిన్న పవన్ కళ్యాన్ ...నేడు నారా లోకేష్

- 9 న అనంతపురంలో బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ సినిమా ఫంక్షన్‌కు ముఖ్య అతిధిగా లోకేష్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిది : ఇంకొద్ది రోజుల్లో తెలుగు లోగిళ్లల్లో సంక్రాంతి పండగ సందడి నెలకొనబోతోంది. దీనికోసం రెండు తెలుగు రాష్ట్రాలు సిద్ధమౌతోన్నాయి. ఇంటి ముందు రంగవల్లులు, కోడిపందేలు, గంగిరెద్దుల ఆటలతో వారం రోజుల పాటు ఏపీ, తెలంగాణల్లో పండగ కోలాహలం ఏర్పడనుంది. సంక్రాంతి సినిమాల కోలాహలం.. ఇక కొత్త సినిమాలకు కొదవ ఉండట్లేదు. స్టార్ హీరోలు నటించిన మూవీలు ప్రేక్షకుల ముందుకు రాబోతోన్నాయి. థియేటర్లను ముంచెత్తనున్నాయి. ఈ సంక్రాంతి సీజన్‌లో మూడు భారీ బడ్జెట్ సినిమాలు విడుదల కానున్నాయి. సంక్రాంతి రేసులో పోటీ పడుతోన్నాయి.


అన్‌స్టాపబుల్ షోలో అల్లు ప్రస్తావన తెచ్చిన రామ్ చరణ్ 10న గేమ్ ఛేంజర్.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ ఈ నెల 10వ తేదీన విడుదల కాబోతోంది. 300 కోట్ల రూపాయల వ్యయంతో తెరకెక్కిన మూవీ ఇది. ఎస్ శంకర్ దర్శకుడు. దిల్ రాజు నిర్మాత. ఇప్పటికే ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్.. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్ర సమీపంలోని వేమవరంలో ముగిసింది కూడా. దీనికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ హాజరయ్యారు. తన సొంత అన్న మెగాస్టార్ చిరంజీవి తనయుడు నటించిన సినిమా కావడం వల్ల ఈ ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గేమ్ ఛేంజర్ సూపర్ హిట్ కావాలని ఆకాంక్షించారు.

ఇక నందమూరి బాలకృష్ణ నటించిన మూవీ డాకు మహరాజ్. ఈ నెల 12వ తేదీన థియేటర్లలోకి రానుంది. బాబీ కొల్లి దర్శకుడు. మెగాస్టార్ చిరంజీవితో తీసిన వాల్తేరు వీరయ్య తరువాత ఆయన దర్శకత్వంలో రాబోతోన్న మూవీ ఇదే కావడం, దీని టైటిల్, బాలయ్య గెటప్ కొత్తగా ఉండటం సినిమాపై హైప్ క్రియేట్ చేసింది. ఎన్నో అంచనాలు.. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, పాయల్ రాజ్‌పుత్, ఊర్వశి రౌతెలా, బాబీ డియోల్, ప్రకాష్ రాజ్, రోనిత్ రాయ్ నటించిన ఈ మూవీపై ఎన్నో అంచనాలు ఉన్నాయి. భగవంత్ కేసరి బ్లాక్ బస్టర్ తరువాత బాలయ్య నటించిన మూవీ ఇదే కావడం వల్ల అభిమానుల్లో మంచి హైప్ క్రియేట్ అయింది.

14న వెంకి మూవీ.. విక్టరీ వెంకటేష్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం మూవీ పేరుకు తగ్గట్టే పండగ రోజున అంటే 14వ తేదీన విడుదల కానుంది. అనిల్ రావిపూడి దర్శకుడు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్, నరేష్, రాజేంద్రప్రసాద్, వీటీవీ గణేష్, సాయికుమార్.. ఇతర ముఖ్యపాత్రలను పోషించారు. అవుట్ అండ్ అవుట్ హిలేరియస్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొంది మూవీ. అనంత వేదికగా.. కాగా డాకు మహరాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్.. అనంతపురంలో నిర్వహించబోతోంది చిత్రం యూనిట్. ఈ విషయాన్ని ఇదివరకే వెల్లడించింది కూడా. ఈ నెల 9వ తేదీన సాయంత్రం అనంతపురం ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఈ ప్రోగ్రామ్ జరగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఈవెంట్‌కు మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరు కాబోతోండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. మామ బాలయ్యతో కలిసి వేదికను పంచుకోనున్నారాయన. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన తరువాత నారా లోకేష్ ఓ సినీ కార్యక్రమానికి హాజరు కాబోతోండటం ఇదే తొలిసారి.

# రాష్ట్రంలో హెచ్‌ఎంపివి కేసులు లేవు

- వైరస్ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరమేమీ లేదు
- ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : చైనాలో గుర్తించిన మరో కొత్త వైరస్ హెచ్‌ఎంపివి (హ్యూమన్ మెటా న్యూమో వైరస్) కి సంబంధించిన కేసులు రాష్ట్రంలో ఎక్కడా లేవని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ వైరస్ కారణంగా ప్రజలెవరూ భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు.

న్యూమో విరిలే కుటుంబానికి చెందిన ఈ వైరస్ కరోనా వైరస్ తరహాలోనే ఒకరి నుండి మరొకరికి సంక్రమిస్తుందని ఆమె తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధకశక్తి తక్కువగా వున్న వారిపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా వుంటుందన్నారు. వైరస్ సోకిన వారి దగ్గు, తుమ్ముల వల్ల వెలువడే తుంపర్ల ద్వారా, వారితో సన్నిహితంగా మెలగటం, కరచాలనం, స్పర్శ వంటి చర్యల ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుందని ఆమె వివరించారు.

పాత్రలపై వైరస్ ఉన్నట్లయితే, తాకిన తరువాత అదే చేతితో నోరు, ముక్కు, కళ్లను తాకటం ద్వారా మన శరీరంలోకి ఈ వైరస్ వ్యాపిస్తుందని నివుణులు నిర్ధారించినట్లు ఆమె పేర్కొన్నారు. వైరస్ సోకిన తరువాత వ్యాధి లక్షణాలు 3 నుండి 10 రోజులలోగా బయటపడతాయన్నారు. హెచ్‌ఎంపివి సోకిన వారికి సాధారణ జలుబు (ఫ్లూ) లాంటి లక్షణాలు వుంటాయన్నారు. దగ్గు, ముక్కు దిబ్బెడ, ముక్కు కారడం, గొంతు నొప్పి, శ్వాస సంబంధిత సమస్యలు కూడా కన్పిస్తాయని ఆమె తెలిపారు. కొన్నిసార్లు న్యూమోనియా, బ్రాంకైటిస్ (ఆస్తమా) వంటి శ్వాసకోశ సమస్యలకు కూడా ఇది దారి తీస్తుందన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ వ్యాధి నిరోధకశక్తి తక్కువగా వున్న వారిలో ఈ వైరస్ తీవ్ర అనారోగ్యాన్ని కలిగిస్తుందన్నారు.

వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి కోవిడ్ సమయంలో పాటించిన తరహాలోనే జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. 20 సెకన్లపాటు సబ్బు నీటితో తరచూ చేతులను శుభ్రంగా కడుక్కోవడం, దగ్గినవుడు, తుమ్మినవుడు, నోటిని, ముక్కుని చేతిరుమాలుతో అడ్డు పెట్టుకోవాలన్నారు. రద్దీగా వుండే ప్రదేశాలకు దూరంగా వుండటం, వాడిన వస్తువులను ఇతరులతో పంచుకోకుండా వుండటం వంటి చర్యలతో పాటు తగినంత పౌష్టికాహారం, మంచినీరు తీసుకోవాలని, తగినంత నిద్ర పోవాలని సూచించారు. వైరస్ లక్షణాలు కన్పించిన వారు క్వారంటైన్ లో వుండటం మంచిదని ఆమె తెలిపారు. వైరస్ సోకిన వ్యక్తులు లేదా లక్షణాలు కన్పిస్తున్న వ్యక్తులు ఇతరులతో కరచాలనం చేయరాదని, ఉపయోగించిన టవల్స్, రుమాళ్ల వంటి వాటిని మళ్లీ వాడరాదని, చేతులతో తరచు కళ్లు, ముక్కు, నోటిని తాకరాదని, బహిరంగ ప్రదేశాలలో ఉమ్మివేరయాదని సూచించారు. అదే విధంగా వైరస్ లక్షణాలున్న వ్యక్తులకు సమీపంగా ఇతరులు వుండకూడదన్నారు. వైరస్ సోకినట్లు అనుమానం వున్న వారు వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని, ఎటువంటి సొంత వైద్య చేసుకోకూడదని ఆమె సూచించారు.

ఇప్పటి వరకూ హెచ్‌ఎంపివికి నిర్దిష్టమైన యాంటీ వైరల్ చికిత్స అనేది లేదన్నారు. వ్యాక్సిన్లు కూడా అభివృద్ధి చేయలేదన్నారు. ఆరోగ్య సంరక్షణ కోసం నొప్పి నివారణ మందులు, ఆక్సిజన్ తెరపీ వంటివి ఇవ్వటం జరుగుతోందన్నారు. వైరస్ తీవ్రతకు ఎక్కువగా గురయ్యే చిన్న పిల్లలు, వృద్ధులకు ప్రభుత్వ ఆస్పత్రులలో తగిన చికిత్స అందిస్తారని ఆమె తెలిపారు. ప్రస్తుతం వైరస్ వ్యాప్తి తక్కువ స్థాయిలోనే వుందని, ఇప్పటి వరకూ మన భారత దేశంలో కానీ, ఏపీలో కానీ ఎక్కడా కేసులు నమోదు కాలేదని ఆమె స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటున్నాయని డాక్టర్ పద్మావతి వివరించారు.

# మొన్న సెల్ఫోన్లు - తాజాగా గంజాయి

- విశాఖ సెంట్రల్ జైల్ను సందర్శించిన హోంమంత్రి అనిత
- గత ప్రభుత్వ నిర్వాకం వల్లే జైళ్లలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని మండిపాటు




విశాఖపట్నం: విశాఖ సెంట్రల్ జైలులో సెల్ఫోన్లు దొరకడంపై విచారణ జరుగుతోందని హోంశాఖ మంత్రి అనిత స్పష్టం చేశారు. కారాగారంలో పరిసరాలను అధికారులతో కలిసి హోంమంత్రి పరిశీలించారు. జైల్లో ప్రస్తుత పరిస్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హోంమంత్రి మాట్లాడుతూ విశాఖ సెంట్రల్ జైల్లో గంజాయి సరఫరా ఆరోపణలు వచ్చాయని, పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం తప్పిదాల వలనే విశాఖ సెంట్రల్ జైల్లో ఇలాంటి పరిస్థితి వచ్చిందని, ఖైదీల రక్షణే ముఖ్యమని అన్నారు.

ఇటీవలే జైల్లో సెల్ ఫోన్లు బయటపడ్డాయని, సెల్ ఫోన్లు బయటపడిన చోట సైతం పరిశీలించామని, విచారణ అనంతరం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఫోన్లో ఎవరు ఎవరితో మాట్లాడారో తెలుసుకుని వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జైలులో గంజాయి మొక్క కనిపించిందని, విధులు సమర్థవంతంగా నిర్వహించకపోతే, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని, ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని హోంమంత్రి అనిత తేల్చిచెప్పారు.

జైలులో ఎక్కడా భద్రతా లోపాలు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్లే జైళ్లలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆరోపించారు. వాటిని సరిదిద్దుతున్నట్లు చెప్పారు.

విచారణ చేసిన తర్వాతే విశాఖ సెంట్రల్ జైల్లో ఉద్యోగులను బదిలీ చేస్తామని, ఇప్పటి వరకు ఎవ్వరిని సస్పెండ్ చేయలేదని అన్నారు. యూనిఫాం సర్వీసులో ఉన్నవారు ధర్నాలో, బందులో పాల్గొనకూడదని, కొత్త సూపరింటెండెంట్ సెంట్రల్ జైల్ను ప్రక్షాళన చేస్తున్నారన్నారు. టెక్నాలజీని కూడా ఉపయోగించుకుంటామని, సెంట్రల్ జైల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, పది రోజుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

విశాఖ జైలు నుంచి ఇతర జైళ్లకు: విశాఖ సెంట్రల్ జైల్ నుంచి కొంతమంది ఖైదీలను రాజమండ్ర జైల్కు తరలిస్తున్నామన్నారు. గత ఐదు సంవత్సరాలు సెంట్రల్ జైల్ను విజిట్ చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. గత ప్రభుత్వం శాంతిభద్రతల అంశం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. టెక్నాలజీ నుంచి ఎవరూ తప్పించుకోలేరన్నారు. పది, పదిహేను రోజుల్లో సెల్ ఫోన్ వ్యవహారంలో విచారణ రిపోర్టు వస్తుందని, జైల్లో సిబ్బందిని పెంచుతామని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

గత ప్రభుత్వం జైళ్ల గురించి పూర్తిగా పట్టించుకోలేదు. అందువల్లే ప్రస్తుతం ఈ పరిస్థితి. జైళ్లలో సెల్ఫోన్లు కూడా బయటపడ్డాయి. దీనిపై విచారణ చేస్తాం. తప్పుచేసిన ప్రతి ఒక్కరినీ శిక్షిస్తాం. జైలు లోపల గంజాయి మొక్క కూడా కనిపించింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగితే ఉపేక్షించేది లేదు. సిబ్బందిని సైతం పెంచుతామని హోంమంత్రి అనిత పాత్రికేయులతో చెప్పారు.

# పిన్నెల్లి ప్రధాన అనుచరుడు కిశోర్ అరెస్ట్



హైదరాబాద్: ఏపీలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో మాచర్లలో టీడీపీ నేతలు బోండా ఉమ, బుద్దా వెంకన్నలపై వైసీపీ శ్రేణులు దాడి చేశారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడిగా ఉన్న కిశోర్ ను హైదరాబాద్ లో పోలీసులు అరెస్టు చేశారు.

ఇక వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో తురగా కిశోర్ పలు అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడినట్టు ఆరోపణలు సైతం ఉన్నాయి. గత ఏడాది జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కిశోర్ వెంటనే అజ్ఞాతంలోకి వెళ్లాడు. అప్పటి నుంచి అతని కోసం పోలీసులు గాలిస్తూనే ఉన్నారు.

# మాధవీలతకు సారీ చెప్పిన జేసీ



తాడిపత్రి : నోరు జారానంటూజేసీ ప్రభాకర్రెడ్డి సారీ చెప్పారు.. మాధవీలతను ఆ మాట అన్నందుకు మాత్రమే సారీ అంటూ.. బిజెపి వాళ్లపై మరోసారి చెలరేగిపోయారు.. అలాగే నోట్ల కట్టలు తన ఎదురుగా ఉన్న టీ పాయ్పై విసురుతూ ఇంకొన్ని సీరియస్ కామెంట్స్ చేశారు. తాను పిలుపిస్తే చాలు కట్టలకు కట్టలు నోట్లు వచ్చి పడతాయంటున్నారుజెస ఆ డబ్బంతా తాడిపత్రి అభివృద్ధికే వాడతానంటున్నారు. న్యూఇయర్ సందర్భంగా చందాలు అడిగితే ఇదిగో ఇలా కట్టలకు కట్టలు వచ్చాయంటున్నారు. తాడిపత్రి అంటే జెసీ జెసీ అంటే తాడిపత్రి అంటున్నారు.. తాను ఒక్క పిలుపిస్తే కోట్లకు కోట్లు వచ్చిపడతాయని.. అదీ తన పవరని చెప్పుకొచ్చారు. తాను మరీ అంత నీచుడిని కాదని.. ఎవరికీ సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేదని కామెంట్స్ చేశారు.. థర్టీఫస్ట్ రాత్ర జెసీ పార్క్లో ఏర్పాటు చేసిన వేడుకలపై బిజేపీమహిళా నేతలు మాధవీలత, సాదినేని యామిని విమర్శలు చేసిన నేపథ్యంలో తాను నోరు జారినందుకు సారీ చెప్పారు. ఆవేశంలో నోరు జారా.. అలా మాట్లాడి ఉండాల్సింది కాదన్నారు. బూతు పదం వాడినందుకు క్షమాపణ కోరుతున్నా అని అన్నారు జేసీ. మాధవీలతకు సారీ చెప్తూనే.. తనపై విమర్శలు చేస్తున్న వాళ్లను టార్గెట్ చేశారు.నోట్ల కట్టలు టేబుల్పై విసురుతూ.. తాను పిలుపిస్తే ప్రజల నుంచి వచ్చే స్పందన ఇది అంటూ చెప్పుకొచ్చారు. జేసీ పార్కు చందాల వసూళ్లపైనా ప్రభాకర్రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.. తాను ఎవరినీ బలవంతంగా డబ్బులు అడగలేదన్నారు. తాడిపత్రి ప్రజలకు తనపై ప్రేమ ఉంది కాబట్టే.. కట్టలు కట్టలు డబ్బులు చందాలుగా ఇస్తున్నారన్నారు. ఇక తనపై విమర్శలు చేసేవాళ్లంతా ఫ్లెక్సీగాళ్లే అంటూ మండిపడ్డారు జేసీ ప్రభాకర్ రెడ్డి. అదృష్టం కలిసివచ్చి కొందరు నాయకులు అయ్యారని విమర్శించారు. తనపై మాట్లాడే వాళ్లు ప్రజలకు మేలు చేస్తే బాగుంటుందన్నారు.




# ఏడాదిలో 55,143 ఉద్యోగాలు : ఇది దేశంలోనే రికార్డు

తెలంగాణ బ్యూరోప్రతినిధి: వెనుకబడిన రాష్ట్రమైన బిహార్ నుంచి అత్యధికంగా ఐఏఎస్లు వస్తున్నారని సీఎం రేవంతడ్డి అన్నారు. అక్కడ ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వల్లే ఎక్కువ మంది ఐఏఎస్లు, ఐపీఎస్లు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాభవన్లో నిర్వహించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సివిల్స్ మెయిన్స్ ఉత్తీర్ణత సాధించి.. ఇంటర్వ్యూకు ఎంపికైన 20 మంది అభ్యర్థులకు ఆర్థిక సాయం అందించారు. ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ నుంచి సివిల్స్ అభ్యర్థులకు సాయం చేస్తున్నట్లు తెలిపారు. బిహార్ను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలో ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు చెప్పారు. దీన్ని ఆర్థిక సాయంగా కాకుండా ప్రోత్సాహకంగా భావించాలన్నారు. వీరంతా సివిల్స్లో విజయం సాధించి తెలంగాణకే రావాలని ఆకాంక్షించారు. తెలంగాణ అధికారులు కేంద్రంలో ఉన్నా రాష్ట్రం కోసం కృషి చేయాలి. మా ప్రభుత్వం వచ్చాక ఏడాదిలో 55,143 ఉద్యోగాలు ఇచ్చాం. ఇది దేశంలోనే రికార్డు. పదేళ్లలో పేరుకుపోయిన ఖాళీలను భర్తీ చేస్తూ ఇప్పుడు ఉద్యోగాలు ఇస్తున్నాం. దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలబడింది. గతంలో ఎన్నడూ 563 గ్రూప్ 1 ఉద్యోగాలు ఇవ్వలేదు. 14 ఏళ్లుగా వీటి నియామకాలు చేపట్టలేదు. ఇన్ని ఉద్యోగాలు ఇవ్వడం ఇష్టం లేక అడ్డుకునే కుట్ర చేశారు. గ్రూప్ 1పై కుట్రలన్నీ ఛేదించి పరీక్షలు నిర్వహించాం. ఈ విషయంలో కోర్టులు ప్రభుత్వానికి అండగా నిలిచాయి.

# దేశ రాజకీయాల్లో తగ్గిన తెలుగు ప్రాభవం

## ఏ భాష నేర్చుకున్నా తెలుగులో ప్రాధాన్యత తగ్గించవద్దు

- దేశ రాజకీయాల్లో చక్రం తిప్పిన పీవీ, ఎన్టీఆర్, వెంకయ్య నాయుడు, జైపాల్ రెడ్డి
- రాజీవ్ గాంధీ వేసిన బాటను చంద్రబాబు, వైఎస్ కొనసాగించారు
- విదేశాలకు వెళ్లిన తెలుగు వారంతా ఒక్కటి కావడం అభినందనీయం
- తెలుగు సినీ రంగం అంతర్జాతీయ స్థాయిలో ప్రభావితం చేయడం గ్రేట్
- తెలంగాణ రైసింగ్ 2050 నినాదంతో ముందుకు : సీఎం రేవంత్ రెడ్డి




తెలంగాణ బ్యూరో ప్రతినిధి: దేశ రాజకీయాల్లో పీవీ నరసింహరావు, ఎన్టీఆర్, వెంకయ్యనాయుడు చక్రం తిప్పారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కానీ నేడు జాతీయ రాజకీయాల్లో తెలుగు వారి పాత్ర సన్నగిల్లిందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ తెలుగు సమాఖ్య సభలు హైదరాబాద్ వేదికగా జరగడం హర్షణీయమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంతడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్లోని హైటెక్స్లో నిర్వహించిన ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విదేశాలకు వెళ్లిన తెలుగు వారంతా ఇలా ఒక వేదిక మీదకు రావడం సంతోషంగా ఉందన్నారు. విదేశాలకు వెళ్లిన వారికి తెలుగుతో అనుబంధం తగ్గిపోతోందన్నారు. భారతదేశానికి ఐటీని తీసుకువచ్చి రాజీవ్గాంధీ మంచి బాటలు వేశారని గుర్తు చేశారు. రాజీవ్గాంధీ వేసిన బాటను సీఎం చంద్రబాబు నాయుడితోపాటు మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కొనసాగించారని చెప్పారు. ఐటీ, ఫార్మా రంగంలో.. మన ప్రాధాన్యత ప్రపంచానికి తెలిసి వచ్చిందన్నారు. పాలిటిక్స్, సినిమా రంగంలో రాణించాలంటే తెలుగు భాష ఎంతో ఉపయోగమని చెప్పారు. నాలెడ్జ్ కోసం ఏ భాష నేర్చుకున్నా కానీ తెలుగు భాషను మాత్రం తక్కువ చేయొద్దని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తెలుగు సినీ రంగం హాలీవుడ్ స్థాయిలో ప్రభావం చూపడం శుభపరిణామని ఆయన వ్యాఖ్యానించారు. మూడు దశాబ్దాల క్రితం దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేతుల మీదుగా ప్రపంచ తెలంగాణ సమాఖ్య ప్రారంభమైందని గుర్తు చేశారు. దేశంలోనే హిందీ తరువాత అత్యధికంగా మాట్లాడే భాష తెలుగు అని చెప్పారు. దేశ రాజకీయాల్లో ఎంతో మంది తెలుగు వారు క్రియాశీలకంగా వ్యవహరించారంటూ నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు, ఎన్టీఆర్, వెంకటస్వామి, జైపాల్ రెడ్డి, వెంకయ్య నాయుడు తదితరుల పేర్లను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. కానీ ప్రస్తుత దేశ రాజకీయాల్లో తెలుగు వారి ప్రాభవం తగ్గిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయం, సినీ, వాణిజ్య రంగాల్లో రాణించినా మన భాషను మాత్రం మరిచి పోవద్దన్నారు. పర భాషా జ్ఞానం సంపాదించాలి కానీ మన భాషను గౌరవించుకోవాలన్నారు. తెలుగును గౌరవిస్తూ ఈ మధ్య కాలంలో తమ ప్రభుత్వం జీవోలను ఈ భాషలోనే ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తుందని వివరించారు. తాను విదేశాల్లో పర్యటన సందర్భంగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు వెళ్లిన సమయంలో ఎంతో మంది తెలుగు వారు తనను కలిశారని చెప్పారు. ఆయా దేశాల్లో స్థిరపడిన తెలుగు వారు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి, తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని పిలువు ఇచ్చినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రైజింగ్ నినాదంతో 2050 అభివృద్ధి ప్రణాళికలతో తాము ముందుకు వెళుతున్నామని స్పష్టం చేశారు.

## నా ఉన్నతికి తెలుగు వెలుగే కారణం



తెలంగాణ బ్యూరోప్రతినిధి: తెలుగు భాషకు మనమంతా వారసులమని.. దానిని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనపైనే ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మన మాతృభాషను మనం ప్రేమించకపోతే ఇంకెవరు ప్రేమిస్తారని ఆయన ప్రశ్నించారు. మాతృభాషలో మాట్లాడడం అందరికీ అలవాటుగా మారాలన్నారు. హైదరాబాద్లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ తెలుగు సమాఖ్య మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. తన ఉన్నతికి తెలుగు వెలుగే కారణమన్నారు. దేశంలో గొప్ప పదవుల్లో ఉన్నవారంతా మాతృభాషలో చదువుకున్నవారేనని చెప్పారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఈ సభలను అమెరికాలో ప్రారంభించారు. ఆనాటి సమావేశంలో నేను కూడా పాల్గొన్నాను. దేశ విదేశాల్లో తెలుగువారిని ఒకే వేదికపై తీసుకురావడం హర్షణీయం. కళారూపాలు సామాజిక పునాదులుగా నిలుస్తాయి. కళలు ప్రజలను కార్యోన్ముఖులను చేస్తాయి. వాటిని ముందు తరాలకు అందజేయాల్సిన బాధ్యత మనదే. ప్రతి భాషకు ఓ ప్రత్యేకత ఉంది. తెలుగు మరింత విలక్షణమైంది. అలంకారాలు తెలుగు భాషకు ఎంతో అందాన్ని తెచ్చాయి. జీవిత అర్థాన్ని తెలిపే ఎన్నో సామెతలు తెలుగులో ఉన్నాయి. మాతృభాష.. మన సంస్కృతిని తనలో ఇముడ్చుకుంది. 2012లో ప్రపంచంలో రెండో ఉత్తమ లిపిగా తెలుగు నిలిచింది. మనదేశంలో 450 భాషలు ఉన్నాయి. ఇంగ్లిష్పై వ్యామోహంతో కొన్ని భాషలు అంతరించిపోతున్నాయి. భాష ఆగిపోతే.. శ్వాస ఆగిపోయినట్లే. మాతృభాష మర్చిపోతే.. మాతృబంధం విడిచిపోయినట్టే. మన వేషభాషల పట్ల మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. ప్రాథమిక విద్యను తెలుగు భాషలో అందించాలి అని వెంకయ్యనాయుడు అన్నారు.

## కోతల పాలన ఎగవేతల ప్రభుత్వం



తెలంగాణ బ్యూరోప్రతినిధి: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పై బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆదివారం ఆయన అశోక్ నగర్లోని తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. కోతలపాలన.. ఎగవేతల ప్రభుత్వమని, రైతు రుణ మాఫీ..రైతు భరోసా అన్ని ఎగవేతలేనని, ఎన్నికల ముందు వరంగల్ సభలో రైతు భరోసా రూ. 15 వేలు ఇస్తామని.. ఇప్పుడు రూ. 12 వేలకు కోత పెట్టారని ఆరోపించారు. మాయ మాటలు చెప్పి సీఎం రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని, కాంగ్రెస్ గ్యారెంటీలన్ని నీటి మూటలేనని విమర్శించారు. రైతు భరోసాలో కౌలు రైతుల ఊసే లేదని, రైతు భరోసా మొన్నటి వరకు సంక్రాంతి నుండి ఇస్తామని ఉదర గొట్టారని.. ఇప్పుడు జనవరి 26 అని అంటున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం దగ్గర రైతుల డేటా మొత్తం ఉన్నప్పుడు మళ్ళీ సర్వేలు ఎందుకని ప్రశ్నించారు.

కాంగ్రెస్ అంటేనే మోసంకు నిర్వచనమని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నుంచి రేవంత్ రెడ్డి వరకు ప్రజలను.. రైతులను మోసం చేసిన వారేనని లక్ష్మణ్ విమర్శించారు. రాష్ట్రంలో రైతులకు అండగా బీజేపీ పోరాటానికి సిద్ధం అవుతుందన్నారు. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున రైతుల కోసం ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంను వెంటాడతామని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేమని.. కాంగ్రెస్ నేతలు నేలకు ముక్కు రాసి ప్రజలను క్షమాపణలు కోరాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాగా రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ నేతలు తమ స్వార్థ రాజకీయాల కోసం ప్రజా సమస్యలను పక్కనపెట్టి విమర్శలకు దిగుతున్నారన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- వరంగల్ జిల్లా విశ్వనాథపురంలో రూ.8.40 కోట్లతో నిర్మించే మూడు 33/11 కె.వి విద్యుత్ సబ్స్టేషన్లకు శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి
- ఇందిరమ్మ ఆత్మ భరోసా క్రింద త్వరలో భూమిలేని వ్యవసాయ కుటుంబాలు, కూలీలకు ప్రతి సంవత్సరం రూ. 12 వేలు
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకెళుతున్నదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలోనే ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసిన ఘనత తమదేనని అన్నారు.ఆదివారం వరంగల్ జిల్లా, మహానగర పాలక సంస్థ పరిధిలోని 15 వ డివిజన్ విశ్వనాథపురంలో 8 కోట్ల 40 లక్షల రూపాయలతో నిర్మించే మూడు 33/11 కె.వి విద్యుత్ సబ్స్టేషన్లకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద నాయక్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య,వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, గ్రేటర్ వరంగల్ నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి,నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మురళినాయక్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి,జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడే, ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన పరకాల నియోజకవర్గ సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పరకాల శాసనసభ్యులు సీనియర్ శాసనసభ్యుడైనప్పటికీ నిత్యం తన నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధుల ఉంటారని అన్నారు. సబ్ స్టేషన్ల ఏర్పాటు వల్ల ఈ ప్రాంత ప్రజలకు కరెంట్ కష్టాలు తీరి భవిష్యత్తులో నాణ్యమైన విద్యుత్తు అందుతుందన్నారు. స్థానిక శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కోరిన నిధులను తప్పకుండా మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని అన్నారు.గత ప్రభుత్వం పదేళ్లు పరిపాలించినప్పటికీ లక్ష రూపాయల రుణమాఫీ చేయలేదని,అదనంగా 7 లక్షల కోట్ల పైబడి అప్పులు మోపిందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే ఆర్థికపరంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నను ఇచ్చిన వాగ్దానాలను నిబద్ధతతో 22 వేల కోట్ల రూపాయల మేర 2 లక్షల లోపు రుణాలను నేరుగా రైతుల ఖాతాలో పంపించి మాఫీ చేయడం జరిగిందన్నారు.

# గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం కిట్ల పంపిణీ

- మొదటి విడతగా 15 వేల మంది గీత కార్మికులకు శిక్షణ ఇచ్చి కిట్ ల పంపిణీ చేసిన బీసీ సంక్షేమ శాఖ
- తాజాగా మరో 10 వేల కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ చేస్తాం
- రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః చెట్టు ఎక్కినప్పుడు గీతా కార్మికులు ప్రమాదాలకు గురికాకూడదనే సదుద్దేశ్యంతో రూపొందించిన కాటమయ్య రక్షణ కవచం లను బీసీ సంక్షేమ శాఖ రెండో విడత గా 10 వేల కాటమయ్య రక్షణ కవచం లను పంపిణీ చేస్తున్నట్లు రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గత సంవత్సరం జులై 14 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్ గూడాలో కాటమయ్య రక్షణ కవచం లైవ్ డెమో చూసి గీతా కార్మికులకు ఈ కాటమయ్య రక్షణ కవచాలు ప్రారంభించారు.

రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో 15 వేల మందికి ఒక్కో స్పెల్ 5 వేల కిట్స్ చొప్పున వివిధ నియోజకవర్గాల్లో తాటి చెట్టు ఎక్కి కల్లు గీసే గౌడన్న లకి శిక్షణ తరగతులు ఇచ్చి కాటమయ్య రక్షణ కిట్స్ పంపిణీ చేయడం జరిగిందనీ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇప్పుడు రెండవ విడత గా మరో 10 వేల మందికి ఈ నెల 25 వ తేది లోపు జిల్లా బీసీ డెవలప్మెంట్ అధికారి, జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లా ఎక్సైజ్ అధికారి సంయుక్తంగా కాటమయ్య రక్షణ కవచాల శిక్షణ మరియు కంపెనీకి అవసరమైన గోల కమ్యూనిటీకి చెందిన అర్హతగల గౌరవ వృత్తి చేసే వారిని గుర్తించి ఈ కిట్స్ పంపిణీ చేస్తారు. ఏదైనా నియోజకవర్గంలో వృత్తిరీత్యా కల్లు గీతా కార్మికులు అందుబాటులో లేకుంటే అదే జిల్లాలోని మరొక నియోజకవర్గంలో నుండి తీసుకోవచ్చు. కాటమయ్య రక్షణ కవచాలు 18 ఏళ్ల పైబడి తాటి చెట్టు ఎక్కి కల్లుగీసే వారు మాత్రమే అర్హులు గా నిర్ధరించబడతారు.

అకాడమి ఆఫ్ హ్యూమన్ ఆర్కిటెక్చర్ హైదరాబాద్ వారి శిక్షణ ఇచ్చి జిల్లా బీసీ డెవలప్మెంట్ అధికారి మరియు ఎక్సైజ్ అధికారికి ఈ కిట్స్ సరఫరా చేస్తారు. దీనిని శిక్షణ పొందిన అర్హత ఉన్న వారికి వారు ఈ కాటమయ్య కిట్స్ పంపిణీ చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

## హెటిరో స్కాంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయి



**బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

తెలంగాణ బ్యూరోప్రతినిధిః బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో తెలంగాణ ప్రభుత్వంపై తీవ్రమైన విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆకాంక్షలకు వ్యతిరేకంగా పని చేస్తున్నదని, తాజా క్యాబినెట్ నిర్ణయాలు నిరాశకు గురిచేసినట్లు పేర్కొన్నారు. రైతు భరోసా పథకంపై స్పష్టత లేకపోవడం, పెన్షన్ పెంపు, ఆరు గ్యారంటీలపై ప్రభుత్వం పట్టించుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్వర్ రెడ్డి క్యాబినెట్ నిర్ణయాన్ని కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుతో సమానమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ అవినీతిచర్యలపై విచారణ జరపకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పు పట్టారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీల మధ్య దూప్ ఫైట్ జరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే, హెటిరో స్కాంలో కోట్లాది రూపాయలు చేతులు మారిన విషయం, సివిల్ సప్లై వ్యవహారాల్లో అక్రమాలపై ఆధారాలు ఉన్నా చర్యలు తీసుకోకపోవడం, ప్రభుత్వం నిర్ణయాలపై స్పందించకపోవడం వంటి అంశాలపై ఆయన ప్రశ్నలు సంధించారు. ముఖ్యంగా, రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వారి కంపెనీ వ్యవహారంపై, సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ లిఫ్ట్ టెండర్లపై తప్పులపై కూడా స్పందించారు. మహేశ్వర్ రెడ్డి ఇవన్నీ ప్రజలకు తెలియజేయడమే లక్ష్యంగా పోరాటం చేస్తామని తెలిపారు. ప్రభుత్వాన్ని నిలదీసి ప్రజల హక్కుల కోసం పోరాడే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# గ్రామీణ అభివృద్ధి, పల్లెల్లో పారిశుధ్యం

## నేను ఎంత సున్నితమో.. అంత కఠినం

- ప్రజల సంక్షేమంపై కీలకమైన వ్యాఖ్యలు చేసిన మంత్రి
- కోయ జాతికి చెందిన నేను కాంగ్రెస్ ఇచ్చిన అవకాశంతో మంత్రి పదవి చేపట్టానన్న సీతక్క



తెలంగాణ బ్యూరోప్రతినిధి: పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క గ్రామీణ అభివృద్ధి, పల్లెల్లో పారిశుధ్యం, ప్రజల సంక్షేమంపై కీలకమైన వ్యాఖ్యలు చేశారు. మన దేశం గ్రామాలతో ముడిపడిందని, అందుకే గ్రామాలను ప్రగతి పథంలో నిలపాల్సిన బాధ్యత డిపిఓలదే అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామీణ ప్రజలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించేందుకు కృషి చేయాలని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆమె అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రగతికి స్థానిక పరిస్థితులను బట్టి ప్రణాళికలు రూపొందించి, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ఉందని మంత్రి సూచించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు లేకపోయినా, ఒత్తిడి తట్టుకుని పనిచేసిన డిపిఓలను అభినందించారు. గ్రామీణ ప్రజలకు సేవ చేసే భాగ్యం మీకే దక్కిందని, అందుకే ఈ ఉద్యోగాన్ని కేవలం పనిగా కాకుండా బాధ్యతగా తీసుకోవాలని ఆమె తెలిపారు. అధికారులు సిబ్బందితో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగిస్తూ, పనుల పురోగతిని పర్యవేక్షించాలన్నారు. సిబ్బందితో ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షలు నిర్వహించి, పనుల్లో వేగం పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. నా శాఖను నేను నా కుటుంబంగా భావిస్తున్నాను. పంచాయతీ రాజ్ శాఖ మన అందరిదీ. మీరూ దీన్ని కుటుంబంగా భావించి పని చేయండని మంత్రి సీతక్క అన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు సఫాయి కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్ల పాత్ర ఎంతో ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. గ్రామాల్లో వీరి సేవలకు తగిన గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో, ఇకపై ప్రతి నెల 5వ తేదీ లోపు జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. గ్రామ పంచాయతీ ద్వారా కాకుండా కమిషనర్ కార్యాలయం నుంచే జీతాలు చెల్లించే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్యల నివారణ కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. మనం సరఫరా చేసే తాగు నీటిపై ప్రజల్లో నమ్మకం కల్పించడమే లక్ష్యమని, సమ్మర్ యాక్షన్ ప్లాన్ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు నా వంతు సహకారం ఎప్పుడు ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. కోయ జాతికి చెందిన నేను కాంగ్రెస్ ఇచ్చిన అవకాశంతో మంత్రి పదవి చేపట్టానని సీతక్క గుర్తుచేశారు. కింది వర్గాల సామర్థ్యంపై ఉన్న దురాభిప్రాయాలను తమ పనితీరుతో తప్పనిసరిగా నిరూపించాలని మంత్రి అన్నారు

## రాష్ట్రంలో ఆడపిల్లలపై వేధింపులు పెరిగిపోతున్నాయి



తెలంగాణ బ్యూరోప్రతినిధిః బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న చర్యలతో ఆడపిల్లలను కన్నెత్తి చూడాలన్నా, వేధించాలన్నా భయపడే పరిస్థితి ఉండేది. రాష్టంలో ఇటీవల మళ్లీ ఆడపిల్లలపై వేధింపులు పెరుగుతు న్నాయని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఆకతాయి బాత్రూంలో ఫోన్ పెట్టి వీడియో రికార్డు చేస్తూ ఏమి తెలియనట్టు బుకాయించడం ఆశ్చర్యం కలిగించిందని చెప్పారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు ఏ కళాశాలలో .. పాఠశాలలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాలయాల్లో విద్యార్థినిలకు పూర్తి స్థాయి వసతులతో మూత్రశాలలు ఏర్పాటు చేయాలనీ కోరారు. విద్యార్థినిలు ఏ సమస్యలు వచ్చినా ఉపాధ్యాయులకు చెప్పుకునేవిధంగా కళాశాలల్లో వాతావరణం కల్పించాలని పేర్కొన్నారు. గతంలో మహిళలకు స్కిల్ డెవలప్మెంట్ కోసం ప్రత్యేక సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నాం. రూ.25 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు తీసుకువచ్చామని గుర్తు చేశారు. అది పూర్తి అయితే విద్యార్థినిలు నైపుణ్యం పెంచుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థినిలకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఉపాధ్యాయులకు చెప్పాలని, అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆకతాయిల బెదిరింపులకు బయడవద్దని, ధైర్యంగా వారిని ఎదుర్కో వాలన్నారు. ఆయన వెంట గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, తదితరులు ఉన్నారు

# ఓట్ల కోసమే కాంగ్రెస్ తప్పడు హామీలు

# రాహుల్ గాంధీ ఎక్కడ..?

- తెలంగాణ ప్రజలకు కష్టమొస్తే వెంటనే వస్తానన్న రాహుల్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




తెలంగాణ బ్యూరోప్రతినిధిః ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ ప్రజలకు తప్పుడు హామీలు ఇచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. ఆనాడు రైతు బంధు కింద రూ.10 వేలు ఇస్తే బిచ్చం అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్నదేంటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు కష్టమొస్తే.. వెంటనే వస్తానని రాహుల్ గాంధీ అన్నారు. తెలంగాణ ప్రజలు కష్టాల్లో ఉన్నారు.. రాహుల్ గాంధీ ఎక్కడున్నారంటూ ప్రశ్నించారు.

రైతులు కాంగ్రెస్ పార్టీని ఎప్పటికీ క్షమించరని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత మోసం చేస్తుంటే రాహుల్ గాంధీ ఎక్కడున్నారంటూ మండిపడ్డారు. తెలంగాణ రైతులకు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హామీలపై నిలదీస్తే దివాళా కోరు మాటలు చెబుతున్నారు. దేశంలోనే ధనిక రాష్ట్రం తెలంగాణ అని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రం అప్పులపాలైందని అధికారంలోకి రాగానే ప్రచారం చేస్తున్నారు. వందరోజుల్లో గ్యారంటీలు అమలు చేస్తామని మోసం చేశారు. మంత్రులు బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అవాస్తవాలు చెబుతున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కాదు.. కాంగ్రెస్ నేతల మానసిక పరిస్థితి బాగాలేదని కేటీఆర్ఎద్దేవా చేశారు. హామీలు అమలు చేయమంటే తప్పుడు కేసులు పెడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల పరిస్థితి ఏంటీ..? ఎవరిని మోసం చేయడానికి ఇన్ని హామీలిచ్చారో చెప్పాలని కేటీఆర్ ధ్వజమెత్తారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చెడగొట్టింది రేవంత్రెడ్డి ప్రభుత్వమేనని.. విధ్వంసకరమైన ఆలోచనలతోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదేలైందన్నారు. కాంగ్రెస్ ఏడాదిలో రూ.లక్షా 38 వేల కోట్ల అప్పులు చేసింది. కేసీఆర్ ప్రభుత్వం అప్పులు చేస్తే అభివృద్ధి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్షల కోట్ల అప్పులతో ఏం అభివృద్ధి చేసిందని.. . అప్పులు తెచ్చిన డబ్బులు మూటలుగా పోతు న్నాయా..? అని ప్రశ్నించారు. కొత్త పెట్టుబడులు రావడం లేదు.. ఉన్న కంపెనీలు పోతున్నాయి. వాస్తవాలు స్పష్టంగా కనిపిస్తుంటే ఇలా అబద్దాలు చెప్పవచ్చా అని ప్రభు త్వాన్ని ఎండగట్టారు. ఉద్యోగుల పీఆర్సీ, డీఏ ఎగ్గొట్టేందుకు అబద్దపు లెక్కలు చెబుతు న్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై చర్చకు సిద్ధమా అని చాలెంజ్ చేసిన కేటీఆర్.. హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వంపై పోరాటం ఆగదని మరోసారి స్పష్టం చేశారు.

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక

# అక్షరం

4 సోమవారం 6 జనవరి 2025

suryaeditpage@gmail.com

## నూతనోత్సవ సంబరం




నూతన సంవత్సరమంటే...
క్యాలెండర్లో మారే తేదీయే కాదు
గత సంవత్సరపు అనుభవంతో...
మరొ కొత్త భవిష్యత్తుకు శ్రీకారోత్సవం
నూతన సంవత్సరమంటే...
మందు సీసాల సంబరాలు కాదు
గత చేదు అనుభవాలను మరచి
తీపి అనుభవాలకు స్వాగతోత్సవం
నూతన సంవత్సరమంటే ...
అర్ధరాత్రి విచక్షణ మరచి
రోడ్లపై తిరగడం కాదు
విచక్షణ మరచి చేసిన
గత చెడుకి స్వస్తి పలికి...
ఇకపై విచక్షణతో మంచే చెయ్యాలనే
యోచనలకు ప్రారంభోత్సవం
నూతన సంవత్సరమంటే...
కేకులు కోసి పంచుకునే సంబరమే కాదు
కోల్పోయిన గత విజయాలను గుర్తించి...
తప్పుదిద్దుకొని వాటిని తిరిగి సాధించాలనే
సంకల్పానికి శుభారంభోత్సవం
నూతన సంవత్సరమంటే...
మందు నిండిన గ్లాసుల చియర్స్ కాదు
కుటుంబ స్నేహ ఆత్మీయతలతో...
నూతన ఉత్సాహంతో కలగలుపుగా
జరుపుకునే వేడుకల ఆనందోత్సవం
కాలం ఓ మజిలిలేని నిరంతర ప్రయాణి
వారం రోజు పక్షం మాసం సంవత్సరం...
యుగమనే మజిలీలు లేవు కాలానికి
మనిషి తనను తాను తిరిగి పునరుత్తేజుడిని
చేసుకోవడానికి పెట్టుకున్న మజిలీయే...
ఈ నూతన సంవత్సర సంబరం
అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

**నసుబోలు రాజశేఖర్, 9885739808**

## నూతన వత్సరం




గతమంతా
శిధిలమైన జ్ఞాపకాలతో
తడిచి తడిచి
ముద్దయ్యింది కదా..!
నీకై నువ్వు వేసుకున్న
ప్రణాళికలన్ని తారుమారయ్యాయేమో
నీ కోసం రాసుకున్న రాతలన్నీ
మదిలో చిక్కుకుని వేదిస్తున్నాయేమో కదా..!
నీ అంతరంగాన్ని సుడిగుండాలై చీల్చేస్తూ
మదిని ముళ్ళకంచెలా చుట్టేస్తూ
నిత్యం అగాధంలో పడవేస్తూ...
అక్కరలో లేని బంధాలతో
విసిగిస్తున్నాయేమో కదా..!
చుట్టూ అందరూ ఉండి
ఒంటరిగా కకళావికలం చేస్తున్న ఆలోచనలతో
విసిగి వేసారుతున్న నా ప్రియ నేస్తమా..
ఉరుకు పరుగులతో నీకు చేరువవుతున్న
నూతన వత్సరం నీ జీవితంలో
ఉత్సవం తీసుకు రావాలనీ..
విజయోత్సవాలతో తులతూగాలని
ఉల్లాసవంతమైన జీవితాన్నివ్వమని
ఆ దేవదేవున్ని కాంక్షిస్తున్నా....

**వాసి జ్యోత్స్న, 9866843005**

## కాలమానిని



కాలమానిని
ప్రతి సంవత్సరం గోడకు కొట్టిన
సంవత్సరపు ప్రయాణం
నూతన సంవత్సరం రాగానే
గోడకు మార్చే గత సంవత్సరపు ఆనవాళ్ళు
పంచాంగం పండుగలు
అమవాస్య పౌర్ణమి
తిథులు ఎన్నో ఎన్నెన్నో
విశేషాలు వివరాలు తెలిపే క్యాలెండర్
365 రోజులు 12 నెలలు 30 రోజులతో
ప్రతిసంవత్సరం కొత్తదనం
గత సంవత్సరం సంతోషాలు బాధలు
బాధ్యతలు పదోన్నతులు
ప్రమాదాలు బదిలీలు
విందులు వినోదాలు సభలు సమావేశాలు
ఎన్నో మరెన్నో చిత్రవిచిత్రమైన
సంఘటనలకు సెలవు
ఎన్నో కోరికలతో మరెన్నో ఆశలతో
ఆసక్తి కరమైన విషయాలు జరగాలని
కాలమానిని గోడకు అందం
సంవత్సరం సంవత్సరం మారి
కొత్త కాలమానిని వచ్చిన
ఏ సంవత్సరం హడివుడి ఆ సంవత్సరం దే
ఆంగ్లేయ నూతన సంవత్సరం అయిన
కాలమానిని ప్రపంచ వ్యాప్తంగా
అనుసరించేది ఇదే కాలమానిని కోసమైనా
ఆంగ్లేయ నూతన సంవత్సరం పాటించాల్సిందే
ఎవరు అవునన్నా కాదన్నా మార్కెట్లన్ని
నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబు
రకరకాల కేకులు మిఠాయి లతో
ఇంటిల్లిపాదీ పసందు
నూతన సంవత్సరం రాగానే
అందరిలో ఏదో తెలియని జోష్
చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ కుష్
మార్కెట్లు దుకాణాల్లో రష్
ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నీళ్ళ ప్రాంతాల్లో కామూష్

**డాక్టర్. ఎస్. విజయ భాస్కర్,9290826988**

## చాటింగ్ లు - గ్రీటింగ్ లు



ఎన్నో మిఠాయి పొట్లాలను ఎదలపై
వదిలేసి వయ్యారంగా వెళ్లిపోతుంది
ఎన్నో కన్నీళ్ల ను చెక్కిల్ల పై జారవిడిచి
గుండెకు లోతైన గాయాలను చేసి
క్యాలెండర్ మార్చుకొని కాలగర్భంలో
కలిసిపోతుంది 2024 సంవత్సరం.
పోతూ పోతూ కొన్ని జీవిత పాఠాలను
నేర్పింది , కొన్నింటిని అలవాటు చేసింది
మనం కొన్నింటికి కామా పెట్టాలి
మరికొన్నింటికి ఫుల్ స్టాఫ్ చుట్టాలి
మదిలో కొత్తదనానికి అంటు కట్టాలి
కొత్త సంవత్సరానికి స్వాగతం అంటే
చాటింగ్ లు , ,గ్రీటింగ్ లు , కేక్ కటింగ్ లు
కాదు బీరు పొంగిచ్చుడు , బొక్క కొరుకుడు
అంతకన్నా కాదు భవిత కోసం బెర్తు
భద్రంగా మలచుకోవాలి .
కులాల కంపు , మతాల మత్తును ,
మనసులోని మలినాలను కడిగేసుకొని
మల్లె పువ్వులా మానవతా పరిమళాలను
వెదజల్లుతూ కొత్త సంవత్సరంలో
విశ్వమానవుడిగా వికసించాలి

**తాటిపాముల రమేశ్.( తార )**
**7981566031**

## కొత్త సంవత్సరం స్వాగతం




రావే రావే కొత్త సంవత్సరమా,
తేవే తేవే తేనె మధురిమా..
గడిచిన కాలం గతించగా,
నడిచిన నేల నాట్యమాడగా...
పూల సువాసన పరిమలించగా,
మట్టి వాసనతో మనసు నిండగా...
రావే రావే కొత్త సంవత్సరమా,
తేవే తేవే తేనె మధురిమా..
జల జల జారే జలపాతంలా,
జల్లున తాకే హిమపాతంలా...
గల గల పారే సెలయేరుల్లా,
కిల కిల పాడే కోయిలమ్మలా...
రావే రావే కొత్త సంవత్సరమా,
తేవే తేవే తేనె మధురిమా..
మనసు నిండుగా వేడుక చేయగా,
సిగ్గుతో సిన్నది సింగారించగా...
నీ ఆశలే శ్వాసతో దారి అవ్వగా,
దేవుని దీవెన నిండుగ ఉండగా...
రావే రావే కొత్త సంవత్సరమా,
తేవే తేవే తేనె మధురిమా..
భగ భగ మండే సూర్య కాంతితో,
చల్లగా తాకే చంద్ర బింబితో...
చేదు జ్ఞాపకం మంటలో కలిపి,
మంచి మాటనే మమతతో నింపి...
రావే రావే కొత్త సంవత్సరమా,
తేవే తేవే తేనె మధురిమా..

**ఇమంది అశోక్ కుమార్,**
**9392869899**


# పృథుచక్రవర్తి, విజితాశ్వుడు, ప్రాచీనబర్హి

### శ్రీ మహాభాగవత కథ-17



**వనం జ్వాలా నరసింహారావు**
**80081 37012**

**కం॥ చదివెడిది భాగవతమిది,**
**చదివించును కృష్ణు, డమృతఝరి పోతనయ-**
**ఎన్**
**చదివినను ముక్తి కలుగును,**
**చదివెద నిర్విఘ్నరీతి 'జ్వాలా' మతినై**




యజ్ఞ యాగాదులు చేస్తే విశేష ఫలం లభిస్తుందని భావించిన పృథుచక్రవర్తి వంద అశ్వమేధయాగాలను చేయాలనిదీక్షబూని యాగాలు చేయసాగాడు. ఆయన చేస్తున్న యజ్ఞకర్మలో సాక్షాత్తు నారాయణుడు విచ్చేశాడు. పృథుచక్రవర్తికి కావా ల్సిన హవిస్సులు మొదలైన వాటిని భూమాత సమకూర్చింది. ప్రకృతిలో వున్న సమస్త జీవరాశులు తమ దగ్గరున్నవన్నీ సమకూర్చాయి. సమస్త జనులు కానుకలి చ్చారు. అలా పృథుచక్రవర్తి 99 యాగాలను వైభవంగా నిర్వహించాడు. నూరవ యజ్ఞంలో పుండరీకాక్షుడిని పూజ చేస్తున్న సమయంలో, ఇంద్రుడు అక్కసుతో యజ్ఞపశువును అపహరించి ఆకాశ మార్గంలో మాయమయ్యాడు. ఇది గమనిం చిన అత్రి మహాముని పృథుచక్రవర్తి కొడుక్కు సమాచారం ఇచ్చాడు. అతడు దేవేంద్రుడి వెంట బడ్డాడు. అతడిని పట్టుకుని మీద దూకే సమయానికి తన మాయావేషాన్నీ, గుర్రాన్నీ వదిలి అంతర్ధానమయ్యాడు. పృథుచక్రవర్తి కుమారుడు యజ్ఞాశ్వాన్ని తీసుకుని వచ్చాడు. మరోమారు దేవేంద్రుడు అదే పని చేశాడు. మళ్లీ పృథు కుమారుడు ఆయన వెంటబడేసరికి అశ్వాన్ని వదిలి పారిపోయాడు. ఇదంతా తెలుసుకున్న పృథుచక్రవర్తి ఇంద్రుడిని చంపడానికి పూనుకోగా ఋత్విక్కులు వారించారు.

పృథుచక్రవర్తి యజ్ఞం కొనసాగిస్తుండగా బ్రహ్మదేవుడు వచ్చి, 99 యజ్ఞాల ఫలం లభించాలని ఆయన్ను దీవించి, మోక్షధర్మం తెలిసిన పృథుచక్రవర్తిని ఇక ఇంత టితో యజ్ఞాలు చేయడం చాలించమనీ, దేవేంద్రుడికి కోపం రాకుండా ప్రవర్తించ మనీ సలహా ఇచ్చాడు. ఆయన ఎవరివల్ల ఎందుకు సృష్టించబడ్డాడో గ్రహించి, తదనుగుణంగా, పరబ్రహ్మ సంకల్పానుసారం ధర్మాన్ని పాలించమని కూడా చెప్పాడు. ఇంద్రుడు కల్పించిన ప్రచండ పాషండ మార్గమైన మాయను జయించ మని బ్రహ్మ ఆజ్ఞాపించాడు. ఆయన ఆజ్ఞను పాటించి, పృథుచక్రవర్తి దేవేంద్రుడి తో సఖ్యత పెంచు కున్నాడు. యజ్ఞదీక్షను విరమించి అవభృత స్నానం చేశాడు. అక్కడున్న వారంతా ఆయన్ను దీవిస్తున్న సమయంలో, యజ్ఞభోక్త, యజ్ఞకర్త, భగవంతుడూ అయిన సర్వేశ్వరుడు ఇంద్రుడితో సహా వచ్చాడు. నూరవ అశ్వమేధ యాగానికి భంగం కలిగించిన ఇంద్రుడు పృథుచక్రవర్తిని క్షమాపణ కోరడానికి వచ్చాడనీ, ఆయన్ను క్షమించమనీ అన్నాడు శ్రీహరి. ఇంకా ఇలా అన్నాడు ఆ సర్వేశ్వరుడు పృథుచక్రవర్తితో:

"నువ్వు సుఖదుఃఖాల పట్ల సమానమైన చిత్తం కలవాడిగా ఉండాలి. అందరిపట్ల సమానంగా ప్రవర్తించు. ఈ సమస్త లోకాన్నీ రక్షించాల్సిన బాధ్యత నీదే. విప్రుల అనుమతితో, సంప్రదాయ సిద్ధమైన ధార్మిక మార్గాన్ని స్వీకరించి, అర్థకామాల పట్ల ఆసక్తి లేకుండా, ధర్మార్థ కామాలనే మూడు పురుషార్థాల పట్ల సమాన దృష్టిని కలిగి ఉండు. ప్రజానురంజకంగా రాజ్యాన్ని పాలించు". ఇలా చెప్పి, ఆయనకొక వరమిస్తాననీ, కోరుకొమ్మనీ అన్నాడు. జవాబుగా పృథుచక్రవర్తి, నిర్మలమై ప్రకాశించే భగవంతుడి కీర్తిని వినడం కోసం తనకు పదివేల చెవులను ప్రసాదించమని, అదే తన అభిమతమని అన్నాడు. అలాగే తత్త్వ జ్ఞానాన్ని మరిచిపోయిన అజ్ఞానులకు వెంటనే తత్త్వమార్గాన్ని చూపగలిగే వరాన్ని కూడా అనుగ్రహించమని, అంతకంటే తనకేవరం అక్కరలేదని అన్నాడు. ఆయన కోరిన వరాలను ఇచ్చి నారాయణుడు ఆయన చేసిన పూజలను స్వీకరించి బయల్దేరి, దేవతలు కీర్తిస్తుండగా, వైకుంఠానికి చేరుకున్నాడు. పుణ్యభూమి (యజ్ఞశాల) నుండి బయల్దేరి పృథుచక్రవర్తి నగరానికి చేరి అంతఃపురంలోకి ప్రవేశించాడు. ఆ తరువాత భూమండలాన్ని పరిపాలించి, స్వచ్ఛమైన తన కీర్తిని భూమండలమంతా నెలకొల్పి, పరమానందంతో పరమపదాన్ని చేరుకున్నాడు పృథుచక్రవర్తి.

పృథుచక్రవర్తి భార్య, పరమ పతివ్రత, అయిన అర్చి మహాదేవి భర్తతో పాటి సహగమనం చేయడానికి సిద్ధమైంది. మహానదిలో స్నానం చేసి భర్తకు ఉదక తర్పణాలు వదిలింది. ఆ తరువాత సహగమనం చేసింది. అలా సహగమనం చేస్తున్న అర్చి మహాదేవిని చూసి దేవతాస్త్రీలు పులకించిపోయారు. అప్సరకాంతలు నృత్యం చేశారు. అర్చి మహాదేవి మహిమను కొనియాడారు. దేవతాస్త్రీలు అలా కీర్తిస్తుండగా పృథువు పొందిన విష్ణులోకాన్ని సాటిలేని వైభవంతో ఆమె కూడా పొందింది.

పృథు మహారాజుకు, అర్చి మహాదేవికి జన్మించిన విజితాశ్వుడు పృథువు తరువాత రాజయ్యాడు. తండ్రి లాగానే కీర్తి ప్రతిష్టలు సంపాదించాడు. పృథుచక్రవర్తి యజ్ఞం చేస్తున్నప్పుడు ఇంద్రుడు యజ్ఞాశ్వాన్ని అపహరిం చుకుని అంతర్ధానమైనప్పుడు, విజితాశ్వుడు కూడా అంతర్ధాన విద్యతోనే ఇంద్రుడిని వెంబడించి, యాగాశ్వాన్ని వెనక్కు తెచ్చాడు. అందువల్ల అతడికి అంతర్ధానుడు అనే బిరుదు వచ్చింది. అశ్వాన్ని జయించాడు కాబట్టి విజితాశ్వుడు అన్నారు. రాజ్యాన్ని పాలిస్తున్న విజితాశ్వుడు స్థిరబుద్ధి, సమచిత్తం కలవాడని పేరు తెచ్చుకున్నాడు. తన తమ్ములకు నలుదిక్కులను పంచి ఇచ్చాడు. త్రేతాగ్నులకు మానవులుగా జన్మించమని వశిష్టుడి శాపం ఉన్నందున, విజితాశ్వుడి భార్య శిఖండిని ద్వారా త్రేతాగ్నులు జన్మించారు. అతడి రెండవ భార్య సభస్వతి ద్వారా హవిర్ధానుడు అనే కొడుకు కలిగి, రాజ్యాన్ని చక్కగా పాలించాడు.

విజితాశ్వుడు ఆత్మజ్ఞుడై, పరమాత్మను యజ్ఞంలో అర్చించి, యోగ సమాధి ద్వారా ముక్తిని పొందాడు. ఆయన పరలోకగతుడైన తరువాత, ఆయన కొడుకు హవిర్ధానుడు ఆరుగురు కొడుకులను కన్నాడు. అందులో ఒకడైన బర్హిష్మదుడు యజ్ఞదీక్షాశాలియై, భూతలమంతా యజ్ఞయాగాది క్రతువులు చేస్తూ, ప్రజలచేత యోగసమాధి నిష్టుడు అనీ, ప్రజాపతి అనీ కీర్తించబడ్డాడు. 'ప్రాచీనబర్హి' గా కూడా పేరుపొందాడు. సముద్రుడి కూతురైన శతధృతి అనే కన్యను మోహించి వివాహమాడాడు. వారి వివాహం వాస్తవానికి బ్రహ్మ ఆదేశానుసారం జరిగింది. ఆ దంపతులకు పదిమంది కొడుకులు కలిగారు. వాళ్లనే ప్రచేతసులు అని అంటారు. తండ్రి ఆజ్ఞానుసారం ప్రజాసృష్టిని కొనసాగించడానికి అడవికి బయల్దేరే సమయంలో రుద్రుడు సాక్షాత్కరించాడు వారికి. ఆయన ఆదేశానుసారం ప్రచేతసులు నారాయణుడిని పదివేల దివ్య సంవత్సరాలు పూజించారు. పదివేల దివ్య సంవత్సరాలు నారాయణుడిని పూజించడానికి పూర్వరంగంలో, జ్ఞాన సంపన్నులైన ప్రచేతసులు, తండ్రి ఆజ్ఞానుసారం పడమటి దిక్కుగా వెళ్తున్న సమయంలో సముద్రం కంటే విస్తారమైన ఒక మనోహరమైన సరస్సును చూశారు. అందులో ఒక దివ్య పురుషుడిని చూశారు. అతడు సరోవరంలో నుండి వెలుపలికి వచ్చాడు. అతడే సాక్షాత్తు పరమ శివుడు. పరమేశ్వరుడి పాదపద్మాలకు నమస్కరించారు. హరుడు ప్రీతిచెంది, వాళ్ల మనస్సులో వున్న సంకల్పం తనకు తెలుసనీ, వారికి క్షేమం కలుగుగాక అనీ, వారిని అనుగ్రహించాలన్న బుద్ధితో దర్శనం ఇచ్చాననీ అన్నాడు. సృష్టి ఆరంభంలో బ్రహ్మదేవుడు, తన కుమారులకు చెప్పిన శ్రీహరి స్తోత్రాన్ని వారికి తెలియచేస్తానని, మోక్షప్రదమై, మంగళకరమైన తన ఉపదేశాన్ని వినమని, ఆస్తోత్రాన్ని వివరంగా చెప్పాడు. యోగాదేశమనే ఆ స్తోత్రాన్ని మళ్లీ, మళ్లీ జపిస్తూ, సర్వేశ్వరుడిని కీర్తిస్తూ, ధ్యానశీలురై పూజించమని చెప్పాడు శివుడు ప్రచేతసులకు. ఈ స్తోత్రాన్ని భగవంతుడైన బ్రహ్మ సృష్టిని చేయగోరి కొడుకులైన తమకు, భృగువు మొదలైన మునీంద్రులకు ఉపదేశించాడని, తాము దాని మహిమతో సృష్టి చేయగలిగామని కూడా చెప్పాడు. రుద్రుడు ఉపదేశించిన విష్ణు స్తోత్రాన్ని జపిస్తూ, పదివేల సంవత్సరాలు భయంకరమైన తీవ్ర తపస్సు చేశారు ప్రచేతసులు.

అప్పుడు పద్మనాభుడు ప్రత్యక్షమయ్యాడు వారికి. వాళ్ల శరీరాలను స్పృశించాడు. వారు సమస్త పాపాల నుండి విముక్తి పొందుతారనీ, రుద్రుడు గానం చేసిన తన స్తోత్రాన్ని నిత్యం పఠించమనీ అన్నాడు. వారికి పరబ్రహ్మ లక్షణాలతో కుమారుడు కలుగుతాడని చెప్పాడు. కండు మహామునికి, ప్రమ్లోచ అనే అప్సరసకు పుట్టిన మారిష అనే కన్యను తండ్రి ప్రాచీనబర్హి ఆజ్ఞతో పెళ్లి చేసుకోమని చెప్పాడు. వారంతా వెయ్యి సంవత్స రాలు తన మీద భక్తితో భూలోక సుఖాలు అనుభవించి, తన స్థానాన్ని చేరుకుంటారని అన్నాడు. అలా చెప్పిన శ్రీహరికి ప్రచేతసులు నమస్కరించి స్తుతించారు. ఆయన వారు చూస్తుండగా వైకుంఠానికి వెళ్లిపోయాడు. ఆ తరువాత బ్రహ్మ అజ్ఞానుసారం ప్రచేతసులు విధివిధానం గా మారిషను పెళ్లి చేసుకున్నారు. దక్షుడు దైవప్రేరితుడై, మారిష కడుపున, ప్రచేతసులకు పుత్రుడై జన్మించాడు. బ్రహ్మ ద్వారా ప్రజాసృష్టిని చేయడానికి నియమించబడ్డాడు.

ప్రచేతసులు భార్యను కొడుకు దగ్గర వుంచి, జాబాలి ముని ఆశ్రమానికి ఆత్మవిచారాన్ని చేయడానికి వెళ్లారు. అక్కడికి నారదుడు వచ్చాడు. ఈశ్వరుడు ఉపదేశించిన ఆత్మతత్త్వాన్ని ప్రసాదించమని ఆయన్ను కోరారు. ఆయన వారు కోరిన విధంగానే పద్మనాభుడి సచ్చరితాన్ని వినిపించి, బ్రహ్మలోకానికి వెళ్లిపోయాడు. ప్రచేతసులు శ్రీమహావిష్ణువు సత్కీర్తిని భక్తితో పొగిడి శాశ్వతమైన శ్రీహరి పదాన్ని పొందారు.

**(బమ్మెర పోతన శ్రీమహాభాగవతం, రామకృష్ణ మఠంప్రచురణ ఆధారంగా)**

## పుస్తకాల తోటలో (22)

**డా:అమ్మిన @ 7729883223**




తెలుగు భాషపట్ల మక్కువతో భావితరాలకు ఆ భాషామాధుర్యాన్ని పదిలం చేసి అందించాలనే ఆశయంతో.. ముందుకు సాగుతున్న బహుముఖ రచయిత్రి వృత్తి రీత్యా తెలుగు భాషాబోధకురాలు అయిన "వాసిరెడ్డి మల్లేశ్వరి" గారికి బాల సాహి త్యం అంటే భక్తి, అందుకే వారి సాహితీ సృజనలో కొంత భాగం, సమయం, వాళ్ళ కోసం కేటాయిస్తారు అందులో భాగంగానే "తేనె వాకలు" పేరుతో బాలల గేయ కథలు రెండు పుస్తకాలుగా రాసి తెలుగు బాల సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. ఈ రెండు పుస్తకాలలో మొత్తం 82 గేయ కథలు చదువుకోవచ్చు, చిన్ని అంశాలను కథా వస్తువులుగా తీసుకొని అలతి అలతి పదాలతో అందమైన భావా లు, అర్థాలు, కలిపి పిల్లలకు మంచి మంచి సందేశాలు అందించారు వీటి ద్వారా,ప్రతి పద్యంలో పదాలు చదువుకోవడానికి వీలుగా ఉండి, చక్కని పద్యం దాని నడక బాగున్నాయి, పద్యాల లో అంత్యప్రాసల సొగసులు ఎక్కువగా కనిపిస్తాయి.

అతి తెలివితో మోసం చేస్తే అది ఎక్కువ కాలం నిలవదు, ఏనాటికైనా మోసం బయట పడుతుంది అనే హెచ్చరికతో కూడిన సందేశం పంచిన కథ "చెడు ఫలితం",పొలాల మీద పడి పంటలు తింటున్న గాడిదకు దాని యజమాని తెలివిగా పులిచర్మం కప్పగా మొదట ఎవరూ దాని జోలికి రాకపోయినా అటు తర్వాత "పులి గడ్డి తినదనే "సత్యం తెలిసిన రైతులు పులి చర్మం గాడిదకు ఎలా బుద్ధి చెప్పారో ఈ గేయ కథలో కవయిత్రి చక్కగా చెప్పింది.

గ్రామంలో ఎలుకల బాధను తన నాదస్వరంతో తగ్గించిన వింత యువకునికి అడిగిన పైకం ఇవ్వకుండా గ్రామాధికారి చేసిన మోసానికి శిక్షగా ఆ వింత యువకుడు తనదైన నాదస్వరం సాయంగా ఆ గ్రామ పిల్లలందరినీ ఆకర్షించి తన వెంట గుహలోకి తీసుకుపోయిన ఆసక్తి దాయకమైన కథ "మాట తప్పితే" ఉపకారం చేసిన వారికి సైతం అపకారం చేసే "పాముబుద్ధి" గల వారు మన సమాజంలో అనేకమంది ఉంటారు, అటువంటి వారికి ఉపకారం చేయకుండా ఉండటమే మేలు అనే మంచి సందేశం పంచిన గేయ కథ "పరోపకారానికి పోతే..!"

పొగరుబోతు తనంతో విర్రవీగిన కోడిపుంజు, గద్ద బారిన ఎలా పడిందో తెలుసుకోవాలి అంటే "వినయం కావాలి" కథ తప్పక చదవాలి,

విన్నారా నా విజయం/ నా అంత కోడి /లోకాన లేదనే/ పొంచి ఉన్న గద్ద/ దాన్ని తన్నుకుపోయే.... అని కథను ముగిస్తూ...

వినయమే విజయానికి మొదటి మెట్టురా/ వినయాన దేనినైన/ నీవు సాధించరా... అంటూ హెచ్చరికతో కూడిన ముగింపు అందించారు మల్లీశ్వరి.

'లోభి గుణం కన్నా త్యాగగుణం మిన్న" అని చాటిన చక్కని గేయ కథ "రంగడు"

జొన్నలను బాధ పెట్టకుండా కాపాడిన రంగడికి అవి కరువు కాలంలో ఎలా సహాయపడి అతని ఆకలి బాధ తీర్చాయో..! తెలుసుకోవాలి అంటే ఈ "రంగడు" గేయ కథ విధిగా చదవాల్సిందే...!!

ఇలా చక్కని ఆసక్తి ఎంచక్కని గేయాలతో కలిసిన ఈ గేయ కథలు అన్నీ మళ్లీ మళ్లీ చదవాలి అనిపిస్తాయి, సాధారణ పరిజ్ఞానం గల వారు సైతం హాయిగా చదువుకుని అర్థం చేసుకోగలిగే ఈ తేనే వాకలు నిజంగా తెలుగు బాలల పాలిట బంగారు బహుమతులే!!

తెలుగు బాల సాహితీవేత్తలంతా విధిగా చదవాల్సిన గేయ కథా సంపుటాలు ఇవి అనడంలో ఆశ్చర్యం లేదు.

తేనె వాకలు 1,2,(బాలల గేయ కథలు), రచన: మల్లీశ్వరి, పేజీలు: 70, 74. వెల: ఒక్కొక్కటి 50/- రూ, ప్రతులకు: విశాలాంధ్ర, నవోదయ, పుస్తక విక్రయ కేంద్రాలు. 98665 83907.

## నేటి ట్రెండ్ కనుగుణంగా "ట్రెండింగ్ పద్యాలు"




నేటి కాలపు పిల్లలకు శారీరక వ్యాయామాలు లేవు. కేవలం టీవీ సెల్ఫోన్లు చూస్తూ సోమరులుగా తయారవుతున్నారు. ఫేస్బుక్ వాట్సప్ ఇన్స్టాగ్రామ్ ల పేరుతో వాటికి చాలా దగ్గరయ్యారు. తన చుట్టూ ఉన్న మనుషులను పట్టించుకోలేనటువంటి పరిస్థితులు ఉన్నాయి. చదువు సంధ్యలు నిర్లక్ష్యం చేస్తున్నారు. అంతే కాకుండా రకరకాలైన వీడియో గేమ్లు ఆడుతూ ఆధునిక టెక్నాలజీ మాయలో పడిపోతున్నారు, పడిపోయారు కూడా.

అంతేకాకుండా మన పండుగలు, సంస్కృతి సాంప్రదాయాలు ,ఆహార అలవాట్లు వీటన్నింటిని కూడా మర్చిపోయారు. అలాంటి విద్యార్థుల కోసం నేటి ట్రెండుకు అనుగుణంగా "యువ కవి" అవధాని అయినా అవుసుల భాను ప్రకాష్ గారు "బాలా" మకుటంతో 131 పద్యాలు రాశా రు. మంచి అలవాట్లు క్రమశిక్షణ తో పాటు నైతిక విలువలను నేర్పుతూ, ఇంగ్లీష్ పదాలను వాడుతూ, చక్కటి విషయాలను పద్యాల రూపంలో తెలియజేసే ప్రయత్నం చేశారు. ఇలాంటి ట్రెండింగ్ పద్యాలు రాయాలని నిర్ణయించుకోవడం ఆయనకు పిల్లల భవిత పట్ల , భావి పౌరులుగా తీర్చిదిద్దాలని గొప్ప ఆలోచనకు మచ్చు తునక గా చెప్పవచ్చు.

అవుసులభాను ప్రకాష్ గారు నిజంగా అభినందనీయులు. ఈ పద్యాలు చదువుతూ ఉంటే విద్యార్థులకు మంచి చెడులను, నీతిని, నైతిక విలువలను చెప్పకనే చెబుతున్నట్టు,పద్యాలు చదవకునే చదువుతున్నట్లు అనిపిస్తుంది. ఒక పద్యం అల్లరి చేయకని చెబితే, మరో పద్యంలో ట్రాఫిక్ రూల్స్ తప్పొద్దని చెప్పాడు కవి. పిల్లలే కాకుండా , పెద్దలు కూడా చదవాల్సిన పుస్తకం ట్రెం డింగ్ పద్యాలు. "తింటే గారెలు తినాలి" వింటే, యువ కవి భాను ప్రకాష్ గారి ట్రెండింగ్ పద్యాలు వినా లన్నది ముమ్మాటికి నిజం. ఇందులో ఎంత మాత్రం కూడా అతిశయోక్తి లేదు.

"ఫ్యాషన్ లను కట్టింగులు ఫ్యాషన్ల రిస్టు బాండ్లు పలు వేశాలా ? ఫ్యాషన్ చెవి కమ్మలను చు ఫ్యాషన్ లో మునిగి చెడకు భారత బాల" అంటూ నేటి కాలపు విద్యార్థుల ఫ్యాషన్ అంటూ వారి వేషధారణ చక్కగా వివరించారు కవి.

"పిజ్జా బర్గర్లు బయటి బజ్జి మిర్చిలు గొనకు పలు నష్టములవ్ బొజ్జను పెంచెడి వివి కదా బొజ్జనురానీయబోకు పూర్తిగా బాల" పై పద్యంలో ఆరోగ్యానికి హాని చేసే తినుబండారాల గురించి చక్కగా తెలియజేశారు భాను ప్రకాష్ గారు

ఇంకా "సమయమును ఉపయోగించుము" అంటూ "చరవాణి తగ్గించమంటూ" "డబ్బులు వ్యర్థము చేయకంటూ" "మందెప్పుడు తాగకురా" అంటూ "బుద్ధిగా చదువుకోవాలని" అంటూ "డీసెంట్ గా మాట్లాడు" ఇలా జీవితానికి పనికి వచ్చే మంచి నీతితో కూడుకున్న పద్యాలను "బాల" అనే మకుటంతో రాయడం బాలలను ఉద్దేశించి వారిని సుమార్గంలో నడిపింపజేసే ప్రయత్నం చేశారు కవిత భాను కాష్ గారు

కవి గారు ఈ పుస్తకంలో ఇంగ్లీషు పదాలను పద్యాలలో చక్కగా ఇమడ్చి ,నేటి ట్రెండింగ్ కు అనుగుణంగా చక్కటి ప్రయోగం చేసి శతక ప్రక్రియలోనే కొత్త ప్రయోగం చేసి నూటికి నూరు మార్కులు పొందారు అనడం ముమ్మాటికి వాస్తవమే అని చెప్పవచ్చు.

ప్రతి పద్యం లో ఏదో ఒకటి భావి జీవితానికి పనికి వచ్చే నీతి చెప్పటం ఇందులో ప్రత్యేకత. ఆబాలగోపాలం ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం ఇది అందరిని అలరించే ట్రెండింగ్ పద్యాలు చదవాలని కోరుకుంటూ రచయిత గారికి వందనాలు అభినందనలు శుభాకాంక్షలు

పుస్తక ముఖచిత్రము అందంగా ఆకర్షణీయంగా , బాలలతో తీర్చి దిద్దారు.

పుస్తకంలో పేజీల సంఖ్య 88. పుస్తక ధర 100రూపాయలు.

పుస్తక ప్రతులకు: అవుసుల భాను ప్రకాష్, పోతిరెడ్డిపల్లి, సంగారెడ్డి

పుస్తక సమీక్షకులు: చంద్రకాంత్ గౌడ్, యాడవరం, 9441762105

## కొప్పుల వారి 'నా...గుండె సవ్వడి'




కవి హృదయంలోని సంఘర్షణలు, భావోద్వేగాలను, కవి తన రచనలు ద్వారా ప్రపంచాన్ని, జీవితాన్ని ఎలా చూస్తారో తెలియజేస్తుంది.

తన చుట్టూ ఉన్న సమాజాన్ని, సంఘటన లను గమనించి, వాటిపై తన స్పందనల ను కవితలు ద్వారానే వ్యక్తం చేస్తాడు. సమాజాన్ని మంచి దిశగా నడిపించాలని ప్రేరేపిస్తూ ఉంటాడు.

ఇది సమాజాన్ని ప్రభావితం చేయటానికి ఒక శక్తివంతమైన మార్గంగా భావించిన వారిలో కొప్పుల ప్రసాద్ గారు కూడా ఒకరు. వీరి గురించి తెలియని సాహితీ ప్రియులు ఉ ండరేమో! అనడం అతి శయోక్తి కాకపోవచ్చును.

ఎన్నో పురస్కారాలను అందుకుంటూ, వివిధ సామాజిక మాధ్యమాల్లో, పత్రికల్లో నిత్యం తన రచనలతో ప్రజలను చైతన్య వంతులను చేయడంలో ముందుండే యువ కవి కొప్పుల ప్రసాద్ గారు.

కవి తన కవితల ద్వారా ప్రేమ, విరహం, ఆశ, నిరాశ వంటి మానవ భావాలను అద్భుతంగా వర్ణిస్తాడు.

**"తెల్లటి కాగితంపై మానవత్వం**
**నిర్మలమైన మనస్సుతో చెరగని ఆత్మవిశ్వాసం హృదయ పలకలపై బీజాక్షరంలా/ నిత్యం సత్యమై /నిలిచిపో వాలి నా సంతకం./"** అంటూ కొప్పుల ప్రసాద్ తమ కవితల ద్వారా నిష్కపట మైన హృదయాన్ని ప్రతిబింబిస్తారు. వీరి మరో కవితలోని భావాన్ని తీసుకున్నట్ల యితే.. **"నేనెప్పుడూ ఒంటరిని కాదు /నా చుట్టూ వందల పుస్తక నేస్తాలు/ నన్ను పలకరిస్తూ /నా కళ్ళ ముందు /కదులు తూ నే ఉంటాయి.."** అంటూ కవి, ప్రపం చంలో పుస్తకం విలువను అద్భుతంగా వివరిస్తాడు.

**'ప్రపంచం నన్ను ఒంటరిని చేసినా/ పుస్త కం నన్ను తన ఎదలో దాచుకుంది/'**అని నేను ఎప్పుడో వ్రాసుకున్న వాక్యాలను గుర్తుచేస్తుందిపై కవితలోని భావం.

విభిన్నమైన శైలితో అనేక సామాజిక అం శాలకు తన అక్షరాలతో ప్రాణప్రతిష్ట చేస్తున్న యువ కవి కొప్పుల ప్రసాద్ గారి , మస్తిష్కంలో జనించిన వర్ధమాన భావా లను తనలో నింపుకున్న కవితా సంపుటి 'నా...గుండె సవ్వడి'.

ఈ సంపుటిలోని కవితలు విభిన్న మైన అంశాలతో సులభమైన తెలు గు పదాల కూర్పుతో అందించిన కొప్పుల ప్రసాద్ గారి రచనా శైలి మరోసారి పరిశీలిద్దాం.

**సంకల్పం బలంగా ఉంటే/ ప్రపం చం లో విజేతగా ఉ ంటారు/గుండె లో ధైర్యం మెండుగా నింపితే నేల పైనీ స్థానం సుస్థిరంగా ఉంటుంది./**

ఇలా వ్యక్తం చేస్తూ, తన మోటివేషన్ రచనలతో తెలుగు సాహిత్యంలో విలక్షణమైన శైలికి బాటలు వేస్తున్నా కొప్పుల ప్రసాద్ గారి కలం నుండి, జాలువారిన అక్షరం. తనలో నిలుపుకున్న భావాలను పొందుపరిచిన కవితా సంపుటి 'నా గుండె సవ్వడి'.

నూతన సంవత్సర రోజున ఆవిష్కరణ జరుపుకుని మీ ముందుకు వస్తుంది.

ఆధరించండి, ప్రోత్సాహించండి, కవిత్వం ఆస్వాదించండి.

పుస్తకం కావాల్సిన వారు సంప్రదించండి.

కొప్పుల ప్రసాద్. - 98850 66235

కవి/వ్యాసకర్త.: రాము కోలా. 9849001201

### తెలుగు సాహితీవనం ఆధ్వర్యంలో
## డా.రాణీ పులోమజాదేవి స్మారక కథా పురస్కారం-2025

2021 నుండి 2024 సం వరకు ఆవిష్కరించిన కథా సంపుటాలు 3 ప్రతులు కింది అడ్రస్ కు 31.01.2025 లోగా పంపవలెను. విజేతగా నిలిచిన వారు తప్పని సరిగా తెలుగు సాహితీవనం 8వ వార్షికోత్సవం రోజున హైదరాబాద్ కు వచ్చి రు. 5,116/- నగదు బహుమతితో పాటుగా పురస్కారం అందుకోవలెను.

చిరునామా : అరుణనాయుడు తోట, NCL LB గోదావరి, C-బ్లాక్ #-502, పైప్ లైన్ రోడ్, జీడిమెట్ల,హైదరాబాద్-500067,మొబైల్ :6301930055 సంప్రదించుటకు :9502236670(శాంతి కృష్ణ)

## తెలుగు రాష్ట్రాలలో గోల్డ్ - సిల్వర్ రేట్లు



దేశంలో బంగారం, వెండి ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. శనివారం 10 గ్రాముల బంగారం ధర రూ.79,452 ఉండగా, ఆదివారం నాటికి రూ.78 పెరిగి రూ.79,530కు చేరుకుంది. శనివారం కిలో వెండి ధర రూ.90,095 ఉండగా, ఆదివారం కూడా రూ.90,095గానే ఉంది. హైదరాబాద్లో పది గ్రాముల బంగారం ధర రూ.79,530గా ఉంది. కిలో వెండి ధర రూ.90,095గా ఉంది. విజయవాడలో పది గ్రాముల పసిడి ధర రూ.79,530గా ఉంది. కిలో వెండి ధర రూ.90,095గా ఉంది. విశాఖపట్నంలో 10 గ్రాముల పుత్తడి ధర రూ.79,530గా ఉంది. కిలో వెండి ధర రూ.90,095గా ఉంది. ప్రొద్దుటూరులో 10 గ్రాముల పసిడి ధర రూ.79,530గా ఉంది. కిలో వెండి ధర రూ.90,095

**స్పాట్ గోల్డ్ ధర? :** అంతర్జాతీయ మార్కెట్లోనూ గోల్డ్, సిల్వర్ రేట్లు స్థిరంగా ఉన్నాయి. శనివారం ఔన్స్ గోల్డ్ ధర 2,638 డాలర్లు ఉండగా, ఆదివారం కూడా 2,638 డాలర్లుగానే ఉంది. ప్రస్తుతం ఔన్స్ సిల్వర్ ధర 29.64 డాలర్లుగా ఉంది.

**పెట్రోల్, డీజిల్ ధరలు :** తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణలో పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా ఉన్నాయి. హైదరాబాద్లో లీటర్ పెట్రోల్ ధర రూ.107.45గా ఉంది. డీజిల్ ధర రూ.95.63గా ఉంది. విశాఖపట్నంలో లీటర్ పెట్రోల్ ధర రూ.108.27గా ఉంది. డీజిల్ ధర రూ.96.16గా ఉంది. దిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.94.76గా ఉంటే, డీజిల్ ధర రూ.87.66గా ఉంది.

## మంచి రాబడిని ఇచ్చే టాప్-5 స్కీమ్స్ ఇవే!



: మీ పిల్లల బంగారు భవిష్యత్ కోసం పొదుపు, మదుపు చేయాలని అనుకుంటున్నారా? అయితే ఇది మీ కోసమే. మీ పెట్టుబడిపై గ్యారెంటీగా రాబడిని ఇచ్చే టాప్-5 పథకాల గురించి ఈ ఆర్టికల్లో తెలుసుకుందాం.

1. ఎన్పీఎస్ వాత్సల్య న్ స్కీమ్. : పిల్లల పేరు మీద పెట్టుబడులు పెట్టడానికి వీలు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకమే ఎన్పీఎస్ వాత్సల్య. ఇది ఒక పెన్షన్ స్కీమ్. ఈ పథకంలో కనీసం రూ.1000 నుంచి పెట్టుబడి పెట్టవచ్చు. గరిష్ఠ పెట్టుబడిపై ఎలాంటి పరిమితి లేదు. ఇది ప్రభుత్వ పథకం కనుక ఎలాంటి నష్టభయం ఉండదు. పైగా గ్యారెంటీ రిటర్న్లు ఉంటాయి.

**రెండు రకాల ఖాతాలు :** ఎన్పీఎస్లో టైర్-1, టైర్-2 అనే రెండు రకాల ఖాతాలు ఉంటాయి. టైర్-1 అనేది ఒక ప్రాథమిక పింఛను ఖాతా. ఇందులో ఉపసంహరణలపై కొన్ని పరిమితులు ఉంటాయి. టైర్-2 అనేది స్వచ్ఛంద పొదుపు పథకం లాంటిది. ఎన్పీఎస్లో పెట్టుబడిపై సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద రూ.50,000 వరకు ట్యాక్స్ బెనిఫిట్ లభిస్తుంది. అదనంగా సెక్షన్ 80సీ కింద రూ.1,50,000 వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది.పదవీ విరమణ తర్వాత (60 ఏళ్లు) ఎన్పీఎస్ నిధిలో నుంచి 60 శాతాన్ని ఒకేసారి వెనక్కి తీసుకోవచ్చు. మిగతా 40% మొత్తంతో తప్పనిసరిగా యాన్యుటీ పథకాలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీని వల్ల పదవీ విరమణ తర్వాత పింఛను పొందేందుకు వీలవుతుంది.

**2. సుకన్య సమృద్ధి యోజన :** ఆడపిల్లల కోసం ప్రత్యేకంగా తీసుకొచ్చిన పథకమే సుకన్య సమృద్ధి యోజన. 10 ఏళ్లలోపు వయస్సున్న ఆడపిల్లల పేరు మీద తల్లిదండ్రులు ఈ స్కీమ్లో పెట్టుబడి పెట్టవచ్చు. ఈ స్కీమ్లో 21 ఏళ్ల వరకు ఇన్వెస్ట్ చేయవచ్చు. కావాలని అనుకుంటే పాపకు 18 ఏళ్లు వచ్చిన తరువాత ఉన్నత విద్య, వివాహం కోసం 50 శాతం వరకు డబ్బును విత్డ్రా చేసుకోవచ్చు. ఇది ప్రభుత్వ పథకం కనుక మీ పెట్టుబడికి, రాబడికి ఎలాంటి ఢోకా ఉండదు. ఉదాహరణకు సుకన్య సమృద్ధి యోజన పథకంలో మీరు ఏడాదికి రూ.1.50 లక్షలు చొప్పున డిపాజిట్ చేశారనుకుందాం. 21 ఏళ్ల మెచ్యూరిటీ తర్వాత 8.2శాతం వడ్డీ రేటుతో అది రూ.69 లక్షలు-రూ.70 లక్షలు అవుతుంది.

**3. రికరింగ్ డిపాజిట్స్ (ఆర్డీ) :** ఎలాంటి నష్టభయం లేకుండా మంచి రాబడి సంపాదించాలని అనుకునేవారికి రికరింగ్ డిపాజిట్స్ (ఆర్డీ) బాగుంటాయి. బ్యాంకుల్లో, పోస్ట్ ఆఫీసుల్లో రికరింగ్ డిపాజిట్లు ఓపెన్ చేయవచ్చు. దీర్ఘకాలంపాటు వీటిని కొనసాగిస్తే, పిల్లలు పెద్దవారయ్యే నాటికి పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయి.వాస్తవానికి రికరింగ్ డిపాజిట్లలో మీరు రెగ్యులర్గా (నెలవారీగా) మీకు నచ్చినంత డబ్బులు పొదుపు చేసుకోవచ్చు. ఫిక్స్డ్ డిపాజిట్ లాగానే, రికరింగ్ డిపాజిట్లో కూడా ఫిక్స్డ్ వడ్డీ రేటు ఉంటుంది. ఆర్డీ కూడా నిర్ణీత కాల వ్యవధి (ఫిక్స్డ్ టెన్యూర్) తరువాత మెచ్యూర్ అవుతుంది. కనుక మీకు ఎంత రాబడి వస్తుందో ముందే తెలిసిపోతుంది. ఎఫ్డీతో పోలిస్తే ఆర్డీలో లిక్విడిటీ ఎక్కువగా ఉంటుంది. అంటే మీకు అవసరమైనప్పుడు రికరింగ్ డిపాజిట్ నుంచి డబ్బులు విత్డ్రా చేసుకోవచ్చు. అవసరమైతే ఆర్డీపై లోన్ కూడా తీసుకోవచ్చు.

**4. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ :** దీర్ఘకాలిక పొదుపు పథకాల్లో పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఒకటి. దీనిలో సంవత్సరాలనికి కనిష్ఠంగా రూ.500 నుంచి రూ.1.5 లక్షల వరకు మదుపు చేయవచ్చు. 15 ఏళ్లు లాకిన్ పీరియడ్ ఉంటుంది. దీనిపై సమారుగా 8 శాతం వరకు వడ్డీ రూపంలో ఆదాయం వస్తుంది. అంతేకాదు సెక్షన్ 80 ప్రకారం, పన్ను మినహాయింపు కూడా లభిస్తుంది.

**5. సిస్టమేటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్ (సిప్) :** మ్యూచువల్ ఫండ్స్లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్ (సిప్) విధానంలో పెట్టుబడులు పెట్టవచ్చు. మ్యూచువల్ ఫండ్స్లో డెట్, ఈక్విటీ, హైబ్రిడ్ - ఇలా అనేక రకాలు ఉంటాయి. వీటిలో మీకు నచ్చిన దాంట్లో ఇన్వెస్ట్ చేయవచ్చు. అయితే మ్యూచువల్ ఫండ్స్ మార్కెట్ ఒడుదొడుకులకు లోనవుతూ ఉంటాయి. కనుక భారీ లాభాలు వచ్చే అవకాశం ఎంత ఉంటుందో, నష్టపోయే ప్రమాదం కూడా అంతే ఉంటుంది. అందువల్ల ఇలాంటి పెట్టుబడుల విషయంలో కాస్త అప్రమత్తంగా ఉండాలి.

**కాంపౌండింగ్ ఎఫెక్ట్ :** మ్యూచువల్ ఫండ్స్లో కాంపౌండింగ్ ఎఫెక్ట్ పని చేస్తుంది. అంటే పెట్టిన పెట్టుబడిపై చక్రవడ్డీ రూపంలో రాబడి వస్తూ ఉంటుంది. దీనిని అర్థం చేసుకునేందుకు ఒక చిన్న ఉదాహరణ చూద్దాం.

ఉదాహరణకు ఓ 25 ఏళ్ల వ్యక్తి సిప్ విధానంలో రోజుకు రూ.100 చొప్పున మ్యూచువల్ ఫండ్స్లో ఇన్వెస్ట్ చేయడం ప్రారంభించాడని అనుకుందాం. అప్పుడు నెలకు అతను రూ.3000 వరకు పెట్టుబడి పెట్టినట్లు అవుతుంది. అతను 60 ఏళ్లకు రిటైర్ అయ్యే అవకాశం ఉంది. కనుక ఏటా 10 శాతం చొప్పున తన పెట్టుబడులను పెంచుకుంటూ, 35 ఏళ్ల వరకు పెట్టుబడి కొనసాగించాడు అనుకుంటే, అతను పదవీ విరమణ చేసే నాటికి భారీ మొత్తంలో ఆర్థిక నిధిని సమకూర్చుకునే వీలుంది. దీనిని సింపుల్గా అర్థం చేసుకునేందుకు, ఇప్పుడు ఒక సింపుల్ కాలిక్యులేషన్ చూద్దాం.

ప్రారంభ పెట్టుబడి = రోజుకు రూ.100 చొప్పున లెక్కవేస్తే నెలకు రూ.3000
పెట్టుబడి కాలం = 35 సంవత్సరాలు
యాన్యువల్ రిటర్న్ = 12% (సుమారుగా)
మొత్తం పెట్టుబడి = రూ.3000 X 12 నెలలు X 35 సంవత్సరాలు = రూ.97,56,877
పెట్టుబడిపై వచ్చే రాబడి = రూ.4,35,43,942
35 ఏళ్ల తరువాత పెట్టుబడిదారుడికి అందే మొత్తం ఆర్థిక నిధి = రూ.5,33,00,819




# అత్యధిక విక్రయాలు సాధించిన హైటెక్స్ పైప్స్

హైదరాబాద్ :లి స్టీల్ ట్యూబులు మరియు పైపుల తయారీలో భారతదేశంలో ప్రముఖ సంస్థ హైటెక్ పైప్స్ లిమిటెడ్ ఎఫ్ వై 25 మూడవ త్రైమాసికం మరియు తొమ్మిది నెలల ఫలితాల్లో అపూర్వమైన విక్రయ పనితీరును ప్రకటించడంలో సంతోషం వ్యక్తం చేస్తోంది. క్యూ3 ఎఫ్25లో సంస్థ 1,24,233 ఎంటి విక్రయ వాల్యూమ్ను సాధించింది, ఇది 26.10% సంవత్సరానికోసారి వృద్ధిని సూచిస్తుంది. ఎఫ్ వై 25 తొమ్మిది నెలల్లో విక్రయ వాల్యూమ్ 3,69,415 ఎంటికు పెరిగి, 30.33%వృద్ధిని కనబరిచింది.

ఈ వృద్ధికి ముఖ్య కారణంగా సౌర టార్క్ ట్యూబులు నిలిచాయి. భారతదేశంలోని సౌర విద్యుత్ రంగం వేగంగా విస్తరిస్తుండటంతో, ఈ నాణ్యమైన ఉత్పత్తులకు డిమాండ్ ఎక్కువైంది. దీర్ఘాయుష్షు, ఖచ్చితత్వం మరియు కఠినమైన పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ఈ ట్యూబులు పెద్ద స్థాయి సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం ప్రాధాన్యత పొందాయి.

పునరుత్పత్తి విద్యుత్ రంగంతో పాటు, మౌలిక వసతులు మరియు నిర్మాణ రంగాల్లో కూడా సంస్థ గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. జనరల్ పర్పస్ స్టీల్ పైపుల నుండి స్పెషలైజ్డ్ సొల్యూషన్ల వరకు విస్తరించిన వివిధ ఉత్పత్తి పోర్ట్ఫోలియోతో, హైటెక్ పైప్స్ విభిన్న పరిశ్రమల అవసరాలను తీర్చడంలో ముందంజలో ఉంది.

ఈ విజయంపై హైటెక్ పైప్స్ లిమిటెడ్ చైర్మన్ అజయ్ కుమార్ బన్సల్ మాట్లాడుతూ, "క్యూ3 మరియు ఎఫ్ వై 25 మొదటి తొమ్మిది నెలలలో మా బలమైన విక్రయ వృద్ధి పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాము. మా సౌర టార్క్ ట్యూబుల ద్వారా సాధించిన ఈ మైలురాయిలు, మౌలిక వసతులు మరియు నిర్మాణ రంగాలలో వృద్ధి కూడా మా ఉత్పత్తుల వెడల్పు మరియు ఆచరణ శక్తిని హైలైట్ చేస్తాయి. వినూత్నత, నాణ్యత మరియు మార్కెట్ అవసరాలను తీర్చడంలో మేము నిరంతరం కృషి చేస్తాము," అని తెలిపారు.




హైటెక్ పైప్స్ భారతదేశంలోని అత్యుత్తమ ఉత్పత్తి కంపెనీల్లో ఒకటిగా నిలిచింది. 6 ఆధునిక ఉత్పత్తి కేంద్రాలు, 7,50,000 ఎంటిపిఏ స్థాపిత సామర్థ్యంతో పనిచేస్తూ ఎఫ్ వై 25లో 1 మిలియన్ టన్నుల సామర్థ్యాన్ని చేరుకోనుంది. 20 రాష్ట్రాల్లో 450o డీలర్లతో దేశవ్యాప్తంగా విస్తృత మార్కెటింగ్ నెట్వర్క్ కలిగి ఉంది.

## ఆప్టా కెటలిస్ట్ బిజినెస్ కాన్ఫరెన్స్ ప్రారంభం




హైదరాబాద్ : రెన్యువబుల్ ఎనర్జీ ప్రాముఖ్యతను తెలియజేసేందుకు నిర్వహిస్తున్న ఆప్టా కెటలిస్ట్ గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్ శనివారం హైటెక్స్ (హైదరాబాద్) లో ప్రారంభం అయ్యింది. ఆదివారంతో ముగుస్తుంది. ఈ ఈవెంట్లో మొదటి రోజు16 ప్యానెల్ డిస్కషన్లు జరిగాయి. బొండాడ ఇంజినీరింగ్ ఎండీ రాఘవేంద్ర రావు, గ్రీన్కో అసోసియేట్ డైరెక్టర్ మౌర్య పైడా తదితరులు పాల్గొన్నారు. ఇండియాలోని 5 శాతం వేస్ట్ ల్యాండ్ను వాడుకున్నా, పెద్ద మొత్తంలో సోలార్ కరెంట్ను ఉత్పత్తి చేయొచ్చని మౌర్య అన్నారు. కాగా, కెటలిస్ట్ బిజినెస్ పిచ్ కాంపిటీషన్(కేబీపీ)లో పాల్గొన్న 74 స్టార్టప్లలో 16 స్టార్టప్లు షార్ట్ లిస్ట్ అయ్యాయి. ఇవి కాన్ఫరెన్స్లో తమ ఐడియాలను వివరించాయి.

## ట్రిపుల్ బొనాంజా.. బోనస్

### స్టాక్ స్ప్లిట్తో 100 షేర్లకు 400 షేర్లు.. ఆపై 100 శాతం డివిడెండ్!




స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు అంటే స్టాక్ పెరిగినప్పుడే లాభాలు రావడం అని చాలా మంది అనుకుంటారు. కానీ, దీర్ఘకాలం కొనసాగే వారికి చాలా రకాల బెనిఫిట్స్ ఉంటాయి. దీంతో ఎక్కువ లాభాలు అందుతుంటాయి. అందులో ప్రధానంగా బోనస్ షేర్లు, స్టాక్ స్ప్లిట్, డివిడెండ్ వంటివి ఉంటాయి. వీటి ద్వారా షేర్లు భారీగా పెరిగా వాటిపై రాబడులు పెరుగుతాయి. తాజాగా ఓ కంపెనీ తమ ఇన్వెస్టర్లకు ట్రిపుల్ బొనాంజా అందించేందుకు సన్నద్ధమవుతోంది. అదే ప్రధిన్ లిమిటెడ్ ఒకేసారి బోనస్ షేర్లు, స్టాక్ స్ప్లిట్ చేపట్టడంతో పాటుగా 100 శాతం డివిడెండ్ ఇవ్వాలని భావిస్తున్నట్లు కంపెనీ వర్గాల సమాచారం. అదే జరిగితే 100 షేర్లు కొనుగోలు చేసిన వారికి ఏకంగా 400 షేర్లు అందనున్నాయి. ఆపైన 100 శాతం డివిడెండ్ రానుంది.బోనస్, స్టాక్ స్ప్లిట్, డివిడెండ్ అంశంపై చర్చించేందుకు జనవరి 17,2025 రోజున తమ కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు సమావేశమవుతున్నట్లు ఓ నోటిఫికేషన్ జారీ చేసింది ప్రధిన్ లిమిటెడ్ సంస్థ. 10:1 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే ఇది షేర్ హోల్డర్ల అనుమతికి లోబడి ఉంటుందని కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. అలాగే ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ 100 శాతం మధ్యంతర డివిడెండ్ ప్రతిపాదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే 2:1 రేషియోలో బోనస్ షేర్లు అందించనుంది. ఈ విషయంపై జనవరి 17న జరిగే బోర్డ్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఆ తర్వాత స్టాక్ స్ప్లిట్, బోనస్ షేర్లు, డివిడెండ్ చెల్లింపులకు సంబంధించిన రికార్డ్ తేదీలను కంపెనీ ప్రకటిస్తుంది. ప్రధిన్ లిమిటెడ్ అనేది గతంలో భగవాన్ దాస్ మెటల్స్ లిమిటెడ్ పేరుతో ఉండేది. ఇది ఒక డైరీ ఉత్పత్తుల తయారీ కంపెనీ. దీనిని 1982లో ఏర్పాటు చేశారు. అంతకు ముందు ఇది స్టీల్ ఇండస్ట్రీలో సేవలందిచింది. 2018 తర్వాత వ్యాపారంలో మార్పులు చేసింది. దీంతో కంపెనీ మేనేజ్మెంట్లో భారీ మార్పులు వచ్చాయి. ఆ తర్వాతే ప్రధిన్ లిమిటెడ్గా మార్చారు. డైరీ ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, ట్రేడింగ్ అంశాలపైనే ప్రధాన దృష్టి సారించింది. ఈ కంపెనీ స్వచ్ఛమైన నెయ్యి, స్కిమ్మ్డ్ మిల్క్ పౌండర్, వైట్ బట్టర్, యెల్లో బట్టర్, డైరీ వైట్నర్ వంటివి ఉత్పత్తి చేస్తోంది. ఈ కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.59.79 కోట్లుగా ఉంది. స్టాక్ మార్కెట్ చివరి ట్రేడింగ్ సెషన్లో ఈ కంపెనీ షేర్లు 5 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్ రూ.26.17 వద్ద లాక్ అయ్యాయి. బీఎస్ఈలో ఈ షేర్లు 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.23.32 నుంచి 12.22 శాతం మేర పెరిగాయి. ఈ క్రమంలో ఈ మైక్రో క్యాప్ కంపెనీ స్టాక్పై దృష్టి సారించాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

# టాప్ 5 స్టాక్ మార్కెట్ టిప్స్!

### బిగ్ బుల్ రాకేశ్ ఝున్ఝున్వాలా

ఇండియన్ స్టాక్ మార్కెట్లో 'బిగ్ బుల్' రాకేశ్ ఝున్ఝున్వాలాది ఒక ప్రత్యేకమైన స్థానం. ఆయన చాలా గొప్ప దూరదృష్టితో షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టి పెద్ద ఎత్తున లాభాలను సంపాదించారు. ఆయన ఎంతో సహనంతో, క్షుణ్ణంగా పరిశోధన చేసి, కాలిక్యులేటెడ్ రిస్క్ తీసుకునేవారు. అందుకే ఒక సాధారణ ఇన్వెస్టర్ స్థాయి నుంచి 'ది బిగ్ బుల్' స్థాయికి ఎదిగారు. మరి ఆయనలాగే మీరు కూడా స్టాక్ మార్కెట్లో మంచి లాభాలు సంపాదించాలని అనుకుంటున్నారా? అయితే ఇది మీ కోసమే. బిగ్ బుల్ చెప్పిన టాప్-5 టిప్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**1. దీర్ఘకాల దృష్టితో పెట్టుబడులు :** రాకేశ్ ఝున్ఝున్వాలా దీర్ఘకాలిక దృష్టితో పెట్టుబడులు పెట్టేవారు. తను అనుకున్న ఫలితాలు వచ్చే వరకు ఎంతో సహనంగా ఉండేవారు. ఆయన టైటాన్ కంపెనీ షేర్లను కొనుగోలు చేసిన విధానాన్ని పరిశీలిస్తే ఈ విషయం మనకు బాగా అర్థమవుతుంది.రాకేశ్ ఝున్ఝున్వాలా 2002-03లో టైటాన్ షేర్లను కొనుగోలు చేయడం ప్రారంభించారు. అప్పట్లో టైటాన్ షేర్ ధర రూ.3-రూ.4 మాత్రమే ఉండేది. ప్రస్తుతం టైటాన్ షేర్ వాల్యూ రూ.3,400 వరకు ఉంది. వాస్తవానికి 2008లో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం వచ్చింది. అలాంటి క్లిష్టపరిస్థితుల్లోనూ రాకేశ్ టైటాన్ షేర్లను అమ్మలేదు. పైగా 2012లో తన స్టేక్ను 10.28 శాతానికి పెంచుకున్నారు. ప్రస్తుతం టైటాన్లో 5.05 శాతం స్టేక్ రాకేశ్, రేఖా ఝున్ఝున్వాలా జాయింట్ అకౌంట్లో ఉన్నాయి. దీని విలువ సుమారుగా రూ.11,081 కోట్లు ఉంటుంది. ఇది రాకేశ్ ఝున్ఝున్వాలాకు ఉన్న దూరదృష్టిని, సహనాన్ని మనకు తెలియజేస్తుంది.

**2. సమగ్ర పరిశోధన :** రాకేశ్ ఝున్ఝున్వాలా ఏదైనా స్టాక్లో పెట్టుబడులు పెట్టేముందు డీప్ రీసెర్చ్ (సమగ్ర పరిశోధన) చేసేవారు. ఇందుకు ఉదాహరణగా 'లుపిన్' స్టాక్ను తీసుకోవచ్చు.



బిగ్ బుల్ పోర్ట్ఫోలియోలోని ముఖ్యమైన స్టాక్స్లో లుపిన్ ఒకటి. దీని ద్వారా రాకేశ్ చాలా లాభం పొందారు. 2023లో రాకేశ్ ఝున్ఝున్వాలా ఈ స్టాక్స్లో ఇన్వెస్ట్ చేయడం ప్రారంభించారు. అప్పుడు ఆయన స్టేక్ వాల్యూ సుమారుగా రూ.500 కోట్లు. అయితే 2008 నాటికి లుపిన్లో ఆయన స్టేక్ 4.29 శాతానికి తగ్గింది. అప్పుడు దాని మొత్తం విలువ రూ.154 కోట్లు మాత్రమే. ఇలా ఆయన క్రమంగా లుపిన్ నుంచి తన పెట్టుబడులను ఉపసంహరించుకుంటూ వచ్చారు. ఎప్పుడైతే లుపిన్ షేర్ వాల్యూ రూ.1,100కు చేరిందో, వెంటనే తన దగ్గర ఉన్న షేర్లు అన్నీ అమ్మేసి గొప్ప లాభాలను మూటగట్టుకున్నారు. దీనికంతటికీ ఆయన చేసిన డీప్ రీసెర్చ్ కారణం. లుపిన్ ప్రపంచవ్యాప్తంగా ఎలా విస్తరిస్తోంది? భవిష్యత్లో ఎలాంటి ప్రొడక్టులు తీసుకువస్తుంది? ప్రస్తుతం కంపెనీ ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఇలాంటివన్నీ సమగ్రంగా పరిశీలించి, తగు సమయంలో ఆ కంపెనీ షేర్లను పూర్తిగా వదిలించుకుని, గొప్ప లాభాలను పొందారు.

**3. నమ్మకం, సహనం :** 2008 ఆర్థిక మాంద్యం సమయంలో రాకేశ్ ఝున్ఝున్వాలా తన పెట్టుబడి వ్యూహాలపై నమ్మకంతో, చాలా సహనంగా వ్యవహరించారు. క్రిసిల్ షేర్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనైనప్పటికీ వాటిని అమ్మకుండా, అలాగే తన పోర్ట్ఫోలియోలో ఉంచుకున్నారు. వాస్తవానికి 2003లో 10,000 క్రిసిల్ షేర్లను మొదటిసారి కొన్నారు. 2006 నాటికి తన హోల్డింగ్స్ను ఏకంగా 5.5 మిలియన్ షేర్లకు పెంచుకున్నారు. ఆయన ఆ షేర్లను రూ.400-రూ.500 ప్రైస్ రేంజ్లో కొన్నారు. 2013లో రేఖా ఝున్ఝున్వాలా తమ దగ్గరున్న వాటిలో ఏకంగా 4 లక్షల షేర్లను అమ్మేసి రూ.46 కోట్లను సంపాదించారు. ఇంకా ఆమె దగ్గర 5.48 శాతం క్రిసిల్ షేర్లు ఉన్నాయి. ప్రస్తుతం వాటి విలువ సుమారుగా రూ.1,322 కోట్లు ఉంటుంది.

**4. కాలిక్యులేటెడ్ రిస్క్ :** స్టాక్ మార్కెట్లో కొన్నిసార్లు రిస్క్ తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అది కచ్చితంగా కాలిక్యులేడ్ రిస్క్ అయ్యుండాలి. రాకేశ్ ఝున్ఝున్వాలా ఎప్పుడూ దీనిని అనుసరించేవారు. ఆయన వైస్రాయ్ హోటల్స్ షేర్లను రిస్క్ తీసుకుని కొన్నానని చెబుతుండేవారు. 2015లో రాకేశ్ వైస్రాయ్ హోటల్స్ షేర్లను (1.18 శాతం స్టేక్) కొనడం ప్రారంభించారు. 2016 సెప్టెంబర్ నాటికి తన స్టేక్ను 13.46 శాతానికి పెంచుకున్నారు. కానీ 2018 నాటికి తన మొత్తం స్టేక్ను 1 శాతం కంటే దిగువకు తగ్గించుకున్నారు. ఇలా చేసిన కొంత కాలం తరువాత సదరు కంపెనీ బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో అదనపు నిఘా చర్యల జాబితాలోకి వెళ్లిపోయింది. దీనిని బట్టి రాకేశ్ ఝున్ఝున్వాలా ఎంత గొప్పగా కాలిక్యులేటెడ్ రిస్క్ తీసుకునేవారో అర్థం చేసుకోవచ్చు.

**5. గ్రోత్ పొటెన్షియల్ :** ఒక కంపెనీ భవిష్యత్లో ఎంత గొప్పగా అభివృద్ధి చెందగలదో, దాని గ్రోత్ పొటెన్షియల్ ఎలా ఉందో రాకేశ్ ఊహించగలిగేవారు. ఉదాహరణకు ఆయన ఎడ్యుకేషన్ కంపెనీలో షేర్లు కొన్నారు. భారతదేశంలో విద్యా సేవలకు పెరుగుతున్న డిమాండ్ను ఆయన ముందుగానే పసిగట్టారు. దీని ద్వారా కూడా ఆయన గొప్ప లాభాలు సంపాదించారు.

# పెళ్లికాని జంటలకు ఇకపై నో రూమ్

### ఓయో కొత్త చెక్-ఇన్ పాలసీ

ప్రముఖ హొటల్ అగ్రిగేటర్ ఓయో కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త చెక్-ఇన్ పాలసీ తీసుకొచ్చింది. ఈ ఏడాదిలో అమల్లోకి వచ్చే కొత్త మార్గదర్శకాలు పరిచయం చేసింది. అందులో భాగంగా ఇకపై పెళ్లికాని జంటలు రూమ్ బుక్ చేసుకునేందుకు వీలుండదు. ఈ నిబంధనలు తొలుత మేరఠ్ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని కంపెనీ ఆదివారం వెల్లడించింది. ఓయో సవరించిన పాలసీ ప్రకారం.. ఇకపై పెళ్లికాని జంటలకు రూమ్లు ఇవ్వరు. కొత్త చెక్-ఇన్ పాలసీ ఆధారంగా.. ఇకపై ఆన్లైన్లో లేదా ఆఫ్లైన్లోనైనా రూమ్ బుకింగ్ సమయంలో అన్ని జంటలు పెళ్లి చెల్లుబాటు అయ్యే రుజువును సమర్పించాల్సి ఉంటుంది. అంటే కచ్చితంగా పెళ్లిని నిర్ధరించే ఐడీ ప్రూఫ్ చూపించాల్సి ఉంటుంది. ఏదైనా సందర్భంలో ఇలాంటి బుకింగ్లను తిరస్కరించే విచక్షణాధికారాన్ని ఓయో తన భాగస్వామి హొటళ్లకు అందించింది. మేరఠ్లోని తన భాగస్వామ్య హొటళ్లలో తక్షణమే దీన్ని అమల్లోకి తీసుకురావాలని నిర్దేశించింది. గ్రౌండ్ ఫీడ్బ్యాక్ ఆధారంగా కంపెనీ దీన్ని మరిన్ని నగరాలకు విస్తరించే అవకాశం ఉందని సంబంధిత వ్యక్తులు తెలిపారు. ఓయో సురక్షితమైన, బాధ్యతాయుతమైన ఆతిథ్య పద్ధతులను అమలు చేసేందుకు కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఓయో నార్త్ ఇండియా రీజియన్ హెడ్ పవాస్ శర్మ అన్నారు. కుటుంబాలు, విద్యార్థులు, ఒంటరిగా ప్రయాణం చేసేవారికి సురక్షితమైన వసతులు అందించే బ్రాండ్గా నిలవాలని ఓయో భావిస్తోంది. అందులో భాగంగానే తాజాగా కొత్త చెక్ -ఇన్ పాలసీ తీసుకొచ్చింది. కస్టమర్ల విశ్వాసం పెరిగి, బుకింగ్లు పెరిగేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడుతుందన్నారు. అయితే వ్యాలిడ్ ప్రూఫ్గా ఏయే పత్రాలు చూపించాలనేదానిపై స్పష్టత ఇవ్వలేదు.




## జియో గేమ్ ఛేంజర్ ప్లాన్..

ప్రముఖ టెలికాం సంస్థలు జియో, ఐడియా, ఎయిర్ టెల్ రీఛార్జ్ ప్లాన్ ధరలను పెంచిన సంగతి తెలిసిందే. అయితే దేశంలోని యూజర్లందరూ తమ సిమ్ ను బిఎస్ఎన్ఎల్ కు పోర్ట్ చేసుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం ఈ బిఎస్ఎన్ఎల్ సరసమైన, చౌకైన రీఛార్జ్ ప్లాన్ లను అందించడంతో యూజర్లందరూ దానికి పోర్టు అవుతున్నారు. ఈ నేపథ్యంలో జియో కస్టమర్లను ఆకర్షించేందుకు సరితో సరసమైన, చౌకైన ప్లాన్స్ ని తీసుకువస్తోంది. అదే రూ. 198 రీఛార్జ్ ప్లాన్. ఏది రూ. 200 కంటే తక్కువ ధరలో ఉండడం విశేషం. ఇందులో రోజువారీగా 2 జిబి డేటా వస్తుంది. అంతేకాకుండా అపరిమిత 5జీని కూడా అందిస్తుంది. ఇప్పుడు ఈ ప్లాన్ వివరాలు చూద్దాం.

**జియో రూ. 198 ప్రీపెయిడ్ ప్లాన్**

రిలయన్స్ జియో రూ.198 ప్రీపెయిడ్ ప్లాన్ 14రోజుల వ్యాలిడిటీ తో వస్తుంది. ఇందులో అపరిమిత వాయిస్ కాలింగ్ పొందొచ్చు. అంతేకాకుండా రోజుకు 100ఎస్ఎంఎస్ సదుపాయం కూడా పొందొచ్చు. ఇకపోతే రోజుకు 2జీబీ అందిస్తుంది. అయితే, ఈ ప్లాన్ 5జీ ప్రయోజనాలతో కూడా వస్తుంది. ఈ ప్లాన్ లో అదనపు ప్రయోజనాలు జియో టీవీ, జియో సినిమా, జియో క్లౌడ్ సేవలు వస్తాయి. అయితే, రిలయన్స్ జియో 2జీబీ రోజువారీ డేటా లేదా అంతకంటే ఎక్కువ ప్లాన్లతో మాత్రమే అపరిమిత 5జీని అందిస్తుంది. కావున ఇది జియో కస్టమర్లకు అందుబాటులో ఉన్న యాక్టివ్ సర్వీస్ చెల్లుబాటుతో చౌకైన అపరిమిత 5%+ ప్లాన్ అని చెప్పవచ్చు.

# ఈ దేశాల్లోనూ ఈజీగా యుపిఐ

భారత్ లో ఇప్పుడు డిజిటల్ పేమెంట్స్ విపరీతంగా పెరిగిపోయాయి. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరు డిజిటల్ పేమెంట్స్ మోడ్ ను ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా పెద్ద నోట్ల రద్దు తర్వాత భారత్ లో డిజిటల్ పేమెంట్స్ నెమ్మదిగా పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం చాలా మంది పర్సులో మనీ క్యారీ చేయడమే మర్చిపోతున్నారు. ఎంత డబ్బు అయినా ఫోన్ ద్వారానే ట్రాన్స్ ఫర్ చేస్తున్నారు. చివరకు చాయ్ తాగినా, చాక్లెట్ తిన్నా.. రూ, 5, 10 కూడా ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం లాంటి యాప్స్ ద్వారా మనీ పే చేస్తున్నారు. మొత్తంగా దేశంలో డిజిటల్ పేమెంట్స్ రెవల్యూషన్ అనేది కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో పలు యుపిఐ యాప్స్ భారతీయులు విదేశాల్లోనూ డిజిటల్ పేమెంట్స్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. భారత్ తో పాటు పలు దేశాలు కూడా ఈ డిజిటల్ పేమెంట్స్ ను అనుమతిస్తున్నాయి. ఇంతకీ ఏ ఏ దేశాల్లో డిజిటల్ పేమెంట్స్ చేసే అవకాశం ఉందో తెలుసుకుందాం..

**యుపిఐ పేమెంట్స్ యాక్సెప్ట్ చేసే దేశాలు :** యుపిఐ పేమెంట్స్ ఇప్పుడు భారత్ తో పాటు పలు పొరుగు దేశాలు, యూరోపియన్ కంట్రీట్స్ లోనూ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నాయి డిజిటల్ పేమెంట్స్ యాప్స్. ప్రస్తుతం ఇండియన్ యుపిఐ యాప్స్ ద్వారా సింగపూర్, దుబాయ్, శ్రీలంక, నేపాల్, భూటాన్, ఫ్రాన్స్, మారిషస్ లో కూడా పేమెంట్స్ చేసే అవకాశం ఉంది. భారత్ లో ఎలా అయితే, యుపిఐని ఉపయోగించి పేమెంట్స్ చేస్తున్నారో, అక్కడ కూడా అలాగే పేమెంట్స్ చేసే అవకాశం ఉంటుంది. అయితే, విదేశాల్లో యుపిఐ పేమెంట్స్ చేయాలంటే యాప్ లో కొన్ని సెట్టింట్స్ చేస్తే సరిపోతుంది. ఈ సెట్టింగ్స్ కచ్చితంగా మార్చితేనే విదేశాల్లో డిజిటల్ పేమెంట్స్ చేసే అవకాశం ఉంది. ఇంతకీ ఆ సెట్టింగ్ ఏంటి? ఎలా మార్చాలంటే..

**ఫోన్ పేలో మార్చాల్సిన సెంట్టింగ్స్**

◉ ముందుగా ఫోన్ పే యాప్ ఓపెన్ చేయాలి. ◉ ప్రొఫైల్ అనే ఆప్షన్ మీద క్లిక్ చేయాలి.◉ కిందికి స్క్రోల్ చేస్తే ఇంటర్నేషనల్ అనే ఆప్షన్ కనిపిస్తుంది. దాని మీద క్లిక్ చేయాలి.◉ అప్పుడు మన బ్యాంక్ అకౌంట్స్ వివరాలు కనిపిస్తాయి. మీరు విదేశాల్లో ఏ బ్యాంక్ ద్వారా పేమెంట్స్ చేయాలి అనుకుంటున్నారో ఆ బ్యాంక్ ను యాక్టివేట్ చేసుకోవాలి.

◉ ఇక మీరు యుపిఐ యాప్ లో ఏ బ్యాంక్ అకౌంట్ అయితే యాక్టివేట్ చేస్తారో, ఆ బ్యాంక్ అకౌంట్ నుంచి స్కాన్ చేసి విదేశాల్లో యుపిఐ ద్వారా పేమెంట్స్ చేసుకోవచ్చు.




గూగుల్ పే, పేటీఎం లాంటి యాప్స్ లో కూడా ఇంటర్నేషనల్ అనే ఆప్షన్ ను యాక్టివేట్ చేసుకోవడం ద్వారా విదేశాల్లో ఈజీగా పేమెంట్స్ చేసే అవకాశం ఉంటుంది. భారత్ లో ఎలా అయితే, క్యాష్ లెస్ పేమెంట్స్ చేస్తున్నారో, ఇతర దేశాల్లోనే అలాగే చేసే అవకాశం ఉంటుంది.


సూర్య
విజయవాడ
సోమవారం
6 జనవరి 2025


# ట్రంప్‌తో ఇటలీ ప్రధాని మెలోని భేటీ

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ మరికొన్ని రోజుల్లో అధికార బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో ఇటలీ ప్రధాని జార్జియా మెలోని ట్రంప్తో భేటీ అయ్యారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్గా మారాయి. శనివారం ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగో ఎస్టేట్లో ఈ ఇరువురు నేతల సమావేశమయ్యారు. 'ఇది సంతోషకరమైన సమయం. అద్భుతమైన మహిళ, ఇటలీ ప్రధానితో ఉన్నాను' అని ట్రంప్ అక్కడి వారితో పేర్కొన్నారు. ఇరువురి నేతల సమావేశానికి సంబంధించిన వివరాలు వెల్లడి కాలేదు. అయితే, ఉక్రెయిన్ తో రష్యా యుద్ధం, వాణిజ్య సమస్యలు, మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలతో పాటు ఇరాన్ లో నిర్బంధించిన ఇటాలియన్ జర్నలిస్టు విడుదల వంటి అంశాలను గురించి చర్చించినట్లు తెలుస్తోంది.

ఈ మేరకు ఇటాలియన్ వార్తా సంస్థలు వెల్లడిస్తున్నాయి. దీనిపై ప్రధాని కార్యాలయం ఎలాంటి ప్రకటన చేయలేదు. మరోవైపు.. ఇటలీకి చెందిన ఓ జర్నలిస్టును టెహ్రాన్ అధికారులు అరెస్టు చేశారు. ఈవిషయాన్ని ఇటలీ విదేశాంగశాఖ ధ్రువీకరించింది.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ట్రంప్తో అనేక మంది దేశాధినేతలు భేటీ అయ్యారు. ఇటీవల అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలి , హంగేరీ ప్రధాని విక్టోర్ అర్బన్ , కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ) సైతం ఆయనతో సమావేశమయ్యి చర్చలు జరిపారు.



# ఢిల్లీలో అభివృద్ధి నిల్

- ఆప్ పాలన అంతా అస్త వ్యస్తం
- దేశ రాజధానిని తిరిగి పట్టాలెక్కించాల్సిన తరుణం
- ఆప్ సర్కార్ పై ప్రధాని నరేంద్ర మోడీ విమర్శలు
- నమో భారత్ కారిడార్ ప్రారంభించిన ప్రధాని
- తొలిసారి భూగర్భ విభాగంలో నమో భారత్ రైళ్లు పరుగులు



ఢిల్లీ: ఆమ్ఆద్మీ ప్రభుత్వంతో దిల్లీ ప్రజలు విసిగిపోయారని ప్రధాని నరేంద్ర మో డీ విమర్శించారు. ప్రస్తుతం వారు దేశ రాజధానిని అభివృద్ధి బాటలో నడిపే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. గత పదేళ్ల ఆప్ ప్రభుత్వ పాలనలో దిల్లీ అభివృద్ధి పట్టాలు తప్పిందని మండిపడ్డారు. కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రజావ్యతిరేక పార్టీ అని దుయ్యబట్టారు. ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధాని నగరంగా దిల్లీని అభివృద్ధి చేయడం భాజపాకు మాత్రమే సాధ్యమని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు.

దేశరాజధానిలో భాజపా త్వరలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. దిల్లీ ప్రజలకు వచ్చిన ఆపదను దూరం చేయడానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. కొవిడ్ సమయంలో ప్రజలంతా సరైన వైద్య సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతుంటే కేజ్రీవాల్ మాత్రం అద్దాల మేడ నిర్మించుకోవడంలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు.

**నమో భారత్ కారిడార్ ప్రారంభం..**

ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీ-ఘజియాబాద్-మేరఠ్ నమో భారత్ కారిడార్



ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్లోని సాహిబాబాద్, దిల్లీలోని న్యూ అశోక్ నగర్ మధ్య నమో భారత్ ఆర్ఆర్టీఎస్ కారిడార్లో 13 కిలోమీటర్ల అదనపు సెక్షన్ను ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి సాహిబాబాద్ నుంచి న్యూ అశోక్ నగర్ వరకు ప్రయాణించారు. ఈమార్గంలో కొత్తగా ప్రారంభించిన రైలు 13 కి.మీ విభాగంలో 6కి.మీ మేర భూగర్భంలో నడవనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నమో భారత్ రైళ్లు భూగర్భ విభాగంలో నడపడం ఇదే తొలిసారని తెలిపారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లను అనుసంధానం చేసే విధంగా నమో భారత్ స్టేషన్లను రూపొందించారు.

ప్రస్తుతం ఆర్ ర్ టిఎస్ ఢిల్లీ-మీరట్ కారిడార్లో 42 కిలోమీటర్ల మేర నమో భారత్ రైళ్లు నడుస్తున్నాయి. ఢిల్లీ మెట్రోకు ఎన్సిఆర్ లో 393 కిలోమీటర్ల నెట్వర్క్ ఉంది. ఢిల్లీలో రవాణా వ్యవస్థను విస్తరించేందుకు తాము కట్టుబడి ఉన్నామన్నారు ప్రధాని మోదీ. దేశ రాజధాని అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి పూర్తిగా అంకితమైన ప్రభుత్వాన్ని ఢిల్లీ ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

ఈ కొత్త కనెక్టివిటీ వల్ల లక్షలాది మంది ప్రయాణికులు నేరుగా ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. దాదాపు రూ. 1200 కోట్ల వ్యయంతో ఢిల్లీ మెట్రో ఫేజ్- 4లోని జనక్పురి %-% కృష్ణా పార్క్ మధ్య 2.8 కిలోమీటర్ల విస్తీర్ణాన్ని కూడా ప్రధాని మోదీ ప్రారంభించారు. ఇది ఢిల్లీ మెట్రో ఫేజ్-4మొదటి విభాగం ప్రారంభోత్సవంతో ఢిల్లీ మెట్రో నెట్వర్కు మరింత విస్తరిస్తుంది. ఢిల్లీ-మీరట్ ఆర్ ర్ టిఎస్ కారిడార్ పొడవు 82.15 కిలోమీటర్లు. ఇది ఢిల్లీలో 14 కిలోమీటర్లు, యూపీలో 68 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఫేజ్-1లో ప్రతిపాదించిన మరో రెండు కారిడార్లలో ఒకటైన ఢిల్లీ-పానిపట్ కారిడార్ పొడవు 103.02 కిలోమీటర్లు. అల్వార్- సరాయ్ కాలే ఖాన్ మధ్య కారిడార్ పొడవు 106 కిలోమీటర్లు. ఢిల్లీ నుంచి పానిపట్, అల్వార్ వరకు కారిడార్ నిర్మాణం తర్వాత ఢిల్లీ-ఎన్సిఆర్ లోని ఆర్ ర్ టిఎస్ లోని అన్ని కారిడార్ల మొత్తం పొడవు 291 కిలోమీటర్లకు పైగా ఉంటుంది. ఈ రెండు కారిడార్లకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను కూడా సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాత దీనికి సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి.

ఈ ప్రారంభోత్సవంతో పశ్చిమ ఢిల్లీలోని కృష్ణా పార్క్, వికాస్పురి %-% జనక్పురి వంటి ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. దీనితో పాటు, ఢిల్లీ మెట్రో ఫేజ్-%×ఎ% కింద సుమారు రూ. 6230 కోట్లతో 26.5 కి.మీ పొడవున రిథాలా-కుండ్లీ సెక్షన్కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఢిల్లీలోని రిథాలా నుండి హర్యానాలోని కుండ్లికి అనుసంధానం చేయడానికి ఈ కొత్త కారిడార్ నిర్మిస్తున్నారు. ఇది ఢిల్లీ %-% హర్యానాలోని వాయువ్య ప్రాంతాల మధ్య కనెక్టివిటీని మెరుగుపరుస్తుంది.

న్యూఢిల్లీలోని రోహిణిలో సెంట్రల్ ఆయుర్వేద పరిశోధనా సంస్థ (సీఏఆర్ఐ) కోసం కొత్త అత్యాధునిక భవనానికి కూడా ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.185 కోట్లతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఈ కొత్త క్యాంపస్ అత్యాధునిక ఆరోగ్య సేవలు %-% వైద్య మౌలిక సదుపాయాలను అందిస్తుంది. ఇది పరిశోధకులు, రోగులకు మెరుగైన అనుకూలంగా ఉ ఒడనుంది. ఈ ప్రాజెక్టులన్నింటి ప్రారంభోత్సవం ఢిల్లీతోపాటు దాని పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్, కనెక్టివిటీని మెరుగుపరచడమే కాకుండా ఇక్కడ నివసించే పౌరుల జీవన నాణ్యతను మెరుగుపరిచే ఆరోగ్యం, విద్యా, ఇతర ప్రాథమిక సౌకర్యాలలో అభివృద్ధికి దోహదపడుతాయి.

**మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి..**

దిల్లీ భాజపా అధ్యక్షుడు వీరేంద్ర సచ్దేవా మాట్లాడుతూ.. దిల్లీ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 12,200 కోట్లు కేటాయించిందని అన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. రిథాలా-కుండ్లి మెట్రో పొడిగింపు, జనక్పురి-కృష్ణా పార్క్ మెట్రో లైన్, ర్యాపిడ్ రైల్ కారిడార్ వంటి ప్రాజెక్టులను ఆయన ప్రస్తావించారు. దిల్లీని ఎవరైనా అభివృద్ధి చేస్తే అది ప్రధాని మోదీ మాత్రమే అని అన్నారు.

## కూలిన కోస్ట్గార్డ్ హెలికాప్టర్.. ముగ్గురు మృతి



అహ్మదాబాద్: ఇండియన్ కోస్ట్ గార్డ్కు చెందిన అడ్వాన్స్డ్ లైట్ హెలికాప్టర్ (ఏఎల్హెచ్) కూలిపోయింది. దీంతో మంటలు చెలరేగాయి. హెలికాప్టర్లోని ముగ్గురు సిబ్బంది ఈ ప్రమాదంలో మరణించారు. గుజరాత్లోని పోర్బందర్లో ఈ సంఘటన జరిగింది. ఇండియన్ కోస్ట్ గార్డ్కు చెందిన ధ్రువ్ హెలికాప్టర్ సాధారణ గస్తీ కోసం బయలుదేరింది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పోర్బందర్ సమీపంలోని గ్రౌండ్లో అది కూలిపోయింది. ఆ వెంటనే మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేశారు. కాగా, ఇండియన్ కోస్ట్ గార్డ్కు చెందిన ఎయిర్ ఎన్క్లేవ్ వద్ద ఈ ప్రమాదం జరిగినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అందులో ప్రయాణించిన సిబ్బందిలో ముగ్గురు మరణించినట్లు చెప్పారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. హెలికాప్టర్ కూలడానికి కారణం ఏమిటన్న దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు హెలికాప్టర్ కూలిన తర్వాత మంటలు చెలరేగిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## ఛత్తీస్గఢ్లో ఎన్కౌంటర్

### నలుగురు మావోయిస్టులు హతం



రాయ్పూర్: ఛత్తీస్గఢ్లోని బస్తర్ రీజియన్ మరోసారి కాల్పుల మోతతో దద్దరిల్లింది. నారాయణ్పూర్-దంతెవాడ జిల్లాల సరిహద్దుల్లోని దండకారణ్యం లో జరిగిన ఎన్కౌంటర్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. వావోయిస్టుల కాల్పుల్లో డీఆర్జీ కానిస్టేబుల్ చనిపోయారు. శనివారం అర్ధరాత్రి అబుజ్మడ్లోని అటవీ ప్రాంతంలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ , సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్తంగా గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. ప్రతిగా భద్రతా బలగాలు జరిపిన ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మరణించారు. మావోయిస్టుల కాల్పుల్లో దంతెవాడ డీఆర్జీ హెడ్ కానిస్టేబుల్ సన్ను కరమ్ ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలంలో ఏకే 47తోపాటు సెల్ఫ్ లోడింగ్ రైఫిళ్లు స్వాధీనం చేసుకున్నామని అధికారులు వెల్లడించారు. ఆ ప్రాంతంలో ఇంకా గాలింపు కొనసాగుతున్నదని తెలిపారు.

# అమెరికా ముంగిట మంచు తుపాను ముప్పు

- అమెరికా రాష్ట్రాలలో హై అలర్ట్
- భారీ గా మంచు, వర్షంతోపాటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కు అవకాశం
- . సుమారు 6కోట్ల మంది ప్రజలపై ప్రభావం చూపే చాన్స్

వాషింగ్టన్ : అమెరికా ముంగిట భారీ మంచు తుపాను ముప్పు పొంచి ఉంది. దీంతో అనేక రాష్ట్రాల్లో భారీ స్థాయిలో మంచు, వర్షంతోపాటు అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. ఈ దశాబ్దిలోనే అతి తీవ్ర తుపానుగా వాతావరణశాఖ అంచనా వేస్తోంది. దాదాపు పదిహేనుకుపైగా రాష్ట్రాలపై దీని ప్రభావం ఉండనుందని.. సుమారు 6కోట్ల మంది ప్రభావితమయ్యే అవకాశం ఉందని సమాచారం.మధ్య అమెరికాలో మొదలైన శీతల తుపాను తూర్పు దిశగా కదలనున్నట్లు నేషనల్ వెదర్ సర్వీస్ వెల్లడించింది. పోలార్ వర్టెక్స్ కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. మిస్సోరీ నుంచి మధ్య అట్లాంటిక్ వరకు ఇది విస్తరించనుందని, గడిచి దశాబ్దిలోనే అతి తీవ్ర శీతల తుపానుగా మారనున్నట్లు అంచనా వేసింది. ఈ ప్రాంతాల్లో ప్రయాణం ప్రమాదకరంగా ఉండనుందని పేర్కొంది. మరోవైపు అమెరికాలో 2011 తర్వాత అత్యంత శీతల జనవరిగా నిలవనుందని ప్రైవేటు వాతావరణ విభాగం 'అక్యూవెదర్' కూడా అంచనా వేసింది. దీని తీవ్రత వారం పాటు ఉండనున్నట్లు తెలిపింది. వాతావరణశాఖ హెచ్చరికలతో అనేక రాష్ట్రాలు అప్రమత్తం అయ్యాయి. కెంటకీ, వర్జీనియా, కాన్సాస్, ఆర్కాన్సాస్ రాష్ట్రాలు ఇప్పటికే ఎమర్జెన్సీ విధించాయి. ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని మేరీల్యాండ్ గవర్నర్ కూడా ప్రకటించారు. మిస్సిస్సిపీ, ఫ్లోరిడా వంటి దక్షిణాది రాష్ట్రాలు కూడా ప్రమాదకర చలి వాతావరణం ఉ ఒటుందని హెచ్చరించాయి. మిస్సోరీ, ఇల్లినోయీలో భారీ మంచు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

కన్సాస్, ఇండియానా తదితర ప్రాంతాల్లో 20 సెం.మీ, వర్జీనియాలో 10 నుంచి 25సెం.మీ మేర మంచు కురిసే అవకాశం ఉన్నట్లు అంచనా. ఈ తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వాషింగ్టన్ డీసీ, బాల్టిమోర్, ఫిలడెల్ఫియాలు సిద్ధమవుతున్నాయి. ప్రతికూల వాతావరణం కారణంగా అనేక



ప్రాంతాల్లో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడనుందని.. వాహనదారులు మంచులోనే చిక్కుకుపోయే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మొత్తంగా అమెరికాలో పలు రాష్ట్రాల్లో కోట్ల మందిపై ప్రభావం చూపనుందని.. వాతావరణశాఖ సూచనలను గమనిస్తూ ఉండాలని సూచించింది.

## సంక్రాంతి రద్దీ.. మరో 52 అదనపు రైళ్లు

### ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే



హైదరాబాద్: సంక్రాంతి రద్దీ సందర్భంగా మరో 52 అదనపు రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. నగరంలోని సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి రైల్వేస్టేషన్ల నుంచి కాకినాడ, నర్సాపూర్, తిరుపతి, శ్రీకాకుళం ప్రాంతాలకు ఈ రైళ్లు నడపనున్నట్లు తెలిపింది. ఆయా ప్రాంతాలకు ఈనెల 6 నుంచి 18వ తేదీ వరకు ఇవి అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది.

# జార్జి సోరస్‌కు అవార్డా..? అదొక అపహాస్యం : మస్క్

- బైడెన్ ప్రభుత్వం ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ ఫ్రీడం ఇవ్వడంపై విమర్శలు



వాషింగ్టన్ వివాదాస్పద బిలియనీర్ ఫైనాన్షియర్ జార్జి సోరస్కు అమెరికాలో అత్యుత్తమ పురస్కారమైన ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ ఫ్రీడం ఇవ్వడంపై టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే సోరస్ తీరుపై మస్క్ పలు మార్లు బహిరంగంగానే విమర్శలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఓ పాడ్కాస్ట్లో మస్క్ మాట్లాడుతూ 'అతడు మానవ జాతిని ద్వేషిస్తాడు' అని వ్యాఖ్యానించారు. శ్వేత సౌధంలో జరిగిన కార్యక్రమంలో సోరస్ కుమారుడు ఈ అవార్డును బైడెన్ నుంచి స్వీకరించిన విషయం తెలిసిందే. అనంతరం డార్త్ సిడియోస్ అనే దుష్ట క్యారక్టర్తో పోలుస్తూ ఓ మీమ్ను మస్క్ ఎక్స్లో పోస్టు చేశారు. 'ఇక్కడ జార్జి సోరస్ చూడటానికి బాగున్నారు' అన్న వ్యాఖ్యను కూడా జోడించారు.మరోవైపు రిపబ్లికన్ పార్టీ నేతలు కూడా బైడెన్ సర్కారు నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. అమెరికా ముఖంపై మరో చెంపదెబ్బ అని పేర్కొన్నారు. జాతీయ విలువలకన్నా రాజకీయ అజెండాకే బైడెన్ ప్రాధాన్యమిచ్చారన్నారు. ఈ మేరకు నిక్కీ హేలీ ఎక్స్లో పోస్టు చేశారు. సోరస్ తన సంపదను ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేయడానికి వినియోగిస్తారని కొన్నేళ్లుగా రిపబ్లికన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

హంగేరియన్- అమెరికన్ జార్జ్ సోరోస్(92) ప్రపంచ కుబేరుల్లో ఒకరు. హంగేరీలో 1930లో యూదు కుటుంబంలో జన్మించిన ఆయన.. నాజీల ఆక్రమణ సమయంలో దేశాన్ని వీడారు. 1947లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్లో తత్వశాస్త్రంలో పట్టా పొందారు. 1956లో అమెరికాకు వెళ్లారు. తొలుత యూరోపియన్ సెక్యూరిటీస్లో అనలిస్టుగా పనిచేశారు. 1973లో హెడ్జ్ ఫండ్ను స్థాపించి భారీ పెట్టుబడులతో ప్రపంచ మార్కెట్లలో ప్రముఖ స్థానం సంపాదించుకున్న ఆయన.. విజయవంతమైన ఇన్వెస్టర్గా ఎదిగారు. ఓపెన్ సొసైటీ ఫౌండేషన్స్ ద్వారా మానవ హక్కుల పరిరక్షణ కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం 70కిపైగా దేశాల్లో ఈ సంస్థ కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఆ దేశ రాజకీయాల్లో జోక్యం చేసుకొంటుందనే తీవ్ర విమర్శలు ఈ సంస్థపై ఉన్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీపైనా జార్జ్ సోరోస్ గతంలో విమర్శలు గుప్పించారు.

## దీదీవి దిగజారుడు రాజకీయాలు



కోల్కతా: భారత్లోకి చొరబాటుదారులు ప్రవేశించేందుకు సరిహద్దు భద్రతా దళం సాయం చేస్తోందని పశ్చిమ్ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఇటీవల ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆమె ఆరోపణలను భాజపా ఖండించింది. దిగజారుడు రాజకీయాలకు దీదీ పాల్పడుతున్నారని ప్రతిపక్ష నేత సువేందు అధికారి విమర్శించారు. ఈ మేరకు ఆయన మమతా బెనర్జీకి ఓ లేఖ రాశారు. 'భద్రతా దళాలు దేశానికి సేవ చేస్తాయి.. కానీ, ప్రభుత్వానికి కాదు. వారు దేశ రక్షకులు. గత కొద్ది రోజులుగా పశ్చిమ్ బెంగాల్లో జరుగుతున్న చొరబాటులకు సైనికులను నిందిస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. రాజకీయాల్లో ఆరోపణలు, ప్రత్యారోపణలు ఉంటాయి. అయితే, భద్రతా బలగాలను అందులోకి లాగడం వారిని అవమానించడమే అవుతోంది. మీ వైఫల్యాలను వారికి ఆపాదించడం నీచ రాజకీయం తప్ప మరొకటి కాదు. దేశ సరిహద్దులను, ప్రజలను రక్షించడానికి వారు ప్రాణాలను పణంగా పెడుతున్నారు. అలాంటి వారిని అవమానిస్తూ మీరు చేసిన వ్యాఖ్యలు దేశం మరచిపోదు' అని లేఖలో పేర్కొన్నారు. ఇటీవల బంగ్లాదేశ్ చొరబాటుదారులు భారత్లోకి ప్రవేశించడానికి బీఎస్ఎఫ్ సాయం చేస్తోందని దీదీ ఆరోపించారు. బంగ్లాదేశ్తో సత్సంబంధాలు ఉన్నాయని, భారత్- బంగ్లా సరిహద్దుకు ఇరువైపులా శాంతియుత పరిస్థితులు ఉండాలని వ్యాఖ్యానించారు.


## అమెరికాలోకి భారతీయుల
# అక్రమ రవాణా

కెనడా మీదుగా అమెరికాకు భారతీయులను అక్రమంగా తరలించడం ఇటీవల పెరిగినట్లు వార్తలు వస్తున్నాయి. ఇలా తమ దేశస్థులను కెనడా మీదుగా అక్రమంగా పంపిస్తుండటంపై భారత్ మరోసారి ఆందోళన వ్యక్తం చేసింది. తాజాగా ఈ అంశంతో సంబంధం ఉన్న ఇద్దరు వ్యక్తులు ఓ ఆంగ్లపత్రికతో మాట్లాడుతూ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఈ అక్రమ రవాణాపై గడిచిన రెండేళ్లలో కెనడా వద్ద భారత్ పలుమార్లు అందోళన వ్యక్తం చేసింది. ఇదే విషయంపై గ్లోబల్ అఫైర్స్ కెనడా విభాగం ప్రతినిధి స్పందిస్తూ "భారత్-కెనడా మధ్య విస్తృతమైన ప్రజా సంబంధాలున్నాయి. వేర్వేరు అంశాలపై ఇరు దేశాలు చర్చలు జరుపుతున్నాయి. వీటిలో విదేశాల్లో మా పౌరుల వలసలు, భద్రత, సంక్షేమం వంటి అంశాలుంటాయి. నేరాలు, మోసాలను అదపు చేయడానికి భారత్ అధికారులతో కలిసి పనిచేయడానికి కెనడా సిద్ధంగా ఉంది" అని పేర్కొన్నారు. గుజరాత్కు చెందిన ఓ కుటుంబం.. కెనడా సరిహద్దు నుంచి అక్రమంగా అమెరికాలోకి ప్రవేశిస్తున్న సమయంలో తీవ్రమైన శీతల వాతావరణం కారణంగా 2022 జనవరిలో మరణించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఆధారంగా చేసుకొని ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు భవేష్ పటేల్తో పాటు మరికొందరిపైనా మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసింది. దీనికి సంబంధించి డిసెంబర్ చివరి వారంలో ముంబయి, నాగ్పూర్, గాంధీనగర్, వడోదర సహా మొత్తం 8 ప్రాంతాల్లో ఈడీ ( దాడులు చేసింది.



# ఆరోపణలకు ఆధారాలు చూపించండి

### కేంద్రమంత్రికి సిద్ధరామయ్య సవాల్



బెంగళూరు : కేంద్రమంత్రి హెచ్డీ కుమారస్వామి పై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వంలోని మంత్రులు అవినీతికి పాల్పడు తున్నారని కుమారస్వామి అసత్య ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన చేస్తున్న ఆరోపణలు నిజమైతే తగిన ఆధారాలు చూపించాలని సవాల్ విసిరారు. తగిన రుజువులు లేకుండా తమపై అసంబద్ధమైన ఆరోపణలు చేస్తుంటే చూస్తూ ఊరుకోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మా మంత్రులు 60 శాతం కమీషన్ తీసుకొని..అవినీతికి పాల్పడుతున్నారని కుమారస్వామి ఆరోపిస్తున్నారు. కేవలం ఆరోపణలు చేయడమే ప్రతిపక్షాల పని కాదు. న నిరూపించే వరకు వదిలిపెట్టము" అని ముఖ్యమంత్రి అన్నారు. బస్సు ఛార్జీల పెంపుపై సీఎం మాట్లాడుతూ ఉద్యోగుల జీతాలు, డీజిల్ ధరల పెరుగుదల, కొత్త బస్సుల కొనుగోలు వ్యయం, ద్రవ్యోల్బణం వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. భాజపా అధికారంలో ఉన్నప్పుడు, కుమారస్వామి సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో బస్సు ఛార్జీలు పెంచలేదా అని ప్రశ్నించారు. ఇటీవల మైసూరులో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరు మంత్రులు కాంట్రాక్టర్ల వద్ద కమిషన్లు తీసుకుంటూ దోపిడీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పీడబ్ల్యూడీ, నీటిపారుదల శాఖల్లో దోపిడి మరింత హద్దులు దాటుతోందని అన్నారు. పని కావాలంటే ప్రతి ప్రభుత్వ శాఖలో కొంత మొత్తంలో ఫిక్స్ అమౌంట్ చెల్లించాల్సి ఉందని..అందువల్లే కాంట్రాక్టర్లు, చిన్న స్థాయి ప్రభుత్వ ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సూర్య
విజయవాడ
సోమవారం
6 జనవరి 2025




# చరిత్ర సృష్టించిన 'జై ద్వారకా' క్యాంపెయిన్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి:సముద్ర గర్భంలో ఉన్న పురాతన గుజరాత్లోని ద్వారక నగరం ఒకప్పుడు ప్రపంచానికి రాజధానిగా ఉండేదంటూ ప్రసిద్ధ చరిత్రకారుడు రవీంద్రజిత్ చేసిన పరిశోధనలో అనేక సంచలనాత్మక విషయాలు బయటపడ్డాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇట్స్ సిక్స్త వావ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ద్వారక నగరంపై కొన్నేళ్లుగా చేస్తున్న పరిశోధనలు, కార్యక్రమాలు గుజరాత్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రశంసలు కూడా పొందింది. ప్రపంచ నీటి లోతట్టు నగరాల దినోత్సవం సందర్భంగా ద్వారకలో జై ద్వారకా క్యాంపెయిన్లో భాగంగా నిర్వహించిన శ్రీకృష్ణ జల జప దీక్ష ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు సాధించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో శ్రీకృష్ణ జల జప దీక్ష చేసిన రవీంద్రజిత్ టీమ్ కు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అడ్జుడికేటర్ స్వర్ణ శ్రీ సర్టిఫికెట్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రెస్ క్లబ్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రసిద్ధ చరిత్రకారుడు రవీంద్రజిత్ మాట్లాడుతూ డిసెంబర్ 21న ద్వారకలో 'జై ద్వారకా' క్యాంపెయిన్లో భాగంగా ప్రపంచ నీటి లోతట్టు నగరాల దినోత్సవం సందర్భంగా శ్రీకృష్ణ జల జప దీక్ష నిర్వహించాము. గుజరాత్ పర్యాటక మంత్రిత్వ శాఖ, కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతమైంది. తెలంగాణ రాష్ట్ర పౌరుడిగా ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి ప్రపంచ రికార్డుల్లో భాగమవ్వడం గర్వంగా ఉంది. ప్రాచీన ద్వారక నగరంను పునరావిష్కరించేందుకు, సముద్ర తలాలలో మళ్లీ తవ్వకాలను ప్రారంభించమని భారత ప్రభుత్వానికి వినతి చేయడం ఈ శ్రీకృష్ణ జల జప దీక్ష ముఖ్య ఉద్దేశం. మా 'ఇట్స్ సిక్స్త వావ్' సంస్థ నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సహకరించిన గుజరాత్ ప్రభుత్వా, కేంద్ర ప్రభుత్వ టూరిజంకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. అని చెప్పారు.

## హిందూ ధర్మాన్ని హననం చేసే
# సినిమాలను బహిష్కరించాలి'

- హైందవ శంఖారావంలో సినీ గేయరచయిత అనంత శ్రీరామ్ పిలుపు
- విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం సభ
- కేసరపల్లి హైందవ శంఖరావం సభకు తరలివచ్చిన హిందువులు
- దేవాదాయశాఖను రద్దుచేయాలి: కమలానంద భారతీ స్వామిజీ డిమాండ్
- ఆస్తులు, ఆచారాలు నాశనం చేస్తున్నారంటూ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి ఆగ్రహం

విజయవాడ : హిందూ ధర్మాన్ని నాశనం చేసే సినిమాలను ప్రతి ఒక్కరూ బహిష్కరించాలని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ పిలువునిచ్చారు. అలా చేస్తే అటువంటి సినిమాలకు డబ్బులు రావని, అప్పుడు హిందూ ధర్మాన్ని హననం చేసే సినిమాలను తీయరని తెలిపారు. కృష్ణా జిల్లా కేసరపల్లిలో గన్నవరం సమీపంలో విశ్వ హిందూపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన హైందవ శంఖారావం సభలో అనంత శ్రీరామ్ మాట్లాడారు. వ్యాస భారతం, వాల్మీకి రామాయణం భారత సాహిత్య వాఙ్మయానికి రెండు కళ్లు లాంటివని పేర్కొన్నారు. అలాంటి వాటినే ఎంటర్టైన్మెంట్ కోసం వక్రీకరించారని అన్నారు. సినిమాల్లో హైందవ ధర్మం మీద దాడి జరుగుతోందంటూ మండిపడ్డారు.హిందూ ధర్మానికి కళంకం కలుగుతోంది: వ్యాపారాత్మకమైన కళ, కళాత్మకమైన వ్యాపారం మూవీ అని, అయితే ఈ రెండింటినీ కలిపే క్రమంలో హిందూ ధర్మానికి కళంకం కలుగుతోందని అన్నారు. దేవాలయాలకు ఆత్మగౌరవం కోసం పెద్ద సంఖ్యలో హిందువులు తరలిరావడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు.క్షమాపణలు చెబుతున్నా: ఫిల్మ్ ఇండస్ట్రీలో జరిగే తప్పులను ఆ రంగానికి చెందిన వ్యక్తిగా బాహాటంగానే విమర్శిస్తున్నానని, ఇప్పటి వరకు మూవీస్లో జరిగిన హైందవ ధర్మ హననానికి హిందూ సమాజానికి క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. పురాణాలు ఇతి హాసాల గొప్పతనాన్ని మూవీస్లో తగ్గించి క్యారెక్టర్స్ మార్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్రను వక్రీకరించి హిందూ ధర్మాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. వాల్మీకి, వ్యాసుడు రచనలను ఎంటర్టైన్మెంట్ కోసం వక్రీకరిస్తున్నారని తెలిపారు.

15 సంవత్సరాలుగా ఆ వ్యక్తికి పాటలు రాయలేదు: కృష్ణా జిల్లాకు చెందిన డైరెక్టర్స్, ప్రొడ్యూసర్స్ ఈ పొరపాటు చెప్పకపోతే ఎలా అని, పాత్రల ఔన్నత్యాన్ని మారిస్తే హైందవ ధర్మాన్ని ఆచరించినట్టు కాదని అనంత్ శ్రీరామ్ అన్నారు. నిండు సభలో ద్రౌపది వస్త్రాన్ని తీస్తున్నా మౌనంగా ఉన్న కర్ణుడు గొప్పవాడు ఎలా అవుతారని ప్రశ్నించారు. భారతం, రామాయణం, భాగవతాల్లో పురాణాలను ఇష్టం వచ్చినట్టు మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వక్రీకరణలు, అభూత కల్పనలు చేస్తున్నా మనం చూస్తూ ఊరుకుంటున్నామని అన్నారు. షూటింగ్లో, పాటలలో ఎన్నో రకాల అవమానాలు జరిగాయని వ్యాఖ్యానించారు. ఒక డైరెక్టర్ పాటలో బ్రహ్మాండ నాయకుడు అనే పదం ఉండ కూడదని చెబితే 15 సంవత్సరాలుగా ఆ వ్యక్తికి తాను పాటలు రాయలేదని తెలిపారు. హిందూ ధర్మాన్ని అవమానించేలా తీసిన మూవీస్ని ప్రభుత్వం నిషేధించాలని, లేదంటే హిందువులే పూర్తిగా వాటిని బహిష్కరించాలని పిలువునిచ్చారు. అప్పుడే హిందూ ధర్మానికి ఒక గౌరవం, గుర్తింపు ఉంటాయని అనంత శ్రీరామ్ అన్నారు.



**త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి**




మరోవైపు ఆలయాల ఆస్తులు, ఆచారాలు నాశన మైపోతున్నాయని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నవరం, కేసరపల్లి లైలా గ్రీన్ మెడోస్ ప్రాంగణంలో ఇవాళ (ఆదివారం) హైందవ శంఖారావం ( ) సభ జరిగింది. ఈ సభలో వీహెచ్పీ జాతీయ ప్రతినిధులు, బీజేపీ నేతలు, మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి మాట్లాడారు. ఆలయాలు బాగుంటేనే మనం బాగుంటామని చెప్పారు. మన ఆలయాలకు గతంలో 15 లక్షల ఎకరాలు ఉండేదని చెప్పారు. ఐసుగడ్డ మాదిరిగా కరుగుతూ 4.50 లక్షల ఎకరాలు మాత్రమే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయాలకు కావాల్సిన నిర్ణయాలు ఎవరు చేయాలని ప్రశ్నించారు.

ఆఫీసుల్లో కూర్చునే అధికారులు చేయాలా అని నిలదీశారు. ఆలయాల్లో పూజ ఎంతసేపు చేయాలో ఆఫీసర్ చెప్పాలా...ధర్మాధికారి చెప్పాలా..?? అని ప్రశ్నించారు. ఆలయాలను కట్టుకునే మనం వాటిని నడపలేమా అని అడిగారు. మా ఆలయాలను మేమే నిర్వహించుకుంటాం... అధికారులు అవసరం లేదు అని స్పష్టం చేశారు. ఆలయాల్లో కమిటీలన్నీ రాజకీయంతో నిండిపోతున్నాయిని ఆరోపించారు. ఆలయాల ఆస్తులు తిరిగి వాటికే వచ్చేలా చేయాలని కోరారు. ఆలయాల్లో జరిగే ఆరాధనలు.. సంప్రదాయాల్లో అధికారుల ప్రమేయం ఉండకూడదని షరతు విధించారు. దేవుడి వద్ద వీఐపీ దర్శనాలేంటి అని ప్రశ్నించారు. తిరుపతి వంటి ఆలయాల్లో డబ్బున్నవాళ్లకు వీఐపీ దర్శనాలు, డబ్బులేని వారికి రోజుల తరబడి నిరీక్షణలా అని ఆందోళన వ్యక్తం చేశారు. దేవుడి దర్శనానికి నిబంధనలు పెట్టబట్టే మతమార్పిడులు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. ఆలయాల్లో నిబంధనలు.. సాంప్రదాలను పాటించలేని వారు పక్కకు తొలగాలని హెచ్చరించారు. ఆక్రమణల్లో ఉన్న ఆలయాల ఆస్తులను స్వాధీనం చేయాలని కోరారు. అలా జరగనప్పుడు ఆలయాలు చేయిచాచి అడగనవసరం లేదని చెప్పారు. ఆలయాల్లో దర్శనం టిక్కెట్లతో అవసరం ఉండదన్నారు. మన ఆలయాలను మళ్లీ మన పవర్ ఫుల్ సెంటర్లుగా మార్చుకోవాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి పేర్కొన్నారు.

**దేవాదాయశాఖను రద్దుచేయాలి: కమలానంద భారతీ స్వామిజీ**

మనం నిర్మించుకున్న ఆలయాలపై ప్రభుత్వాల పెత్తనమేంటి అని శ్రీ భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీ స్వామిజీ ప్రశ్నించారు. దేవాదాయశాఖను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సినిమాలకు మాదిరి కౌంటర్లు, టిక్కెట్లు పెట్టి ఆలయాల్లో దైవదర్శనాన్ని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దేవాదాయ , ధర్మాదాయ శాఖ దుర్మార్గమైనదని మండిపడ్డారు. మన రాష్ట్రంలోని దేవాలయాల బోర్డుల్లో హిందూ అనే పదాన్ని తీసేశారని ఆరోపించారు. హిందూ సమాజమంతా దేవాలయాలను



ప్రశ్నించాలని అన్నారు. ప్రభుత్వమే దేవాలయాల భూములను కబ్జాచేసి ప్రభుత్వ కార్యాలయాలు,గోడౌన్లు నిర్మించిందని విమర్శించారు. దేవాలయంలో ఒక దేవుడుంటే 20 హుండీలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. హుండీలు పెట్టి భక్తులను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దేవాదాయ , ధర్మాదాయ చట్టాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని అన్నారు. దశావతారాల్లో ఏడు అవతారాల ఆలయాలు ఉన్నది మన రాష్ట్రంలోనే అని గుర్తుచేశారు. ఏపీని రాష్ట్రప్రభుత్వం



దేవభూమిగా ప్రకటించాలని కోరారు. ఏడు అవతారాల ఆలయాలను కలువుతూ కారిడార్ ఏర్పాటు చేయాలని కమలానంద భారతి స్వామి డిమాండ్ చేశారు.

**డిక్లరేషన్లో కీలక అంశాలివే...**

విజయవాడ: హైందవ శంఖారావంలో విశ్వహిందూ పరిషత్ డిక్లరేషన్ ప్రకటించింది. హిందూ దేవాలయాలకు పూర్తి స్వయంప్రతిపత్తి కలిపిస్తూ చట్టసవరణ చేయాలని డిమాండ్ చేశారు. హిందు ఆలయాల ఆస్తులు, వ్యవస్థలపై దాడులు సరికాదని చెప్పారు. అన్యాయంగా, చట్టవిరుద్ధంగా దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినాయకచవితి, దసరా వేడుకలకు ప్రభుత్వం నుంచి ఆర్థికభారం, అక్రమ ఆంక్షలు తగవు అని చెప్పారు. హిందూ దేవదేవతల శోభాయాత్రల మార్గాలు, తేదీలు, విధానాలపై అక్రమ ఆంక్షలు తగవని అన్నారు. ఆలయాల్లో పూజ, ప్రసాద, కైంకర్య సేవలు అత్యంత భక్తిశ్రద్ధలతో నాణ్యతతో నిర్వహించాలని తెలిపారు. హిందూ ఆలయాల్లో అన్యమత ఉద్యోగులను తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. ట్రస్టు బోర్డులో హిందూ ధర్మంపై భక్తిశ్రద్ధలు ఉండే భక్తులను మాత్రమే సభ్యులుగా నియమించాలని కోరారు. రాజకీయేతర ధార్మిక వ్యక్తులను ట్రస్టుబోర్డుల్లో చోటు కల్పించాలన్నారు. హిందూ దేవాలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుప్రకారం అన్యాక్రాంతమైన ఆస్తులను స్వాధీనం చేసుకుని ఆలయాలకు తిరిగి అప్పగించాలని కోరారు. ఆలయాల నిధులను ప్రభుత్వ కార్యక్రమాలకు దారి మళ్లించరాదని చెప్పారు. హైందవశంఖారావంలో డిక్లరేషన్పై చినజీయర్ స్వామిజీ ప్రతిజ్ఞ చేయించారు



### యూనివర్సిటీ విద్యార్థులకు
# ఫుల్ మెస్ చార్జీల స్కీం పునరుద్ధించండి

**ప్రభుత్వ హాస్టళ్ళకు సొంత భవనాలు నిర్మించండి**

**ఫీజుల బకాయిలు చెల్లించాలి - రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: యూనివర్సిటీలో పిజి తదితర కోర్సులు చదువుతున్న బీసీ/ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు ఫుల్ మెస్ చార్జీల స్కీం పునరుద్ధించాలని, అలాగే ఫీజులు బకాయిలు చెల్లించాలని, అలాగే నగరంలోని బీసీ కాలేజ్ హాస్టల్ లకు సొంతభవనాలు నిర్మించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద జరిగిన బహిరంగ సభలో వేలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు. సభలో ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ యూనివర్సిటీలో 1994 నుంచి ఫుల్ మెస్ చార్జీల స్కీం ఎత్తి వేసిన తర్వాత బీసీ విద్యార్థులు మెస్ బకాయిలు కట్టలేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ స్కీమును 1994 వరకు ఫుల్ మెస్ చార్జీల స్కీము కొనసాగించారు. 1994లో ఈ స్కీమును రద్దు చేసి తగ్గించి ఫిక్సెడ్ మొత్తాన్ని నిర్ణయించారు. పాకెట్ మనీ ఎత్తివేశారు. ఏ నాయకుడు ప్రశ్నించకపోవడంతో అదే కొనసాగింది. ప్రస్తుతం హాస్టళ్లలో మెస్ బిల్లులు 30వేల వరకు వస్తుంది. కానీ స్కాలర్షిప్ మాత్రం 15వేలు వస్తుంది. మిగతా బ్యాలెన్స్ విద్యార్థులు చెల్లించవలసి వస్తుంది. కోర్సు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్లు తీసుకొని సమయంలో బ్యాలెన్స్ డబ్బు కడితే తప్ప సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీనితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు 4వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ లేని పక్షంలో పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఫీజులబకాయిలు రాకపోవడం వలన కోర్సు పూర్తి అయినవారికి సర్టిఫికెట్లు ఇవ్వలేదు. సర్టిఫికెట్లు రాకపోవడంతో ఉన్నత కోర్సులలో చేరడం లేదు. అంతే కాదు ఉద్యోగాలు కూడా పొందడం లేకపోతున్నారు. దేశాలలో ఉన్నత కోర్సులలో చేరే వారికి ఉద్యోగాలు వచ్చిన వారు కూడా సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు కోల్పోతున్నారు. రాష్ట్రంలో 300 బీసీ కాలేజీ హాస్టల్లో ఉంటే ఒక్కదాని కూడా సొంత భవనం లేదు అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆఫీసులకు అన్నింటికీ సొంతభవనాలు కట్టారు, ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన కలెక్టరేట్లకు, ఎమ్మార్వో ఆఫీసులకు, పోలీస్ స్టేషన్లకు అన్నింటికీ సొంతభవనాలు కట్టారు, సొంతభవనాలు లేని ప్రభుత్వ ఆఫీసు లేదు, కానీ బిసి హాస్టళ్ళకు, గురుకుల పాఠశాలలకు ఒక్కదానికి కూడా సొంత భవనం లేదు. ఇది ప్రభుత్వ బీసీ వ్యతిరేక వైఖరినీ తెలుపుతుంది. బీసీలు అంటే ఇంత చిన్నచూపా? రాష్ట్రంలో 300 బీసీ కాలేజీ హాస్టళ్ళు, 330 బీసీ గురుకుల పాఠశాల కాలేజీలు ఉన్నవి. ఒక్కదానికైనా సొంత భవనం కట్టారా? ఈ ఇంత అన్యాయమా! హైదరాబాదులోని కొండాపూర్, మాదాపూర్ ప్రాంతాలకు వెళ్లి చూడండి వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి దొరల కారులు వెళ్లడానికి ఫ్లై ఓవర్లు, స్కై ఓవర్లు పెద్ద ఎత్తున ఎలా కట్టారు, అలాగే అదే ప్రాంతంలో వందలకోట్ల రూపాయలు ఖర్చుపెట్టి 50 కి.మీ దూరం వరకు వాకింగ్ ట్రాక్లు కట్టారు, వాకింగ్ ట్రాకుల మీద ఉన్న శ్రద్ధ, ఎస్సీ/ఎస్టీ/బీసీల అభివృద్ధి మీద లేదా?. హాస్టల్ పిల్లలు మంచి సౌకర్యాలతో హాస్టళ్లలో ఉండి చదువుకొని పెద్ద ఉద్యోగాలు చేయటం ఈ ప్రభుత్వాలకు ఇష్టం లేదా? ఇదేనా ఈ దేశంలో న్యాయం, ధర్మం లేదా!, బీసీలు తిరగబడి పోరాడితే తప్ప న్యాయం జరగదా అని ప్రశ్నించారు.

# బీసీల రాజకీయ పునరేకీకరణ మొదలైంది

**బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్**




తెలంగాణ బ్యూరో ప్రతినిధి: 2 లక్షల పై చిలుకు జనాభాలో ఉన్న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో మెజారిటీ జనాభా కలిగిన బీసీలు రాజకీయంగా తీవ్ర వివక్షను ఎదుర్కుంటున్నారని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. గత 3 నెలలుగా కొనసాగుతున్న ఉమ్మడి జిల్లాల బీసీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో భాగంగా 10 వ ( చివరి ) రౌండ్ టేబుల్ సమావేశాన్ని గోనెల శ్రీనివాస్ నేతృత్వంలో ఆదివారం మహబూబ్ నగర్ టౌన్ లోని పద్మశాలీ భవన్ నందు నిర్వహించింది.. ఈ కార్యక్రమానికి బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ , పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని బహుజన ముక్తి పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు దాసు రామ్ నాయక్ మరియు పలువురు జిల్లా వ్యాప్త సీనియర్ బీసీ నాయకులు , వివిధ కులసంఘాల నేతలు , తెలంగాణ ఉద్యమకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తదనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి దాసు సురేశ్ మాట్లాడుతూఉద్యమాలకు, సోషల్ జస్టిస్ జేఏసీ చైర్మన్ వీజీఆర్ నారగోని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రానున్నది బీసీల రాజ్యమేనన్నారు. ఈ కార్యక్రమానికి బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ భారత మురళీధర్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మడత కిషోర్, పీసీసీ ముఖ్య కార్యదర్శి సంజీవ్ కుమార్ ముదిరాజ్, ప్రముఖ బీసీ నాయకులు మున్నూరు రవి ,జాతీయ ఓబీసీ మోర్చ సంతోష యాదవ్, శాంతి నాయిక్, ఎక్స్ సెంట్రల్ హ్యాండ్లూమ్ టెక్స్టైల్ మెంబర్ సారంగి వినయ కుమార్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గోనెల శ్రీనివాస్, నీలి వెకట్ కిషోర్ పద్మశాలి, గణేష్ గౌడ్, ఫ్రీలాన్స్ రిపోర్టర్ బొమ్మ నరేందర్ పద్మశాలి, మహేందర్ జాంద్ర, పురుషోత్తం రజక, కుర్మయ్య వాల్మీకి, మైత్రి యాదయ్య ముదిరాజ్, పలమూరు డెవలప్మెంట్ చైర్మన్ మున్నూరు రవి, జడ్చర్ల శ్రీనివాసులు, బడేక విశ్వనాథ్ క్షత్రియ, తల్లోజు శేఖర్ చారి, మహేష్ యాదవ్, రామచంద్రయ్య, మైత్రి రమణయ్య, కొంకరి గోపాల్, పెద్ది వెంకటేష్, వన్నాల శ్రీరాం కుమార్, ప్రియదర్శిని మహిళా చేనేత సహకార సంఘం అధ్యక్షురాలు బుదారపు సత్తెమ్మ, నంబి రాజు, సాయి, తదితరులు భారీ ఎత్తున వందల సంఖ్యలో పాల్గొనీ ఈ రౌండ్ టేబుల్ సమావేశం విజయవంతం చేశారు.

# తొడగొట్టి నిలబడాలి.. కాలర్ ఎగరేసి గెలవాలి

- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్ సీట్లలో బీసీలు పోటీ చేయాలి
- అగ్ర కులాల అభ్యర్థులను చిత్తు చిత్తుగా ఓడించాలి
- బీసీల ఓట్లు లేకుండా కనీసం వార్డ్ మెంబర్ గెలుస్తారా
- ఓట్లు మన దగ్గర ఉంటే సీట్లు అగ్రకులాల వా?
- తెలంగాణ రాష్ట్రంలో మిర్యాలగూడ సభ, తాజ్ కృష్ణ సభ అందరిని ఏకం చేసింది
- బీసీలను ఓడగొట్టేందుకు అగ్రకులాల వాళ్ళు డ్రామాలు చేస్తారు
- బీసీల మధ్య కొట్లాట పెట్టి అగ్రకులాల వాళ్ళు లబ్ధి పొందుతున్నారు
- కుర్చేసుకుని ఓట్లు సీట్లు మాయని డిమాండ్ గా ఉన్నప్పుడే నీకు సీటు ఇస్తారు
- తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి మారిపోయింది - తీన్మార్ మల్లన్న
- పంచాయతీ ఎన్నికల్లో బీసీ జెండా ఎగరాలి - బిసి ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ టి చిరంజీవులు
- బీసీల రాజ్యాధికారం కోసం ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం -బత్తుల సిద్దేశ్వర్ పటేల్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులు జనరల్ సీట్లలో తొడగొట్టి నిలబడి కాలర్ ఎగరేసి గెలవాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలువునిచ్చారు బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఘట్కేసర్ లోని జీకే కన్వెన్షన్ లో జరిగిన బిసి రాజకీయ చైతన్య శిక్షణ శిబిరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. ఓసి కులాల అభ్యర్థులను బీసీలు చిత్తుచిత్తుగా ఓడించి తెలంగాణ రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రం మార్చడానికి చైతన్యం కావాల్సిన అవసరం ఉదన్నారు. మన దగ్గర ఓట్లు ఉంటే సీట్లు అగ్రకులాలకు ఇవ్వాలా అని ప్రశ్నించారు. బీసీలు పార్టీల వారీగా విడిపోకూడదని కచ్చితంగా గెలిచే విధంగా వ్యూహాత్మక ఎత్తుగడలు అవలంబించాలని వివరించారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింలు మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసే వారిని ప్రజలు గెలిపిస్తారని చెప్పారు. నిరంతరం ప్రజల్లో ఉండి ఎన్నికల్లో గెలవాలని ఆయన సూచించారు.

రాష్ట్రంలో త్వరలో జరుగు పంచాయతీ ఎన్నికల్లో జనరల్ సీట్లలో బీసీలు అభ్యర్థులుగా నిలబడి గెలవాలని ఇంటలెక్చువల్ ఫోరమ్ చైర్మన్ టీ చిరంజీవులు పిలువునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ ఘట్కేసర్ లోని జెకె కన్వెన్షన్ హాల్లో పంచాయతీ ఎన్నికలు బీసీల పాత్ర అంశంపై బిసి ఇంటలెక్చువల్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా టీ చిరంజీవులు మాట్లాడుతూ మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రజలతో కలిసి పనిచేసి ప్రజల విశ్వాసం చూరగొని సర్పంచ్, వార్డ్ మెంబర్లుగా, ఎంపీటీసీ, జడ్పిటిసిలు, ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీ నేతలకు గెలవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో పంచాయతీరాజ్ సంస్థల పరిణామ క్రమం ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ బీసీలు ఏకమై బిసి అభ్యర్థులు గెలిచేందుకు బిసి కులాల ఐక్యం కావాలని ఆయన కోరారు. గతంలో పల్లెల్లో పట్టణాల్లో బిసిలకు చైతన్యం లేకపోయదని ఇప్పుడు రాజ్యాధికార చైతన్యం వచ్చిందని ఈ నేపథ్యంలో పల్లెలో బిసి చైతన్యము వెల్లువిరిసేందుకు కృషిచేసి బీసీ అభ్యర్థులు గెలవాలని ఆయన అన్నారు. బీసీ నేతలను ఐక్యత చేసేందుకు కుల సంఘాల నేతలు కూడా కృషి చేయాలని ఆయన సూచించారు. కరీంనగర్ మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తుల ఉమా మాట్లాడుతూ ప్రజల సమస్యల పట్ల స్పందించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తే ప్రజలు గెలిపిస్తారని, ప్రజల కోసం పోరాటాలు చేయాలని ఆమె పిలువునిచ్చారు. తెలంగాణ ఉద్యమ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ పార్టీల ఎజెండాలు పక్కనపెట్టి బీసీలు అభ్యర్థుల గెలువు కోసం బీసీలందరూ



ముక్త కంఠంతో కృషి చేయాలని పిలువునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో బీసీల పాత్ర కీలకమని అందుకే మొదట జై బీసీ అన్న తర్వాత జై తెలంగాణ అని సంబోధించాలని సూచించారు. మాజీ ఐఏఎస్ అధికారి సొల్లేటి ప్రభాకర్ మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారానికి మూలం స్థానిక సంస్థలని వాటిని చేజిక్కించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంటా రాముల యాదవ్ తన అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర అధ్యక్షులు రజని, సీనియర్ జర్నలిస్ట్ సిద్ధ గొని సుదర్శన్, ప్రముఖ బిసి నాయకులు బత్తుల సిద్దేశ్వర్ పటేల్, పట్టే జానయ్య యాదవ్, బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు, తమ్మడబోయిన అర్జున్, చామకూర రాజు, కె వి గౌడ్, అవ్వరు వేణు కుమార్, కోలా జనార్ధన్ గౌడ్, కొండల గౌడ్, సాయి కుమార్, డా. ఆలేటి శ్రీనివాస్ గౌడ్, చాపర్తి కుమార్ గాడ్గే, గోరా శ్యామ్ సుందర్ లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి బీసీ సంఘాల నాయకులు కుల సంఘాల నాయకులు, మేధావులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇంకెన్నాళ్లీ డైవర్షన్ పాలిటిక్స్

**ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ గురువు కేసీఆర్**

**ఆయన బాటలోనే రేవంత్ ప్రభుత్వం నడుస్తోంది**

**కాంగ్రెస్ సర్కార్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫైర్**

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఇచ్చిన హామీలపై ప్రజల దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ను మించి పోయిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా 6 గ్యారంటీలను అమలు చేయకుండా కాళేశ్వరం కమిషన్, విద్యుత్ కమిషన్, ఫోన్ ట్యాపింగ్ కేసు, డ్రగ్స్ కేసు అంటూ ప్రతినెలా ఏదో అంశంపై ప్రచారం చేసుకుంటూ పబ్బం గడుపుతున్నారని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికలు తలమీదకు వస్తుండటంతో... కొత్తగా రైతు భరోసా పేరుతో మరో కొత్త డ్రామాకు తెరలేపారని విమర్శించారు. ఇప్పటికే రైతు భరోసా పేరుతో ఎకరాకు రూ.12 వేల చొప్పున మూడు దఫాలుగా రూ.18 వేల రూపాయలు బకాయిపడ్డారని చెప్పారు. ఈ లెక్కన 70 లక్షల మంది రైతులకు రూ.19 వేల 600 కోట్ల రూపాయలు బకాయి పడ్డారని తెలిపారు. ఈ డబ్బులన్నీ జనవరి 26 నాటికి చెల్లిస్తారా? లేదా? రేవంత్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అట్లాగే నిరుద్యోగులకు ఒక్కొక్కరికి రూ.48 వేలు, మహిళలకు రూ.30 వేల చొప్పున దాదావు రూ.50 వేల కోట్లు రేవంత్ ప్రభుత్వం బకాయి పడిందన్నారు. అట్లాగే వృద్దులకు రూ.4 వేలు, పేదలకు ఇండ్ల జాగా, రూ.5 లక్షలు, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు పేరుతో లక్ష కోట్లకుపైగా బకాయి పడిందన్నారు. ఈ సొమ్మెంతా జనవరి 26 నాటికి చెల్లిస్తారా? లేదా? రేవంత్ సర్కార్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, గంగిడి మనోహర్ రెడ్డి, సంకినేని వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధులు ఎన్వీ సుభాష్, రాణి రుద్రమాదేవి, జెనవాడ సంగప్ప, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మలతో కలిసి బండి సంజయ్ మాట్లాడారు. ఆ దేశంలోనైనా రైల్వే, రోడ్లు, ఏవియేషన్ వ్యవస్థ బాగుపడితే... ఆ దేశ ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడతది. అమెరికాలాంటి దేశంలో కూడా మొదట ఈ మూడు రంగాలు బాగుపడిన తరువాతే.. ఆ దేశం అగ్రదేశమైంది... అందుకే నరేంద్ర మోదీ గారి సారథ్యంలో ఆయా రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ముఖ్యంగా చరిత్రలో ఎన్నడూ లేనంతగా మన తెలంగాణకు మోదీ ప్రభుత్వం అత్యధిక నిధులిస్తోంది. గత పదేళ్లలో మోదీ సారథ్యంలో గడ్కరీ ఆశీస్సులతో రోడ్ల విస్తరణ కోసం లక్ష కోట్లు కేటాయించింది. ఇయాళ తెలంగాణలో ఏ మూలకు పోవాలన్నా రెండు గంటల్లో రయ్ రయ్ మంటూ వెళ్లే అవకాశం ఏర్పడిందంటే అది మోదీ గారి ఘనతే కదా... అంతెందుకు కేంద్రమే రూ.18 వేల కోట్లతో ట్రిపుల్ ఆర్ ను నిర్మిస్తున్నం. గ్రామీణ సడక్ యోజన, సీఆర్ఐఎఫ్ నిధుల ద్వారా మారుమూల గ్రామాల్లో కూడా రోడ్లను విస్తరిస్తున్నాం అని స్పష్టం చేశారు. ఇగ రైల్వేల అభివృద్ధి విషయంలో గతంలో ఎన్నడూ లేనంతగా తెలంగాణకు నిధులు కేటాయిస్తూ పరుగులు పెట్టిస్తున్నం. గత పదేళ్లలో 32 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినం. ఈ ఒక్క ఏడాదిలోనే రైల్వే బడ్జెట్ లోనే రూ.5 వేల 336 వేల కోట్లు తెలంగాణకు కేటాయించినం. చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో ఎన్నడూ కేటాయించలేదు. దటీజ్ మోదీ. ఒక్కసారి సికింద్రాబాద్ చూసి రండీ. 720 కోట్లతో సికింద్రాబాద్ స్టేషన్ ను ఎట్లా వరల్డ్ క్లాస్ గా తీర్చిదిద్దుతున్నడు. 350 కోట్లతో నాంపల్లి రైల్వే స్టేషన్ రూపు రేఖలు మారుస్తున్నం. అంతెందుకు రేపు చర్లపల్లి కొత్త టెర్మినల్ ను మోదీ గారు వర్చువల్ గా ప్రారంభించబోతున్నరు. స్వాతంత్ర్యం వచ్చాక తెలంగాణలో మొట్టమొదటి నూతన టెర్మినల్ చర్లపల్లి మాత్రమే. రేపటి నుండి రెగ్యులర్ గా 24 ట్రైయిన్స్ చర్లపల్లి నుండి రాకపోకలు సాగించబోతున్నయ్. మోదీ ఆధ్వర్యంలో ఎన్డీఏ ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసి తెలంగాణను అభివృద్ధి చేస్తుంటే... ఈ కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పొలిటిక్స్ చేస్తూ ప్రజలను దగా చేస్తోంది. 70 ఏళ్లుగా భారతదేశాన్ని అబద్దపు మాటలతో, మోసపు హామీలతోనే మోసం చేసిందన్నారు.



# మహా కుంభమేళాకు సర్వం సిద్ధం

## సుమారు 850 ఏళ్ల నాటిది కుంభమేళా చరిత్ర

## ప్రపంచ నలుమూలల నుంచి భక్తగణం రాక

## 12 ఏళ్లకు ఓ సారి జరిగే భారీ హిందూ సమ్మేళనం

**కుంభమేళా చరిత్ర సుమారు 850 ఏళ్ల నాటిదని చెబుతారు. దీనిని ఆదిశంకరాచార్యులు ప్రారంభించారు. ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే మహా కుంభమేళాలో పాల్గొనేందుకు ప్రపంచం నలుమూలల నుండి ప్రజలు వస్తుంటారు. జ్యోతిషశాస్త్రం ప్రకారం కుంభమేళా నిర్వహణ గ్రహాల స్థానంతో సంబంధం కలిగి ఉంటుంది. అనగా కుంభరాశిలోకి బృహస్పతి ప్రవేశం, మేషరాశిలోకి సూర్యుడు ప్రవేశించడం జరిగితే కుంభమేళాను నిర్వహిస్తారు. ప్రతి 12 సంవత్సరాల తర్వాత మాత్రమే మహా కుంభమేళా అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహిస్తారో తెలుసా? వాస్తవానికి, ఈ జాతర నిర్వహణ వెనుక లోతైన పౌరాణిక విశ్వాసాలు , సంప్రదాయాలు ఉన్నాయి. దాని గురించి పూర్తి వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.**

కుంభ మేళా అనేది హిందువులు జరుపుకునే సంస్కృతీ పరమైన కార్యక్రమాల కోసం చేసే యాత్ర. సాధారణ కుంభ మేళా ప్రతి నాలుగు ఏళ్లకు ఒకసారి జరుగుతుంది. అర్ధ కుంభమేళా ప్రతి ఆరు సంవత్సరాలకు ఒకసారి హరిద్వార్ లేక ప్రయాగలలో జరుగుతుంది. కుంభమేళాను భారతీయ సంస్కృతిలో ఒక ప్రత్యేకమైన మత , సాంస్కృతిక కార్యక్రమంగా పరిగణిస్తారు. ఇది భారతదేశ సాంస్కృతిక వారసత్వంలో ఒక ముఖ్యమైన భాగం. ప్రయాగ్రాజ్, హరిద్వార్, ఉజ్జయిని తో పాటు నాసిక్ ప్రదేశాలలో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి కుంభమేళా జరుగుతుంది.

మత విశ్వాసాల ప్రకారం, ఈ సందర్భంగా పవిత్ర నదులలో స్నానం చేయడం మోక్షానికి దారి తీస్తుంది. అయితే ప్రతి 12 సంవత్సరాలకు మాత్రమే ఈ విశిష్ట కార్యక్రమం ఎందుకు జరుగుతుందో తెలుసా? వాస్తవానికి, ఈ జాతర నిర్వహణ వెనుక లోతైన పౌరాణిక విశ్వాసాలు , సంప్రదాయాలు ఉన్నాయి. పూర్ణ కుంభ మేళా ప్రతి పన్నెండు ఏళ్లకు ఒకసారి ప్రయాగ, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్ లలో జరుగుతుంది. పన్నెండు పూర్ణ కుంభ మేళాలు పూర్తి అయిన తరువాత అంటే నూట నలభై నాలుగు



సంవత్సరాలకు ఒకసారి అలహాబాద్ లో మహా కుంభ మేళాను నిర్వహిస్తారు. అయితే ఈ కుంభమేళా చరిత్ర చాలా ఆసక్తికరమైనది. మహా కుంభమేళాను ప్రతి సంవత్సరం కాకుండా 12 సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు. దేశంలోని నాలుగు ప్రాంతాల్లో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి కుంభమేళాను నిర్వహిస్తారు. హరిద్వార్, ప్రయాగ్రాజ్, నాసిక్, ఉజ్జయిని ప్రాంతాల్లో మహా కుంభమేళాను నిర్వహిస్తారు. చివరిసారిగా 2013లో ప్రయాగ్రాజ్లో మహా కుంభమేళా నిర్వహించగా ఇప్పుడు 2025లో కుంభమేళాను నిర్వహించనున్నారు.



**ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి కుంభమేళాను ఎందుకు నిర్వహిస్తారు? :** కుంభమేళా చరిత్ర సుమారు 850 ఏళ్ల నాటిదని చెబుతారు. దీనిని ఆదిశంకరాచార్యులు ప్రారంభించారు. ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే మహా కుంభమేళాలో పాల్గొనేందుకు ప్రపంచం నలు మూలల నుండి ప్రజలు వస్తుంటారు. జ్యోతిషశాస్త్రం ప్రకారం కుంభమేళా నిర్వహణ గ్రహాల స్థానంతో సంబంధం కలిగి ఉంటుంది. అనగా కుంభ రాశిలోకి బృహస్పతి ప్రవేశం, మేష రాశిలోకి సూర్యుడు ప్రవేశించడం జరిగితే కుంభమేళాను నిర్వహిస్తారు. పన్నెండేళ్ల తర్వాత కుంభమేళా నిర్వహించడానికి ప్రధాన ఆధారం బృహస్పతి కదలికకు సంబంధించినది ఎందుకంటే బృహస్పతి ఒక రాశిలో సుమారు పన్నెండు నెలల పాటు ఉండి, పన్నెండు సంవత్సరాల్లో పన్నెండు రాశుల పర్యటనను పూర్తి చేసి తిరిగి అదే రాశిలోకి చేరుకుంటాడు. ఇలా గురువు పన్నెండేళ్ల క్రితం ఎక్కడ ఉన్నాడో పన్నెండేళ్ల తర్వాత అక్కడికే చేరుకుంటాడు. బృహస్పతి పన్నెండు సంవత్సరాల సంచారం.. పునరావృతం కుంభ రాశి ప్రధాన ఆధారం.

**హిందూ క్యాలెండర్ ప్రకారం..**

మహాకుంభం పౌష పూర్ణిమ రోజున ప్రారంభమై మహాశివరాత్రితో ముగుస్తుంది. 2025 సంవత్సరంలో, మహాకుంభం జనవరి 13న ప్రారంభమై 26 ఫిబ్రవరి 2025న ముగుస్తుంది. మహాకుంభమేళా ఈ మధ్య గల 45 రోజుల పాటు కొనసాగనుంది.

**మహా కుంభమేళా 2025 ప్రధాన తేదీలు:**

13 జనవరి 2025: పౌష్ పూర్ణిమ
14 జనవరి 2025: మకర సంక్రాంతి
29 జనవరి 2025: మౌని అమావాస్య
3 ఫిబ్రవరి 2025: బసంత్ పంచమి
12 ఫిబ్రవరి 2025: మాఘ పూర్ణిమ
26 ఫిబ్రవరి 2025: మహాశివరాత్రి

**కుంభమేళా యొక్క మూలం :** సముద్ర మథనం యొక్క పురాతన కథతో ముడిపడి ఉందని నమ్ముతారు. పురాణాల కథల ప్రకారం సముద్ర మంథనం ప్రారంభం నుంచి కుంభమేళా నిర్వహించబడు తుంది. దేవతలు , రాక్షసులు కలిసి అమరత్వం కోసం అమృతాన్ని పొందడానికి సముద్రాన్ని మథనం చేసినప్పుడు. ఆ సమయంలో మొదట హాలాహలం బయటపడింది. దానిని శివయ్య స్వీకరించాడు. ఆ తర్వాత అమృతం రాగానే దేవతలు ఆ అమృతాన్ని స్వీకరించి అమరత్వాన్ని సొంతం చేసుకున్నారు ఈ సమయంలో అమృతం యొక్క కొన్ని చుక్కలు 12 ప్రదేశాలలో పడ్డాయట. వాటిలో నాలుగు ప్రదేశాలు భూమిపై ఉన్నాయని చెబుతారు. అవే ఇప్పుడు కుంభమేళ జరుగుతున్న ప్రయాగ్రాజ్, హరిద్వార్, ఉ జ్జయిని, నాసిక్ ప్రాంతాలు. ఈ ప్రదేశాలలో కుంభమేళా నిర్వహించబడటానికి కారణం కూడా ఇదే. జ్యోతిషశాస్త్రం ప్రకారం బృహస్పతి గ్రహం ప్రతి 12 సంవత్సరాలకు 12 రాశుల చక్రాన్ని పూర్తి చేస్తుంది. బృహస్పతి ఒక నిర్దిష్ట రాశిలో ఉన్న సమయంలో కుంభమేళా నిర్వహించబడుతుంది.

**కుంభమేళా, 12 సంఖ్య పాముఖ్యత :** సమయ వ్యత్యాసం కారణంగా దేవతల పన్నెండు రోజులు మానవుల పన్నెండు సంవత్సరాలతో సమానం. అందుకే ఒక సంవత్సరం తర్వాత ప్రతి ప్రదేశంలో గొప్ప పండుగ కుంభమేళా జరుగుతుంది. సముద్ర మంథనం సమయంలో అమృతం భాండం కోసం దేవతలు, రాక్షసుల మధ్య యుద్ధం 12 దైవిక రోజులు కొనసాగింది. ఈ సమయం మానవులకు 12 సంవత్సరాలుగా పరిగణించ బడుతుంది. అందుకే 12 ఏళ్లకు ఒకసారి కుంభమేళా జరుపు కుంటారు. ఈ కాలంలో నదులు అమృతంగా మారతాయని చెబుతారు. అందువల్ల ప్రపంచం నలుమూలల నుండి అనేక మంది యాత్రికులు కుంభమేళాకు స్నానమాచారించడానికి వస్తారు.

**కుంభమేళా జరిగే 4 స్థలాలు :** పురాణాల ప్రకారం దేవతలు మరియు రాక్షసుల మధ్య యుద్ధం 12 సంవత్సరాలు(మానవుల) కొనసాగింది. ఈ యుద్ధ సమయంలో అమృత భాండం నుంచి 2 చోట్ల అమృతం చుక్కలు పడ్డాయి. వాటిలో ఎనిమిది స్వర్గంపై, నాలుగు భూమిపై పడ్డాయి. కుంభమేళా నిర్వహించబడే ప్రయాగ్రాజ్, హరిద్వార్, ఉజ్జయిని , నాసిక్లలో ఈ మకరందం పడినట్లు నమ్మకం.



**నదీ స్నానం ప్రాముఖ్యత :** కుంభమేళా సమయంలో పవిత్ర నదులలో స్నానం చేయడం అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఈ సమయంలో నదుల నీరు అమృతం వలె స్వచ్ఛంగా మారుతుందని నమ్ముతారు. అందుకే ఈ సమయంలో భక్తులు స్నానాలు చేయడానికి సుదూర ప్రాంతాల నుండి వస్తారు. గంగా, యమున , సరస్వతి కలిసే ప్రయాగ్రాజ్ సంగమ ప్రదేశం ప్రత్యేక మతపరమైన ప్రాముఖ్యతను కలిగి ఉంది. భక్తులు ఇక్కడ పుణ్య స్నానాలు చేసి తమ పాపాల నుండి విముక్తి పొంది మోక్షాన్ని పొందే ఆశీస్సులు ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తారు.

**సత్య ఎంవిఎస్**
**హైదరాబాద్**



## తెలుగు రాష్ట్రాల నుంచి ప్రత్యేక ప్యాకేజీ



కుంభమేళా టూర్ ప్యాకేజీలో 8 రోజుల ( 7 రాత్రులు) పర్యటనలో మూడు పుణ్య క్షేత్రాలను సందర్శించుకోవచ్చు. సికింద్రాబాద్ నుంచి బయలు దేరే ఈరైలు తెలుగు రాష్ట్రాల మీదుగా కాశీ.. అయోధ్య.. ప్రయాగ్ రాజ్ వెళ్తుంది. జనవరి 19 తేదీన సికింద్రాబాద్ లో ఈ ట్రైన్ ప్రారంభమవుతుంది. ఈ ట్రైన్ లో మొత్తం 576 సీట్లు ఉండగా వాటిలో స్లీపర్ 320.. థర్డ్ ఏసీ 206.. సెకండ్ ఏసీ 50 ఉన్నాయి. సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్లలో బోర్డింగ్.. డీబోర్డింగ్ కు అవకాశం ఉంటుంది.

**ప్యాకేజీ వివరాలు ఇలా..( ఒక్కొక్కరికి)**

స్లీపర్ క్లాస్ .. రూ. 22, 635 ( పెద్దలకు)
స్లీపర్ క్లాస్ .. రూ. 21, 740 ( పిల్లలకు )
థర్డ్ ఏసీ...రూ. 31,145(పెద్దలకు)
థర్డ్ ఏసీ...రూ. 30,095( పిల్లలకు)
సెకండ్ ఏసీ...రూ 38,195(పెద్దలకు)
సెకండ్ ఏసీ...రూ 36,935(పిల్లలకు)

2025 జనవరి 19 న సికింద్రాబాద్ నుంచి బయలు దేరిన ఈ ట్రైన్ .. జనవరి 21 వ తేదీన వారణాసి లోని బనారస్ చేరుకుంటుంది. అక్కడ భోజనం చేసి గంగా హారతికి వెళతారు. ఆ తరువాత ఆ రోజు అక్కడ విశ్రాంతి తీసుకొని జనవరి 22 వతేదీన రోడ్డు మార్గంలో 120 కిలో మీటర్లు ప్రయాణించి ప్రయాగ్ రాజ్ చేరుకుంటారు. అక్కడ టెంట్ సిటీలో స్టే చేసి.. భోజనం చేసి కుంభమేళాకు వెళతారు. పుణ్యస్నానం ఆచరించి.. అక్కడ చూడాల్సిన ప్రదేశాలను సందర్శించి.. టెంపుల్ సిటీలో జనవరి 22 వ తేదీ రాత్రి బస చేస్తారు. జనవరి 23 వ తేదీన రోడ్డు మార్గంలో కాశీ( వారణాసి)కి వెళ్తారు. కాశీ విశ్వనాథ దేవాలయం, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణా దేవి ఆల యా న్ని సందర్శించి .. ఆరోజు రాత్రి అక్కడే ఉంటారు. ఇక అక్కడి నుంచి జనవరి 24వ తేదీ అయోధ్యకువెళ్లి శ్రీ రామజన్మ భూమి, హనుమాన్ గర్హిని సందర్శిస్తారు. అదే రోజు అనగా జనవరి 24 వతేదీ రాత్రి 10 గంట లకు అయోధ్య నుంచి తిరుగు ప్రయాణం మొదలవుతుంది. 25 వ తేదీ అంతా ట్రైన్లో ప్రయాణించి 26 వ తేదీకి మరల సికింద్రాబాద్ చేరుకుంటారు



# ‘సూపర్ స్టార్ సంస్కృతి’ వద్దు..

### కోహ్లీపై మాజీ ఆల్ రౌండర్ తీవ్ర విమర్శలు



టెస్టుల్లో నిలకడగా రాణించలేకపోతున్న విరాట్ కోహ్లీ పై భారత మాజీ ఆల్రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ తీవ్ర విమర్శలు గుప్పించాడు. టీమ్ఇండియాకు సూపర్ స్టార్ సంస్కృతి అవసరం లేదని, కోహ్లీని పక్కనపెట్టి అతడి స్థానంలో యువ ఆటగాడిని తుది జట్టులోకి తీసుకోవడానికి సమయం ఆసన్నమైందన్నాడు. విరాట్ దేశవాళీ క్రికెట్ ఎందుకు ఆడట్లేదని ప్రశ్నించాడు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్ లో ఓటమి అనంతరం ఇర్ఫాన్ పఠాన్ స్టార్ స్పోర్ట్స్తో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ బీజీటీలో కోహ్లీ 9 ఇన్నింగ్స్లో 23.75 సగటుతో 190 పరుగులు మాత్రమే చేశాడు. పెర్త్లో జరిగిన తొలి టెస్టులో మాత్రం ఒక సెంచరీ చేశాడు. తర్వాత భారీ స్కోర్లు చేయలేకపోయాడు. ఆఫ్స్టంప్ ఆవల పడే బంతులను వేటాడి పెవిలియన్ చేరాడు. ఈ ఆసీస్ పర్యటనలో కోహ్లీ ఏడుసార్లు ఇదే విధంగా ఔట్ కావడం గమనార్హం. ‘2024లో టెస్టుల్లో మొదటి ఇన్నింగ్స్లో కోహ్లీ సగటు కేవలం 15. గత ఐదేళ్లలో అతని గణాంకాలను పరిశీలిస్తే సగటు 30 కూడా లేదు. సీనియర్ ఆటగాడి నుంచి భారత జట్టు ఆశించేది ఇదేనా? కోహ్లీకి బదులుగా ఒక యువ ఆటగాడికి రెగ్యులర్గా అవకాశాలు ఇస్తే అతను కూడా సగటున 25-30 పరుగులు చేస్తాడు. ఎందుకంటే మనం ఇక్కడ జట్టు గురించే చర్చిస్తున్నాం. వ్యక్తుల గురించి కాదు. టీమ్ఇండియాకు ‘సూపర్ స్టార్ సంస్కృతి’ అవసరం లేదు. జట్టు సంస్కృతి అవసరం. విరాట్ కోహ్లీ ఖాళీగా ఉన్నప్పుడు చివరగా దేశవాళీ క్రికెట్లో ఎప్పుడు ఆడాడో చెప్పండి? అతను డొమెస్టిక్ క్రికెట్ ఆడి దాదాపు దశాబ్దం అయింది. దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ కూడా దేశవాళీ క్రికెట్ ఆడాడు. కొన్నాళ్లకు అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. సచిన్ డొమెస్టిక్ క్రికెట్ ఆడాల్సిన అవసరం లేదు. కానీ అతను కూడా ఆడటానికి వచ్చాడు’ అని ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నాడు.

# డబ్ల్యూటీసీ ఫైనల్ నుంచి భారత్ ఔట్

## సౌతాఫ్రికాను ఢీ కొట్టనున్న ఆస్ట్రేలియా - దాదాపు పదేళ్ల తర్వాత బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ ఆసీస్ కైవసం



ఆసీస్ గడ్డపై హ్యాట్రిక్ సిరీస్ సాధించడం అటుంచితే.. కోల్పోకుండా ఉండాలని భావించిన భారత్కు ఓటమి తప్పలేదు. సిడ్నీ వేదికగా జరిగిన ఐదో టెస్టును ఆసీస్ గెలుచుకుంది. దాదాపు పదేళ్ల తర్వాత బోర్డర్ - గావస్కర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. సిరీస్తోపాటు ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ ఫైనల్ బెర్తును ఆసీస్ ఖాయం చేసుకుంది. మరోవైపు సిరీస్ను కోల్పోవడమే కాకుండా మూడోసారి డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుకోవాలనే భారత్ ఆశలు గల్లంతయ్యాయి. రసవత్తరంగా మారుతుందని భావించిన సిడ్నీ టెస్టులో ఎలాంటి అద్భుతం జరగలేదు. బుమ్రా బౌలింగ్ చేయకపోవడంతో ఆసీస్ ఎదుట ఉంచిన 162 పరుగుల లక్ష్యాన్ని భారత్ కాపాడుకోలేకపోయింది. ఆస్ట్రేలియా కేవలం 27 ఓవర్లలోనే నాలుగు వికెట్లను కోల్పోయి టార్గెట్ను ఛేదించింది. తొలి ఇన్నింగ్స్లో భారత్ 185 పరుగులు చేయగా.. ఆసీస్ 181 పరుగులకు పరిమితమైంది. ఇక రెండో ఇన్నింగ్స్లో టీమ్ఇండియా 157 పరుగులకు పరిమితమైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్గా స్కాట్ బోలాండ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్గా జస్ప్రీత్ బుమ్రా అవార్డులు సాధించారు.

**దూకుడే మంత్రం..** బుమ్రా లేకపోవడంతో భారత బౌలింగ్పై ఆసీస్ ఓపెనర్లు ఎదురు దాడికి దిగారు. యువ ఓపెనర్ సామ్ కొన్స్టాస్ (22) వచ్చీ రావడంతోనే దూకుడు ప్రదర్శించాడు. ప్రధాన పేసర్ సిరాజ్ కూడా ఆరంభంలో లెగ్ సైడ్ బంతులు వేయడంతో ఆసీస్ పని ఇంకా సులువైంది. మొదటి రెండు ఓవర్లలోనే 26 పరుగులను ఆసీస్ ఓపెర్లు రాబట్టారు. అయితే, ప్రసిధ్ కృష్ణ (3/65) స్వల్ప వ్యవధిలో వికెట్లు తీసి ఆసీస్పై ఒత్తిడి పెంచాడు. ఉస్మాన్ ఖవాజా (41) హాఫ్ సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. సిరాజ్ (1/69) బౌలింగ్లో ఔటయ్యాడు. అయితే, ట్రావిస్ హెడ్ (34లి), వెబ్స్టర్ (39లి) ఐదో వికెట్కు అజేయంగా 58 పరుగులు జోడించి ఆసీస్ను గెలిపించారు. స్టీవ్ స్మిత్ (4), మార్నస్ లబుషేన్ (6) విఫలమయ్యారు.

**అదే తేడా..**

ఆసీస్తో సిరీస్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ బుమ్రా.. రెండో ఇన్నింగ్స్లో బౌలింగ్కు రాలేదు. ఇదే భారత్ను ఇబ్బందికి గురి చేసింది. సిరాజ్, ప్రసిధ్, నితీశ్తో కూడిన పేస్ విభాగం ఆసీస్ను అడ్డుకోలేకపోయింది. అదే బుమ్రా ఉండుంటే.. ఆస్ట్రేలియా బ్యాటర్లు స్వేచ్ఛగా ఆడేందుకు ప్రయత్నించేవారు కాదు. అప్పటికీ త్వరగానే మూడు వికెట్లను పడగొట్టినా.. ఖవాజా, హెడ్, వెబ్స్టర్ను కట్టడి చేయలేకపోయారు. ఈ సిరీస్లో ఇప్పటివరకు బుమ్రా 32 వికెట్లు తీశాడు. ఇప్పుడీ కీలక సమయంలో బుమ్రా సేవలు లేకపోవడంతో సిరీస్నుసమం చేసే అవకాశాన్ని భారత్ చేజార్చుకుంది.





# 46 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టిన స్టార్ పేసర్

### జస్ప్రీత్ బుమ్రా ఖాతాలో అరుదైన ఘనత




సిడ్నీ: ప్రతిష్ఠాత్మక బోర్డర్ గవాస్కర్ సిరీస్లో భాగంగా భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా రికార్డులు తిరగరాస్తున్నాడు. వికెట్ల వేట కొనసాగించిన బుమ్రా 46 ఏళ్ల రికార్డును బద్ధలుకొట్టాడు. 5 టెస్టుల సిరీస్లో ఆస్ట్రేలియా గడ్డ మీద అత్యధిక వికెట్లు (32లి) తీసిన భారత బౌలర్గా నిలిచాడు బుమ్రా. ఐదు టెస్టుల సిరీస్లో కీలకమైన చివరి టెస్టు సిడ్నీ వేదికగా జరుగుతోంది. తొలి టెస్టుకు సారథ్యం వహించిన జస్ప్రిగ్ బుమ్రా ఐదో టెస్టుకు సైతం భారత కెప్టెన్గా వ్యవహరిస్తున్నాడు.

**బిషన్ సింగ్ బేడీ రికార్డు బద్ధలు :** ఈ క్రమంలో భారత పేసర్ బుమ్రా అరుదైన ఘనత సాధించాడు. ఆస్ట్రేలియా గడ్డ మీద 5 లేక అంతకంటే ఎక్కువ టెస్టుల సిరీస్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్గా నిలిచాడు బుమ్రా. భారత స్పిన్ దిగ్గజం బిషన్ సింగ్ బేడీ పేరిట ఉన్న రికార్డును బద్ధలుకొట్టాడు. 1977/ 78 సీజన్లో ఆస్ట్రేలియాతో జరిగిన 5 టెస్టుల సిరీస్లో స్పిన్నర్ బిషన్ సింగ్ బేడీ 31 వికెట్లు తీశాడు. దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా ఇదే అత్యుత్తమం. హర్భజన్, అనిల్ కుంబ్లే, రవిచంద్రన్ అశ్విన్, జహీర్ ఖాన్ లాంటి దిగ్గజ బౌలర్లు వచ్చినా ఈ రికార్డును మాత్రం అధిగమించలేకపోయారు. బోర్డర్- గవాస్కర్ టెస్ట్ సిరీస్లో 5వ టెస్ట్ ప్రారంభానికి ముందు బుమ్రా ఈ సిరీస్ లో 30 వికెట్లు పడగొట్టాడు. సిడ్నీ టెస్టులో తొలి రోజు ఆసీస్ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజాను ఔట్ చేసిన బుమ్రా శనివారం రెండో రోజు ఆటలో మార్నస్ లబుషేన్ వికెట్ తీయడంతో బుమ్రా ఖాతాలో అరుదైన రికార్డ్ చేరింది. ఈ టెస్ట్ పూర్తయ్యే సరికి బుమ్రా మరికొన్ని వికెట్లు తన ఖాతాలో వేసుకుని మరో భారత బౌలర్కు అందనంత ఎత్తులో నిలవనున్నాడు.

అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన భారత బౌలర్గా బుమ్రా కొనసాగుతున్నాడు. 2024లో 13 టెస్టుల్లోనే 71 వికెట్లు తీసి లీడింగ్ వికెట్ టేకర్గా బుమ్రా నిలిచాడు. కీలక సమయంలో వికెట్లు తీస్తూ భారత్ విజయాలలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటులో లేని సమయంలో కెప్టెన్గానూ సేవలు అందిస్తున్నాడు. అనుభవం ఉన్న కెప్టెన్లలా బుమ్రా వ్యూహాలు రచిస్తూ, అటు బౌలింగ్ లోనూ జట్టును ముందుడి నడిపిస్తున్న తీరు అమోఘం. ఒకవేళ రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తప్పిస్తే బుమ్రాకు బీసీసీఐ టెస్టు సారథ్య బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.

# అతడికి హక్కేలేదు

### బుమ్రాతో కొన్స్టాస్ వాదనపై గంభీర్



సిడ్నీ టెస్టు తొలి ఇన్నింగ్స్లో భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాతో ఆసీస్ యువ ఆటగాడు సామ్ కొన్స్టాస్ వాగ్వాదానికి దిగిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత బంతికే ఉస్మాన్ ఖావాజాను బుమ్రా ఔట్ చేశాడు. దీంతో భారత ఆటగాళ్ల కొన్స్టాస్ వైపు చూస్తూ సంబరాలు చేసుకున్నారు. వీటిపై ఆసీస్ కోచ్ మెక్డొనాల్డ్ స్పందిస్తూ.. ‘భారత ఆటగాళ్ల సంబరాలు కాస్త భయపెట్టేలా ఉన్నాయి’ అని వ్యాఖ్యానించాడు. వాటిపై గౌతమ్ గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్లో స్పందించాడు.

“కఠినమైన క్రీడలో సున్నితంగా ఉండలేరు. అలాగని ఎవరూ బెదిరింపులకు దిగరు. ఈ విషయంలో కొన్స్టాస్కు మాట్లాడే హక్కే లేదు. బుమ్రా, ఉస్మాన్ ఖవాజా సంభాషించుకుంటున్నప్పుడు మధ్యలో అతడు వెళ్లాల్సిన అవసరం లేదు. బ్యాటింగ్ కోసం స్ట్రైకింగ్లో ఉన్న ఆటగాడు, అంపైర్, బౌలర్ మాత్రమే మాట్లాడుకొనే అంశం. అది కొన్స్టాస్ పని కాదు” అని గంభీర్ వ్యాఖ్యానించాడు. “జట్టులోని ప్రతి ఒక్కరినీ సమానంగా చూసే బాధ్యత నాదే. కొందరికి ప్రాధాన్యం ఇచ్చి.. మరికొందరిని దూరం చేయడం నాకు ఇష్టం ఉండదు. జట్టులోని ప్రతి ఒక్కరూ దేశవాళీ క్రికెట్ ఆడాలని కోరుకుంటా. వారు అందుబాటులో ఉన్నప్పుడు తప్పకుండా ఆడాలి. సుదీర్ఘ ఫార్మాట్లో నిబద్ధతతో ఆడాలనుకుంటే.. దేశావాళీ క్రికెట్ను మరిచిపోకూడదు” అని తెలిపాడు

# టీమిండియాపై సునీల్ గవాస్కర్ ఫైర్



టీమిండియా ఆస్ట్రేలియా చేతిలో చిత్తుగా ఓడిపోయింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని కోల్పోయింది. తొలిసారి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్షిప్ ఫైనల్ నుంచి ఔట్ అయింది. ఈ క్రమంలోనే క్రికెట్ లెజెండ్ సునీల్ గవాస్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. 10 ఏళ్ల తర్వాత తొలిసారిగా బోర్డర్-గవాస్కర్ సిరీస్ ట్రోఫీని భారత జట్టు కోల్పోయింది. సిడ్నీ వేదికగా జరిగిన చివరి, 5వ టెస్టులో ఆసీస్ చేతిలో భారత్ ఓడిపోయింది. దీంతో ఆస్ట్రేలియా జట్టు 3-1తో సిరీస్ ను కైవసం చేసుకుంది. ఈ ఓటమితో భారత జట్టు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్షిప్ ఆశలు గల్లంతయ్యాయి. ఆదివారం సిడ్నీ క్రికెట్ గ్రౌండ్లో జరిగిన బిజిటి చివరి టెస్టులో భారత్ 6 వికెట్ల తేడాతో ఓడిపోయింది. నిర్ణయాత్మక టెస్టులో ఆస్ట్రేలియా 163 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఈజీగానే ఛేదించింది. భారత సిరీస్ కోల్పవడంతో జట్టు ఆటగాళ్లపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రేట్ ఇండియన్ బ్యాట్స్మెన్ సునీల్ గవాస్కర్ తన, అలన్ బోర్డర్ పేరుతో ఉన్న ట్రోఫీని ఆస్ట్రేలియా జట్టుకు అందించడానికి ఆహ్వానించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఐదవ, చివరి టెస్టులో భారత్ను ఆరు వికెట్ల తేడాతో ఓడించి ఆస్ట్రేలియా 10 ఏళ్లలో తొలిసారి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని గెలుచుకుంది. ఆ సమయంలో సునీల్ గవాస్కర్ గ్రౌండ్ లోనే ఉన్నాడు. అయితే, మైదానంలో ఉన్నప్పటికీ గవాస్కర్ను పిలవకపోవడంతో అలన్ బోర్డర్ ఆస్ట్రేలియా జట్టుకు బీజీటీ ట్రోఫీని అందించాడు. టెస్టు సిరీస్ పూర్తయిన తర్వాత భారత మాజీ క్రికెట్ లెజెండ్ సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ.. ‘అవార్డు పంపిణీ వేడుకకు వెళ్లడం ఆనందంగా ఉండేది. అన్నింటి కంటే, ఇది బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ.. ఆస్ట్రేలియా-భారతదేశానికి సంబంధించినది. నేను మైదానం లోనే ఉన్నాను. ఆస్ట్రేలియాకు ట్రోఫీ ఇచ్చినా పట్టించుకోను. మెరుగైన క్రికెట్ ఆడి విజయం సాధించారు. అయితే, నేను భారతీయుడిని కాబట్టి నా స్నేహితుడు అలెన్ బోర్డర్తో కలిసి ట్రోఫీని అందజేయడం ఆనందంగా ఉండేదని అన్నారు.

### విజయ్ హజారే ట్రోఫీ..

# హైదం బాద్కు నాలుగో విజయం





అహ్మదాబాద్: విజయ్ హజారే ట్రోఫీ 2024-25 సీజన్లో హైదరాబాద్ నాలుగో విజయం సాధించింది. ఆదివారం అహ్మదాబాద్లోని ఎడీఎస్ఎ రైల్వేస్ క్రికెట్ మైదానంలో అరుణాచల్ ప్రదేశ్తో జరిగిన ఏడో రౌండ్ మ్యాచ్లో హైదరాబాద్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తనయ్ త్యాగరాజన్ (5/32), అనికేత్ రెడ్డి (4/14) విజృంభించడంతో తొలుత బ్యాటింగ్ చేసిన అరుణాచల్ ప్రదేశ్ 28.3 ఓవర్లలో 96 పరుగులకే కుప్పకూలింది. సిద్ధార్థ్ బలోడి (29) టాప్ స్కోరర్. ధ్రువ్ సోని (20), బికి కుమార్ (15) పరుగులు చేశారు. ఈ స్వల్ప లక్ష్యాన్ని హైదరాబాద్ 12 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. తన్మయ్ అగర్వాల్ (22), కె నితీశ్ రెడ్డి (15), పి నితీశ్ రెడ్డి (29లి), కొడిమెల హిమతేజ (21లి) పరుగులు చేశారు.

**ఆంధ్రకు మూడో ఓటమి :** ముంబయి: విజయ్ హజారే ట్రోఫీలో గత ఐదు మ్యాచ్లో వరుసగా మూడింటిలో గెలిచి జోరు మీద కనిపించిన ఆంధ్ర.. లీగ్ దశ చివర్లో తడబడింది. గత మ్యాచ్లో మహారాష్ట్ర చేతిలో ఓడిన ఆంధ్ర.. ఆదివారం హిమచల్ప్రదేశ్తో జరిగిన ఏడో రౌండ్ మ్యాచ్లోనూ ఓటమిపాలైంది. ఓవరాల్గా ఆ జట్టుకిది మూడో ఓటమి. తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర 49.2 ఓవర్లలో 197 పరుగులకు ఆలౌటైంది. వినయ్ (44) టాప్ స్కోరర్. పృథ్వీ రాజు (37), సందీప్ (27), శ్రీకర్ భరత్ (27) పరుగులు చేశారు. 198 పరుగుల లక్ష్యాన్ని హిమచల్ప్రదేశ్ 38.1 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ అంకిత్ కల్సి (100లిబీ 126 బంతుల్లో 12 ఫోర్లు) శతకం బాదాడు. రిషి ధావన్ (45బీ 42 బంతుల్లో 7 ఫోర్లు) రాణించాడు. దిగ్విజయ్ (26), సుమిత్ వర్మ (26) రన్స్ చేశారు.

# రూ.450 కోట్ల స్కాం..

## శుభ్మన్ గిల్ సహా నలుగురు గుజరాత్ ప్లేయర్లకు సీఐడీ నోటీసులు?

గుజరాత్లో రూ 450 కోట్ల చిట్ పండ్ మోసం కేసులో భారత స్టార్ ప్లేయర్ శుభ్ మన్ గిల్ సహా ఐపీఎల్ జట్టు గుజరాత్ టైటాన్స్ టీమ్ లోని మరో నలుగురు ప్లేయర్ల పేర్లు ఉన్నాయని పలు రిపోర్టులు పేర్కొంటున్నాయి. గుజరాత్తో పాటు దేశవ్యాప్తంగా సంచలనం రేపిన పోంజీ స్కామ్ సెగ క్రికెటర్లనూ తాకడంలో మరోసారి హాట్ టాపిక్ గా మారింది. ఈ కేసును గుజరాత్ సిఐడి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శుభ్ మన్ గిల్ తో పాటు సాయి సుదర్శన్, రాహుల్ తివేటియా, మోహిత్ శర్మ పేర్లు కూడా ఉన్నాయి. నలుగురు క్రికెటర్లకు సమన్లు జారీ చేయాలని గుజరాత్ సిఐడి పోలీసులు భావిస్తున్నారు.

**చిట్ఫండ్ కుంభకోణంలో గుజరాత్ ప్లేయర్లు :** ఇటీవల, రూ.450 కోట్ల చిట్ఫండ్ కుంభకోణానికి సంబంధించి ప్రధాన నిందితుడైన భూపేంద్రసింగ్ జాలాను అధికారులు విచారించారు. బ్యాంకులు అందించే దాని కంటే ఎక్కువ వడ్డీ ఇస్తామని ప్రజలను మోసం చేసి రూ.6 వేల కోట్లను సేకరించిన భూపేంద్ర సింగ్ ఝలాను గుజరాత్ సీఐడీ అరెస్ట్ విచారించగా క్రికెటర్ల అంశం బయటకు వచ్చిందని సమాచారం. ఈ చిట్ఫండ్ లో క్రికెటర్లు శుభ్ మన్ గిల్, సాయి సుదర్శన్, రాహుల్ తివేటియా, మోహిత్ శర్మ పెట్టుబడి పెట్టారు. భూపేంద్రసింగ్ జాలా వాంగ్మూలం ఆధారంగా మోసానికి సంబంధించి క్రికెటర్లపై గుజరాత్ సిఐడి పోలీసులు చర్యలు తీసుకోనున్నారని సమాచారం.ప్రస్తుతం శుభ్ మన్ గిల్ ఆస్ట్రేలియాతో జరుగుతున్న 5వ టెస్ట్ మ్యాచ్లో రోహిత్ శర్మ స్థానంలో ఆడుతున్నాడు. ఈ మ్యాచ్ తర్వాత భారత క్రికెటర్లు స్వదేశానికి తిరిగి వస్తారు. ఆ తర్వాత శుభ్ మన్ గిల్ తో పాటు నలుగురు క్రికెటర్లకు సమన్లు జారీ చేసే అవకాశం ఉంది.

### ₹450 కోట్ల చిట్ ఫండ్ మోసం ఎలా జరిగింది?

గుజరాత్ సీఐడీ ప్రకారం.. థలోత్, హిమ్మత్నగర్, వడోదరతో సహా గుజరాత్లోని వివిధ జిల్లాల్లో కార్యాలయాలను ప్రారంభించారు. పెట్టుబడిదారుల నుండి డబ్బును సేకరించడానికి అనేక మంది ఏజెంట్లను నియమించాడు. ఐసిఐసిఐ బ్యాంక్, ఐఎఫ్సి బ్యాంక్ ద్వారా ₹6,000 కోట్ల లావాదేవీలు జరిగాయి. 2024 ఐపిఎల్లో గుజరాత్ టైటాన్స్ జట్టు కెప్టెన్ శుబ్మన్ గిల్ కూడా ₹1.95 కోట్లు పెట్టుబడి పెట్టాడు. మోహిత్ శర్మ, సాయి సుదర్శన్, రాహుల్ తేవాటియా లకు తక్కువ మొత్తాన్ని పెట్టుబడి పెట్టారు. సంబంధిత విషయాలపై క్రికెటర్లు ఇంకా ఎవరూ స్పందించలేదు. పెట్టుబడులను సేకరించిన సంస్థ పనితీరుపై అనుమానం రావడంతో పలువురు ఫిర్యాదు చేయడంలో ఈ భారీ స్కామ్ వెలుగులోకి వచ్చింది.

### విచారణకు క్రికెటర్ల సహకారం ఉంటుందా?

అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పరీక్షిత్ రాథోడ్ మాట్లాడుతూ.. ఎక్కువ వడ్డీ ఇస్తామని చెప్పి పెట్టుబడిదారుల నుండి డబ్బును సేకరించినట్లు జాలా కంపెనీ అయిన బిజెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఏజెంట్లు తెలిపారు. మోసం ఫిర్యాదులు రావడంతో %జ×ణ% దర్యాప్తు ప్రారంభించింది. అప్పుడు జాలా పరారయ్యాడు. ఒక నెల తర్వాత అంటే డిసెంబర్ 27న గుజరాత్లోని మెహసానా జిల్లాలో అతన్ని అరెస్టు చేశారు. జనవరి 4 వరకు జాలాను కస్టడీలో ఉంచారు. ఈ కేసులో మరో ఏడుగురిని కూడా అరెస్టు చేసినట్టు తెలిపాడు. .

### పోంజీ స్కామ్.. ఎవరీ భూపేంద్రసింగ్ జలా?





రూ. 450 కోట్ల పోంజీ స్కీమ్ ప్రధాన ఆపరేటర్ భూపేంద్రసింగ్ జలా. అతను గుజరాత్లోని సబర్కాంతలోని హిమ్మత్నగర్ పట్టణానికి చెందినవాడు. 2020-2024 మధ్య తన సంస్థ బిజెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ద్వారా 11,000 మందికి పైగా పెట్టుబడిదారుల నుండి వేలకోట్లను సేకరించారు. దాదాపు రూ. 450 కోట్ల స్కామ్ కు పాల్పడ్డారని గుర్తించారు. బ్యాంకులు ఇచ్చే వడ్డీ కంటే అధికంగా వడ్డీ అందిస్తామని చెప్పి పెట్టుబడిదారులను ఆకర్షించాడు. ప్రారంభంలో వారి విశ్వాసాన్ని పొందేందుకు ఈ వాగ్దానాలను నెరవేర్చాడు. అయితే, సంస్థ పనితీరుపై అనుమానంతో పలువురు పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది.

# మహేష్‌తో రావిపూడి మరో మూవీ

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు.. ఇప్పుడు దర్శకధీరుడు రాజమౌళితో చేస్తున్న సినిమా కోసం సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. హైదరాబాద్ లో ఇటీవల పూజా కార్యక్రమాలు జరగ్గా.. త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలు కానున్నట్లు తెలుస్తోంది. అందుకు గాను జక్కన్న ఏర్పాట్లను పూర్తి చేసే పనిలో ఉన్నారు. అయితే సూపర్‌స్టార్ మహేష్‌బాబు 29కి విజయేంద్రప్రసాద్ కథ అందించగా.. ఎం ఎం కీరవాణి బాణీలు కడుతున్నారు. హీరోయిన్ గా గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రాను.. విలన్ గా పృథ్వీరాజ్ సుకుమారన్ ను ఫిక్స్ చేసినట్లు కొద్దిరోజులుగా టాక్ వినిపిస్తోంది. ఇండియాతో పాటు కెన్యాలో షూటింగ్ జరపనున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ప్రపంచాన్ని చుట్టేసే ఓ సాహస ప్రయాణంగా, అటవీ నేపథ్యంలో సాగే కథతో సినిమా తెరకెక్కిస్తున్నట్లు.. రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. రీసెంట్ గా గేమ్ ఛేంజర్ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో హీరో రామ్ చరణ్ చెప్పినట్లు.. 2026లో సూపర్‌స్టార్ మహేష్‌బాబు 29 ఫస్ట్ పార్ట్ రిలీజ్ అయ్యే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. అయితే రాజమౌళితో మహేష్ మూవీ స్టార్ట్ అయ్యే లోపు.. ఆయన అనిల్ రావిపూడితో ఓ సినిమా చేస్తే బాగుండేదని ఆ మధ్య అనేక మంది ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. జక్కన్న ప్రాజెక్ట్ కంప్లీట్ అవ్వడానికి టైమ్ పడుతుంది.. దానికి తోడు రావిపూడి స్పీడ్ గా సినిమా పూర్తి చేస్తారు.. అందుకే అలా జరిగి ఉంటే బాగుండేదని అనుకున్నారు. ఇప్పుడు ఆ విషయంపై అనిల్ రావిపూడి స్పందించారు. మహేష్ తో రాజమౌళి మూవీ ఉండడమే కరెక్ట్ అని, మధ్యలో తనతో పని చేయడం కరెక్ట్ కాదన్నట్లు తెలిపారు. మహేష్ చాలా క్లారిటీగా ఉన్నారని తెలిపారు. ఆయనతో ఈ మధ్య రెండు మూడు యాడ్స్ చేశానని.. కొంతకాలం జర్నీ చేశానని చెప్పారు. "మహేష్ ఒకటి ఫిక్స్ అయ్యారంటే అది నెక్స్ట్ లెవెల్ లో ఉంటుంది. మైండ్ బ్లాక్ సాంగ్ అందుకు ఎగ్జాంపుల్.. అప్పటి వరకు మహేష్ అంతలా డ్యాన్స్ చేయలేదు. ఆ సినిమాకు సాంగ్ కంపోజ్ అయిన వెంటనే.. బ్రదర్ ఈ సాంగ్ నా కోసమే అని చెప్పారు.. చేస్తా అని ఫిక్స్ అయ్యారు.. చేసేశారు.. గుంటూరు కారం అయితే వేరే లెవెల్" అని తెలిపారు.






సూర్య సినిమా

suryachitramagazine@gmail.com

# రాజమౌళికి ఓకే చెప్పుద్దా?

మహేష్ బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా పూజా కార్యక్రమాలు ఇటీవలే ప్రైవేట్‌గా పూర్తి చేశారు. ఎటువంటి మీడియా సమాచారం లేకుండా.. ఏహడావిడి లేకుండా మొదలుపెట్టారు. మీడియాకు ఆ వీడియోస్ ఎక్కడా కూడా రాకుండా జక్కన్న చాలా జాగ్రత్త పడ్డారనే చెప్పాలి. దాదాపు షూటింగ్ అంతా కూడా ఇలానే చాలా సీక్రెట్ గా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఫారెస్ట్ అడ్వెంచర్ గ్లోబల్ ట్రొట్టింగ్ సినిమాగా వస్తున్న ఈ సినిమాలో కథానాయిక ఎంపిక ఇంకా ఫైనల్ అవ్వలేదు. కానీ మీడియా మాత్రం ప్రియాంక చోప్రా ఫిక్స్ అని ఒకటే హడావిడి చేస్తున్నారు. రాజమౌళి సినిమా గురించి ఏదైనా వార్త వేసినా చాలు అది వెంటనే వైరల్ అవు తుంది. అందుకే జక్కన్న సినిమా అంటే చాలు మీడియా అంతా అలర్ట్‌గా ఉంటుంది. మహేష్ 29 సినిమాలో ముందు హాలీ వుడ్ హీరోయిన్‌నే తీసుకోవాలని అనుకున్నారు కానీ మధ్యలో ఏమైందో ఏమో కానీ ప్రియాంకా చోప్రా డిస్కషన్స్ లోకి వచ్చింది. రాజమౌళి ఆలోచన ఏంటన్నది తెలియదు కానీ ఎస్.ఎస్.ఎం.బి 29 సినిమా హీరోయిన్‌గా ప్రియాంక చోప్రా ని కన్ఫర్మ్ చేస్తున్నారు. బాలీవుడ్ నుంచి హాలీవుడ్ ప్రమోట్ అయ్యాక మళ్లీ తిరిగి ఇండియన్ సినిమాల వైపు చూడలేదు ప్రియాంకా చోప్రా. కానీ ఆమెను తీసుకు రావాలనే ప్రయ త్నాలైతే ఎప్పటి నుంచో జరుగుతున్నాయి. రాజమౌళి అండ్ టీం ఈ విషయాన్ని ఎప్పుడు కన్ఫర్మ్ చేస్తారన్నది చూడాలి. ఐతే ఒకవేళ రాజమౌళి ఆమెకు ఆఫర్ ఇస్తే మాత్రం కాదనే ఛాన్స్ లేదు. ఎలాగు మన దగ్గర పీసీ క్రేజ్ ఏంటో తెలి సిందే. అదే కాకుండా రాజమౌళి ఆర్.ఆర్.ఆర్ ఇంటర్నేషనల్ లెవెల్‌లో ఇంపాక్ట్ చూపించింది. అందుకే మహేష్ సినిమాకు ఆఫర్ వస్తే మాత్రం కాదనే ఛాన్స్ అయితే లేదు. ఐతే ప్రియాంక చోప్రా దాకా రాజమౌళి వెళ్లాడో లేదో తెలియదు కానీ మహేష్ సినిమాలో ఆమె ఫిక్స్ అన్నట్టుగా మీడియా ఒకటే హంగామా చేస్తుంది. పీసీ సినిమాలో ఉంటే అటు గ్లామర్ పరంగా ఇటు యాక్టింగ్ పరంగా అదిరిపోతుంది. ఆమె ఏం చేసినా సంథింగ్ స్పెషల్ అన్నట్టే ఆడియన్స్ ఫిక్స్ అయ్యారు. ఇక ఈ విషయం పక్కనపెడితే... ఎంత రాజమౌళి పాన్ ఇం డియా డైరెక్టర్ ఆఫర్ ఇస్తే మాత్రం తిరిగి తెలుగు నసినిమా చేయడానికి ఆమె ఒప్పుకుంటుందా అన్న వాదనలు కూడా మరో పక్క వినబడు తున్నాయి. రాజమౌళి అయితే ఇక్కడ ఎవరి క్రేజ్ వాళ్ళకే ఉంది. ప్రియాంకకి మాత్రం క్రేజ్ ఏమీ తక్కువ కాదు కదా... సడెన్‌గా హాలీవుడ్ మూవీస్‌లో నటించి అమాంతం క్రేజ్ సంపాదించేసింది పీసీ.



# స్టెప్పులే... స్టెప్పులు

నందమూరి బాలకృష్ణ నటించిన 'డాకు మహారాజ్' సినిమా సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్స్ లో భాగంగా ఇప్పటికే రిలీజ్ చేసిన పాటలకు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. రీసెంట్ గా విడుదల చేసిన "దబిడి దిబిడి" సాంగ్ యూట్యూబ్ లో 11 మిలియన్లకు పైగా వ్యూస్ తో ట్రెండింగ్ లో కొనసాగుతోంది. అదే సమయంలో ఈ పాటలో స్టెప్పులపై సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ నడుస్తోంది. 'దబిడి దిబిడి' పాటను బాలయ్య, ఊర్వశీ రౌతేలాల మీద చిత్రీకరించారు దర్శకుడు బాబీ. ఇదొక మాస్ డ్యాన్స్ నంబర్. దీనికి శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశాడు. ఇంతకముందు ఎప్పుడూ బాలకృష్ణ చేయని మాస్ స్టెప్పులను కంపోజ్ చేసే ప్రయత్నం చేశాడు. అయితే ఈ డ్యాన్స్ మీద నెటిజన్ల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఆయన గతంలో కొరియోగ్రఫీ చేసిన 'మా మా మహేష్', 'భూమ్ బద్దల్' పాటల్లోని డ్యాన్స్ మూవ్స్ ను రిపీట్ చేశాడని ట్రోల్ చేస్తున్నారు. శేఖర్ మాస్టర్ సెల్యులాయిడ్ అంటూ అన్ని పాటలను మిక్స్ చేసి పోస్టులు పెడుతున్నారు. ముఖ్యంగా 'దబిడి దిబిడి' పాటలో ఊర్వశి బ్యాక్ మీద బాలయ్య చేతులతో దరువు వేయడం, నాభి కింద చేయి పెట్టి డ్రెస్ లాగడం వంటి స్టెప్పుల మీద తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. బాలకృష్ణ లాంటి సీనియర్ హీరో, ఒక నియోజకవర్గానికి ఎమ్మెల్యే నటించిన పాటకు అలాంటి కొరియోగ్రఫీ చేయడం ఏంటని శేఖర్ ను విమర్శిస్తున్నారు. మాస్ స్టెప్పుల పేరుతో వల్గారిటీ కనిపించేలా డ్యాన్స్ కంపోజ్ చేస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. నిజానికి 'మిస్టర్ బచ్చన్' సినిమాలో సితార్ పాటకు, 'పుష్ప 2'లో పీలింగ్స్ సాంగ్ కు కూడా శేఖర్ ఇలాంటి స్టెప్పులనే కొరియోగ్రఫీ చేసాడు. హీరోయిన్ బొడ్డు కింద చెయ్యి పెట్టి చీర లేదా డ్రెస్సును లాగే స్టెప్పును హీరోలతో వేయించాడు. ఇప్పుడు 'దబిడి దిబిడి' పాటలోనూ సేమ్ డ్యాన్స్ మూమెంట్స్ పెట్టాడు. సితార్ సాంగ్ లో మాదిరిగా హీరోయిన్ నడుము మీద తబలా వాయించే స్టెప్పును కూడా రిపీట్ చేసాడు. ఇవే ఇప్పుడు ట్రోల్ చెయ్యడానికి నెటిజన్లకు అవకాశం కల్పించాయి. శేఖర్ ప్రస్తుతం టాలీవుడ్ టాప్ కొరియోగ్రాఫర్స్ లో ఒకరుగా రాణిస్తున్నారు. మహేశ్ బాబు లాంటి సూపర్ స్టార్ తో 'గుంటూరు కారం' సినిమాలో మాస్ స్టెప్పులు వేయించి అందరి ప్రశంసలు అందుకున్నారు. అయితే మిస్టర్ బచ్చన్, డాకు మహారాజ్ చిత్రాల్లో డ్యాన్స్ మూవ్స్ విషయంలో విమర్శలు ఎదుర్కొన్నాడు. ఇవి మరీ టూమచ్ ఉన్నాయని, వల్గర్ ఫీలింగ్ కలిగించేలా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



# 2025: పాన్ ఇండియా రిలీజులు..

గడిచిన ఏడాది కాలంలో టాలీవుడ్ నుంచి అనేక పాన్ ఇండియా సినిమాలు వచ్చాయి. వాటిల్లో 'హను-మాన్', 'కల్కి 2898 ఏడీ', 'దేవర పార్ట్-1', 'పుష్ప 2: ది రూల్' వంటి కొన్ని సినిమాలు మాత్రమే వరల్డ్ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటాయి. దీంతో ఇప్పుడు 2025లో వచ్చే పాన్ ఇండియా చిత్రాల మీద అందరి దృష్టి పడింది. ఎందుకంటే ఈ సంవత్సరంలో స్టార్ హీరోలు నటిస్తున్న పెద్ద సినిమాలు, పలు భారీ బడ్జెట్ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. కాకపోతే వాటి విడుదల తేదీల్లోనే గందరగోళం నెలకొంది. టాలీవుడ్ హ్యాపీ: ఏపీ ఓకే.. తెలంగాణ సంగతేంటి? మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న సోషియో ఫాంటసీ యాక్షన్ మూవీ "విశ్వంభర". వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయింది. సంక్రాంతికి రిలీజ్ కావాల్సింది కానీ, రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' రావడంతో ఫెస్టివల్ రేసు నుండి తప్పుకుంది. అయితే చిరు సినిమాని మళ్ళీ ఎప్పుడు విడుదల చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. సమ్మర్‌లో విడుదల కానుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి కానీ, ఇప్పటికే ఆ సీజన్ లో అనేక పెద్ద సినిమాల రిలీజులు ప్రకటించబడ్డాయి. ఒకవేళ విశ్వంభర మూవీ రావాలని అనుకుంటే, మిగతా చిత్రాలను వాయిదా వేసుకోవలసి అవసరం ఉంటుంది. రెబల్‌స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'ది రాజా సాబ్' సినిమాని వేసవిలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మారుతీ దర్శకత్వంలో ఈ రొమాంటిక్ హారర్ కామెడీ తెరకెక్కుతోంది. ఇప్పటికే సినిమా షూటింగ్ దాదాపు కంప్లీట్ అయిపోయింది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు అనౌన్స్ చేశారు. అయితే సీజీ వర్క్ ఎక్కువగా ఉండటం వల్ల విడుదలలో జాప్యం జరుగుతోందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనికి తగ్గట్టుగానే సిద్ధూ జొన్నలగడ్డ 'జాక్' మూవీని ఏప్రిల్ 10న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. అనురాగ్ కశ్యప్ విమర్శలను తిప్పికొట్టిన శంకర్ తేజ సజ్జ నటిస్తున్న 'మిరాయ్' సినిమాని ఏప్రిల్ 18న విడుదల చేస్తామని షూటింగ్ స్టార్ట్ చేసినప్పుడే డేట్ వేశారు. కానీ అదే తేదీకి అనుష్క శెట్టి పాన్ ఇండియా మూవీ 'ఘాటి' వస్తుందని ప్రకటించారు. ఆ తర్వాతి వారంలో ఏప్రిల్ 25న మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' రానుందని చెబుతున్నారు. కానీ 'ది రాజాసాబ్' చెప్పిన డేట్ కి రావాలని ఫిక్స్ అయితే మాత్రం ఈ మూడు సినిమాల విడుదల తేదీలలో మార్పులు చోటుచేసుకుంటాయి. ఇక ధనుష్, కింగ్ అక్కినేని నాగార్జున కలిసి నటిస్తున్న 'కుబేర' చిత్రాన్ని మార్చి లేదా ఏప్రిల్ లో రిలీజ్ చేస్తారని అంటున్నారు. విజయ్ దేవరకొండ నటిస్తున్న సినిమాని మార్చి 28న థియేటర్లలోకి తీసుకొస్తామని చాన్నాళ్ళ కిందటే ప్రకటించారు. కానీ అదే డేట్ కు పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' మూవీని షెడ్యూల్ చేయబడింది. ఆయన నటిస్తున్న మూవీని కూడా మార్చి నెలాఖరున రిలీజ్ చేస్తామని మేకర్స్ చెప్పారు కానీ, పవన్ ప్రాధాన్యతను బట్టి చూస్తే ముందుగా వీరమల్లు వస్తుందని స్పష్టమవుతోంది. అదే జరిగితే రౌడీ స్టార్ మూవీని పోస్ట్ పోన్ చెయ్యాల్సి ఉంటుంది. కాకపోతే తర్వాత ఏ డేట్ కు వెళ్తారనేదే తెలియడం లేదు. దసరా సీజన్ మీద అందరి కంటే ముందు నందమూరి బాలకృష్ణ కర్చీఫ్ వేశారు. 'అఖండ 2: తాండవం' చిత్రం కోసం సెప్టెంబర్ 25న తేదీని ఖరారు చేశారు. కానీ సాయి దుర్గ తేజ్ నటిస్తున్న సంబరాల ఏటుగట్టు' సినిమాని అదే డేట్ కి తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. ఒకవేళ 'రాజా సాబ్' మార్చి నుంచి షిఫ్ట్ అయితే, విజయ దశమికి వచ్చే అవకాశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. పవన్ కల్యాణ్ డేట్స్ ఇస్తే 'ఓజీ' మూవీ కూడా అదే సీజన్‌లో ప్లాన్ చేసే ఛాన్స్ ఉంది. వీటికి తోడు 'కాంతార చాప్టర్ 1' లాంటి డబ్బింగ్ సినిమాలు కూడా పోటీకి వస్తున్నాయి. ఇలా 2025లో ప్లాన్ చేయబడిన పాన్ ఇండియన్ సినిమాల రిలీజ్ డేట్స్ లో క్లారిటీ రావడం లేదు. విడుదల తేదీలు ప్రకటిస్తూ ఏ సినిమా ఎప్పుడు వస్తుందనేది కచ్చితంగా తెలియడం లేదు.



# మూడు సినిమాలతో ప్రభాస్

2023లో ఆదిపురుష్, సలార్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ప్రభాస్ 2024లో మాత్రం 'కల్కి 2898 ఏడీ' సినిమాతో మాత్రమే వచ్చాడు. ప్రతి ఏడాది రెండు సినిమాలను విడుదల చేయాలని ప్రభాస్ చాలా గట్టి ప్రయత్నాలు చేస్తున్నా ఏవో కారణాల వల్ల సాధ్యం కావడం లేదు. ఆయన నుంచి ఈ ఏడాదిలో ఎన్ని సినిమాలు వస్తాయి అనేది అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'రాజాసాబ్' సినిమా షూటింగ్ ముగింపు దశకు చేరుకుందట. టాకీ పార్ట్ దాదాపు పూర్తి అయ్యింది, నాలుగు పాటల చిత్రీకరణ మాత్రమే బ్యాలన్స్ ఉందని తెలుస్తోంది. ఏప్రిల్‌లో సినిమా అనుకున్నా కొన్ని కారణాల వల్ల వాయిదా పడే అవకాశాలు ఉన్నాయి. రాజాసాబ్ సినిమాను ఏప్రిల్ నుంచి తప్పించినా కచ్చితంగా సమ్మర్‌లోనే విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రభాస్, మారుతి కాంబో సినిమా రాజాసాబ్ 2025 సమ్మర్‌కి దాదాపుగా కన్ఫర్మ్ అయ్యింది. ఇదే ఏడాదిలో ప్రభాస్ నుంచి మరో రెండు సినిమాలు రాబోతున్నాయి. అందులో ఒకటి ఆయన గెస్ట్ అప్పియరెన్స్ ఇచ్చిన 'కన్నప్ప'. మంచు విష్ణు హీరోగా రూపొందుతున్న కన్నప్ప సినిమాలో ప్రభాస్ నటించడంతో అంచనాలు పెరిగాయి. ఎంత సమయం ప్రభాస్ ఆ సినిమాలో నటిస్తాడు అనేది క్లారిటీ లేదు. కానీ ప్రభాస్ ఫ్యాన్స్ కన్నప్ప సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కన్నప్ప సైతం ఈ ఏడాది సమ్మర్‌లోనే విడుదల కాబోతుంది. రాజాసాబ్‌తో సమాంతరంగా సీతారామం సినిమా దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో సినిమాను ప్రభాస్ చేస్తున్నాడు. ఆర్మీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాకు ఫౌజీ అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. టైటిల్‌ను అధికారికంగా ప్రకటించలేదు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ షూటింగ్ పూర్తి చేసిన హను రాఘవపూడి సినిమాను సమ్మర్ వరకు పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. యుద్ధం - ప్రేమ బ్యాక్ డ్రాప్‌లో సినిమా ఉంటుందట. భారీ యుద్ధ సన్నివేశాలు ఉన్నా సినిమాను చాలా స్పీడ్‌గా పూర్తి చేయాలని దర్శకుడు హను రాఘవపూడి ప్లాన్ చేస్తున్నారు. అనుకున్నది అనుకున్నట్లుగా జరిగితే 2025లోనే ప్రభాస్, హను రాఘవపూడి కాంబోలో రూపొందుతున్న ఫౌజీ సినిమా వచ్చే అవకాశాలు ఉన్నాయి. అదే కనుక జరిగితే 2025లో ప్రభాస్ నటించిన మూడు సినిమాలు విడుదల అయినట్లు అవుతుంది. గతంలో ఎప్పుడూ ఇలాంటి అరుదైన ఘటన జరగలేదు. కెరీర్ ఆరంభం నుంచి ప్రభాస్ నటించిన సినిమాలు ఒకే ఏడాది మూడు విడుదలైన సందర్భాలు లేవు. కనుక 2025 సంవత్సరం ఆయనకు స్పెషల్‌గా నిలుస్తుంది అంటూ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈమూడు సినిమాలు కాకుండా సలార్ 2, స్పిరిట్ సినిమాలను సైతం ఈ ఏడాదిలోనే ఆయన చేసే అవకాశాలు ఉన్నాయి. కానీ అవి 2026లో ప్రేక్షకుల ముందుకు వస్తాయని తెలుస్తోంది.



# వాళ్లని సైతం రాజమౌళి దారిలో

లెజెండ్లు ఊరకనే ఎవ్వరూ అయిపోరు. ఎంత ట్యాలెంట్ ఉన్నా? ఒదిగి ఉండటం అన్నది లెజెండ్లలలో గొప్ప లక్షణం. బిగ్ బీ అమితాబచ్చన్, మెగాస్టార్ చిరంజీవి, సూపర్ స్టార్ రజనీకాంత్, విశ్వనటుడు కమల్ హాసన్ వీళ్లంతా లెజెండ్లు అయ్యారంటే? కారణంగా ఆ ఒదిగి ఉండే లక్షణం కూడా ఒక్కటి. లెజెండరీలు అయినా ఇప్పటికీ తాము ఎలా ఎదిగాం అన్నది సందర్భం వచ్చిన ప్రతీసారి చెబుతుంటారు. తమ సీనియర్లకు వాళ్లే ఇచ్చి రెస్పెక్ట్.. వాళ్ల గురించి మాట్లాడే విధానం చూస్తే అందుకే వీళ్లు వాళ్ల సరసన చేరారు అనిపిస్తుంది. తాజాగా ఇండియన్ గ్రేట్ డైరెక్టర్లు శంకర్- రాజమౌళి ఒకరి గురించి ఒకరు గేమ్ ఛేంజర్ ప్రెస్ మీట్ లో ఎలా మాట్లాడుకున్నారన్నది తెలిసిందే. తాను అసిస్టెంట్ డైరెక్టర్ గా ఉన్నప్పుడు శంకర్ ను తాను స్ఫూర్తిగా భావించినట్లు చెప్పారు. కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమాగా కీర్తించారు. ఇక రాజమౌళి భారతీయ చిత్రాన్ని ఏకంగా హాలీవుడ్ కి తీసుకెళ్లారని శంకర్ కూడా అంతే గొప్పగా భావించారు. తన సినిమా ట్రైలర్ జక్కన్న చేతుల మీదుగా రిలీజ్ అవ్వడంతో ఎంతో గౌరవంగా భావించారు. ఈ రెండు సందర్భాలు చాలవా? డైరెక్టర్స్ డిక్షనరీలో వాళ్లెంత గొప్పవాళ్లు అనడానికి. ఇక తెలుగు వారిపై శంకర్ ఎప్పుడూ ప్రత్యేకమైన అభిమానం చూపిస్తుంటారు. ఆయన సినిమాలపై ఎనలేని అభిమానాన్ని తెలుగు ఆడియన్స్ ఎప్పుడూ చూపిస్తుంటారు. కానీ తమిళ అభిమానులు మాత్రం తెలుగు సినిమాల్ని ఎలా ట్రీట్ చేస్తారు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. అక్కడ పరిశ్రమ నుంచి తెలుగు సినిమా అంటే థియేటర్లు కేటాయింపులో వివక్ష చూపిస్తుంటారు. నాన్ తమిళీయన్ అనే భావన కనిపిస్తుంది. తమ హీరోలకు, దర్శకులకు ఇచ్చిన ప్రాధాన్యత తెలుగు వారికి ఇవ్వరనే విమర్శ చాలా కాలంగా ఉంది. దీన్ని నిర్మూలించాలని శంకర్, సూర్య, రజనీ, కమల్ లాంటి వారు చాలాసార్లు ప్రయత్నించారు. కానీ అది పూర్తి స్థాయిలో జరగలేదు. ఇలాంటివన్నీ ఇతర రీజియన్స్ లో తమిళ క్రియేటర్స్ కి నెగిటివ్ గా మారుతున్నాయి. అయితే శంకర్ గురించి రాజమౌళి గర్వంగా మాట్లాడంతో? వాళ్లలోనూ మార్పు కదలిక కనిపిస్తుంది. రాజమౌళి వ్యాఖ్యల్ని తమిళ మీడియాలో వైరల్ చేస్తున్నారు.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.